ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ప్రకాశం
శుక్రవారం 12, జూలై 2024



ఒంగోలులోని మహిళా మార్ట్

మార్ట్‌లలో లాభాలు ఇస్తాం.. వాటిల్లో వచ్చిన ఆదాయం ఏడాది తర్వాత చెల్లిస్తామంటూ గత వైసీపీ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీ గాల్లో కలిసిపోయింది. ఇంతవరకు చెల్లించిన సొమ్ముకే గతి లేదని పొదుపు మహిళలు వాపోతున్నారు. జనం సొమ్ముతో జగనన్న మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేసినా ఒక్కపైసా ఆదాయం చూపించకపోవడంపై అనుమానాలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం మారింది.. పాలకులు మారినా మెప్మా అధికారులు తమ వైఖరిని మార్చుకోలేదు. పొదుపు మహిళలు మార్ట్‌లోనే సరుకులు కొనాలని బలవంతం చేయడం, లేకుంటే రుణాలు ఇవ్వబోమంటూ హెచ్చరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆర్పీలకు రోజువారీ అమ్మకాల టార్గెట్ ఇవ్వడంతో వారు బెదిరించి సరుకులు అమ్ముతున్నారంటూ పొదుపు మహిళలు మండిపడుతున్నారు.

మారని మెప్మా..!

- మార్ట్‌లో బలవంతపు అమ్మకాలు
- కొనాల్సిందేనంటూ పొదుపు మహిళలపై ఒత్తిడి

ఆర్పీలకు రోజువారీ అమ్మకాల బాధ్యతలు

కొనకుంటే రుణాలు ఇచ్చేది లేదంటూ వెల్లడి


టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చినా

పాత పద్ధతి కొనసాగింపుపై ఆగ్రహం

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 11 : కొత్త ప్రభుత్వం కొలువుదీరినా మెప్మాలో ఏం మార్పు రాలేదు. గత వైసీపీ ప్రభుత్వ వాసనలు ఇంకా పోలేదు. పట్టణ పేదరిక నిర్మూలనే లక్ష్యం.. ప్రతి మహిళ ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా వడ్డీ లేని రుణాలు.. మహిళల ఆర్థిక చేయూత కోసమంటూ గత జగన్ ప్రభుత్వం ఏడాది క్రితం కొత్త పథకానికి తెరదీసింది. పొదుపు మహిళల భాగస్వామ్యంతో వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు 'జగనన్న మహిళా మార్ట్‌లు ఏర్పాటు అంటూ హడావుడి చేసింది. తక్కువ ధరకు నిత్యావసర సరుకులు అందించే సూపర్ మార్కెట్‌లను ఏర్పాటు చేసి, అందులో పొదుపు మహిళలే భాగస్వాములుగా పేర్కొంది. అయితే పెట్టి ఏడాది దాటినా మహిళల వాటాగా ఎటువంటి చెల్లింపులు లేవు. పైగా సరుకులు కొనేవారిని తీసుకురావాలని, లేదంటే మీరే కొనుగోలు చేయాలంటూ మెప్మా నుంచి ఒత్తిడి ఉండటంతో ఆయా సభ్యులు అల్లాడిపోతున్నారు.

సొమ్ము సభ్యులది... పేరు జగన్‌ది

మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేశారు. ఈ మార్ట్‌ల ద్వారా ప్రజలకు అందుబాటులో ధరకు నాణ్యమైన నిత్యావసర సరుకులు, ఇతర వస్తువులను విక్రయించే విధంగా ప్రతి పట్టణంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావించింది. తొలుత జిల్లా కేంద్రాలలో ప్రారంభించాలని మెప్మా అధికారులకు ఆదేశాలు అందాయి. ఆ వ్యాపారాల్లో పొదుపు మహిళలను భాగస్వామ్యం చేస్తామంటూ పేర్కొనడంతోపాటు ప్రతి పొదుపు సంఘం నుంచి రూ.1500 ముక్కుపిండి మరీ వసూలు చేశారు. ఇందుకు సంబంధించి వసూళ్ల బాధ్యతను మెప్మాకు అప్పగించారు. అందులో భాగస్వాములైన ఆర్పీలు పొదుపు సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రతి మహిళ దగ్గర డబ్బులు వసూలు చేశారు. మహిళా సాధికారత కోసం నవరత్నాలలో భాగంగా వడ్డీ లేని రుణాలు మంజూరు చేస్తున్నామని గొప్పలకు పోయిన వైసీపీ.. జనం సొమ్ముతో జగనన్న మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేయడంపై అప్పట్లో విమర్శలొచ్చాయి. ఇందుకు సంబంధించి జిల్లాలో ఒంగోలు నగరంతోపాటు చీమకుర్తి, దర్శి, గిద్దలూరు, కనిగిరి, మార్కాపురంలలో మహిళా మార్టులు ఏర్పాటు చేశారు. ఏడాది కాలంగా ఆశించిన స్థాయిలో కొనుగోళ్లు జరగలేదు. దీంతో మార్ట్‌ల్లో పొదుపుసభ్యులకు బలవంతపు అమ్మకాలు జరుపుతుండగా, వాటిపై వచ్చే ఆదాయం ఎటు పోతుందో, ఎవరి ఖాతాలో జమవుతుందో కూడా తెలియని పరిస్థితి. జగన్ పాలనపై ప్రజలు విరక్తి చెంది ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఘోరంగా ఓడించి, తెలుగుదేశం పార్టీ కూటమిని భారీ మెజారిటీతో గెలిపించారు. అయినా మెప్మా అధికారులు మాత్రం తమ వైఖరి మార్చుకోలేదు. నేటికీ ఆర్పీల ద్వారా మార్ట్‌లో సరుకులు కొనాల్సిందే, ఆ బాధ్యత అందరూ తీసుకోవాల్సిందేనని హెచ్చరించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.




మహిళా మార్ట్‌లో ఫ్యాన్సీ సరుకులు

భాగస్వామ్యమే... లాభాలు ఇవ్వం

వైసీపీ ప్రభుత్వ ఆదేశాలు ప్రతి ఒక్కరూ పాటించాల్సిందేనని మెప్మా వైపు నుంచి ఏడాది క్రితం పొదుపుసంఘాలకు ఆదేశాలు అందాయి. ఆర్పీలలో కొందరు కచ్చితంగా ప్రతి మహిళ వాటా చెల్లించాల్సిందేనని వసూలు చేశారు. పొదుపు సభ్యులు చెల్లించే రూ.150కి ఎలాంటి భాగస్వామ్యం ఉండదు. ఏడాది తర్వాత రూ.150 తిరిగి ఇస్తామన్నారు. ఆ తర్వాత వ్యాపారంలో ఎలాంటి భాగస్వామ్యం ఉండకపోగా, దానిపై వచ్చే లాభాలను ప్రభుత్వ ఖాతాల్లోకి జమవుతాయి. అంతేకాకుండా ప్రతి మహిళ తమ ఇంటికి అవసరమైన సరుకులు మహిళామార్ట్‌ల ద్వారానే కొనుగోలు చేపిస్తున్నారు.

మార్ట్‌ల నిర్వహణ కమిటీ నియామకం ఇలా..

కనీసం ఇంటర్ విద్యార్హత, వ్యాపారంలో అనుభవం కలిగిన 11మందితో కమిటీని నియమించారు. మెప్మా కార్యాలయం రూపొందించిన బైలా ప్రకారం అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి వంటి పాలకవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. పరస్పర సహాయ, సహకార సంస్థ చట్టం (మాక్స్ యాక్ట్) పరిధిలో జేఎంఎంను రిజిస్ట్రేషన్ చేయించి, అన్నీ ఆన్‌లైన్ లావాదేవీలనే నిర్వహిస్తున్నా. లాభనష్టాలు మాత్రం అధికారులు బయటకు చెప్పడం లేదు.

జిల్లాలో రూ.1.34 కోట్లు వసూలు లక్ష్యం

జిల్లాలో మహిళా మార్ట్‌ల ఏర్పాటుకు పొదుపు సభ్యుల నుంచి రూ.1.37,79,600 వసూలు చేయాల్సి ఉంది. ఒంగోలు నగరంలో 44,331 పొదుపు సంఘాలు ఉండగా, 43,080 మంది పొదుపు సభ్యులు ఉన్నారు. చీమకుర్తిలో 590 సంఘాలు ఉండగా, 5,574మంది పొదుపు సభ్యులు ఉన్నారు. దర్శిలో 805 సంఘాలు, 8,050 మంది సభ్యులు, గిద్దలూరు 943 సంఘాలు, 8,982 మంది సభ్యులు, వారితోపాటు కనిగిరిలో 872 సంఘాలు 8,496 మంది సభ్యులు, మార్కాపురంలో 1,596 సంఘాలు, 15,682 మంది సభ్యులు ఉన్నారు. మొత్తం 9,237 సంఘాలు ఉండగా, ఆ సంఘాల్లో 89,864 మంది పొదుపు మహిళలు ఉన్నారు. వీరి నుంచి ఒక్కొక్కరు మహిళా మార్ట్ ఏర్పాటుకు రూ.150 చెల్లించారు. ఇంతవరకు లాభ, నష్టాలు, వ్యాపారం జరిగిన లెక్కలపై అధికారులు పొదుపు సభ్యులకు వివరించకపోగా, నేటికీ మార్ట్‌ల ద్వారానే అమ్మకాలు చేస్తుండడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.


మహిళా మార్ట్‌లో ప్రావిజన్స్


సీఈకి శుభాకాంక్షలు తెలుపుతున్న ఇంజనీరింగ్ అధికారుల అసోసియేషన్ ప్రతినిధులు

ప్రాజెక్టుల పనులు వేగవంతం

చివరి భూములకు సాగర్ నీరు

ప్రాజెక్టుల సీఈ రవికుమార్

శుభాకాంక్షలు తెలిపిన ఉద్యోగులు

ఒంగోలు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయడం, చివరి భూములకు కూడా సాగర్ నీరు అందేలా చూడటంపై ప్రధానంగా దృష్టిపెట్టనున్నట్లు జలవనరుల శాఖ సీఈ కడియాల రవికుమార్ చెప్పారు. చీఫ్ ఇంజనీర్‌గా రెండు రోజుల క్రితం నియమితులైన రవికుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. తర్వాత ఆయా విభాగాలకు చెందిన ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. ప్రస్తుతం జరుగుతున్న పనులు, తక్షణం తీసుకోవాల్సిన చర్యలు, నిధులు అవసరం తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఈ రవికుమార్ ఆంధ్రజ్యోతిలో మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం సాగునీటి రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నదన్నారు. జిల్లాలోని వెలిగొండ పనులపై ప్రధాన దృష్టిసారించనున్నట్లు చెప్పారు. అలాగే గుండ్లకమ్మ గేట్ల పనులు తక్షణం పూర్తికి చర్యలు చేపట్టి, ఈ ఏడాది ఆయకట్టుకు నీరు అందేలా చూస్తామన్నారు. అలాగే సాగర్ ఆయకట్టు రైతులు అవస్థలు తీర్చేలా చివరి భూములకు సాగర్ నీరందేలా చూస్తామన్నారు. గతంలో ఇక్కడ ఎస్ఈగా పనిచేసిన అనుభవం, అలాగే ఆ రంగంలో ప్రభుత్వ ప్రాధాన్యతకు అనుగుణంగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన రవికుమార్‌ను పలువురు ఇంజనీరింగ్ అధికారులు, ఉద్యోగుల సంఘం ప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

దర్శిలో భూమాయ..!

రూ.5 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి స్వాహాకు యత్నం

నకిలీ పట్టాలు సృష్టించిన అక్రమార్కులు

లోపలి పేజీల్లో

90 సీట్లు కోత

ఒంగోలు ట్రిపుల్ ఐటీలో 1010 సీట్ల భర్తీ

జాబితాను ప్రకటించిన ఆర్జీయూకేటీ అధికారులు

ఒంగోలు(విద్య), జూలై 11 : రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ ఒంగోలు ట్రిపుల్ ఐటీలో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు ఎంపికైన విద్యార్థుల జాబితాను గురువారం అధికారులు ప్రకటించారు. మొత్తం 1,100 సీట్లు ఉండగా 1,010 సీట్లు మాత్రమే భర్తీచేశారు. 90 సీట్లు కోత విధించారు. ప్రతి ట్రిపుల్ ఐటీలో వెయ్యి రెగ్యులర్ సీట్లు, 100 ఈడబ్ల్యూఎస్ సీట్లు ఉన్నాయి. రెగ్యులర్ సీట్లలో 90 కోత పెట్టి 910 మాత్రమే భర్తీచేయగా ఈడబ్ల్యూఎస్ కోటాలో మొత్తం వంద సీట్లు భర్తీచేశారు. ఎంపికైన వారిలో 883 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కాగా, 127 మంది ప్రైవేటు పాఠశాలల వారు. బాలికలు అత్యధికంగా 687మంది, బాలురు 323 మంది ఎంపికయ్యారు. మన రాష్ట్రానికి చెందిన 972 మందికి ప్రవేశం లభించగా 38మంది తెలంగాణ వారికి అడ్మిషన్లు లభించాయి. ఇక్కడ ప్రవేశం పొందిన వారిలో ఓసీలు 145 మంది, బీసీ ఏ 119, బీసీ బీ 163 మంది, బీసీ సీ 9 మంది, బీసీ డీ 217 మంది, బీసీ ఈ 51మంది, ఎస్సీ 149 మంది, ఎస్టీ 57 మంది, ఈడబ్ల్యూఎస్ కింద వంద మంది ఉన్నారు.

26 జిల్లాల నుంచి విద్యార్థులు

ఒంగోలు ట్రిపుల్ ఐటీలో 26 జిల్లాల నుంచి విద్యార్థులు ప్రవేశాలు పొందారు. శ్రీకాకుళం నుంచి 112 మంది, విజయనగరం నుంచి 59మంది, శ్రీసత్యసాయి నుంచి 23మంది, వైఎస్సార్ కడప నుంచి 27 మంది, నెల్లూరు నుంచి 41మంది, ప్రకాశం నుంచి 109 మంది, తిరుపతి నుంచి 24 మంది, కాకినాడ నుంచి 42మంది, నంద్యాల నుంచి 18 మంది, అంబేడ్కర్ కోనసీమ నుంచి 43 మంది, పల్నాడు నుంచి 71 మంది, అనకాపల్లి నుంచి 10 మంది, ఏలూరు నుంచి 47 మంది విద్యార్థులకు సీట్లు లభించాయి అనంతపురం నుంచి 10 మంది, విశాఖపట్నం నుంచి 16 మంది, మన్యం నుంచి 18 మంది, కర్నూలు నుంచి 9మంది, కృష్ణ నుంచి 45 మంది, ఎన్టీఆర్ జిల్లా నుంచి 47 మంది, గుంటూరు నుంచి 42 మంది, పశ్చిమగోదావరి నుంచి 24 మంది, తూర్పుగోదావరి నుంచి 24 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి నలుగురు అడ్మిషన్లకు ఎంపికయ్యారు. ఒంగోలు ట్రిపుల్ ఐటీ ప్రవేశాలకు ఎంపికైన వారు ఈనెల 24, 25 తేదీల్లో కడప జిల్లా ఇడుపులపాయ ఆర్కే వ్యాలీలో సర్టిఫికెట్ల పరిశీలన, కౌన్సెలింగ్‌కు హాజరుకావాల్సి ఉంటుంది. ఆగస్టు మొదటివారంలో విద్యార్థులకు తరగతులు ప్రారంభమవుతాయి.


నిత్యావసర వస్తువుల కేంద్రాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జనార్దన్, జేసీ గోపాలకృష్ణ

చౌకగా బియ్యం, పప్పు

ఒంగోలులోని పేదలకు నాలుగు కేంద్రాలలో సిద్ధం

లాయర్‌పేట రైతుబజారులో విక్రయాలను

ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల, జేసీ

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 11 : గత ఏడాది కాలంగా సామాన్యులకు చుక్కలు చూపిస్తున్న నిత్యావసర సరుకులను మద్దతు ధరలతో అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ ఆదేశాలతో మిల్లర్ల సహకారంతో బియ్యం, కందిపప్పును అమ్మనున్నారు. ఆ మేరకు ఒంగోలు నగరంలో మూడు కేంద్రాల్లో విక్రయాలను ప్రారంభించారు. స్థానిక లాయర్‌పేటలోని రైతుబజారులో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ విక్రయాలను ప్రారంభించారు. లాయర్‌పేట, దిబ్బలరోడ్డు, కొత్తపట్నం బస్టాండులోని రైతుబజార్లతోపాటు రామనగర్‌లోని డీమార్టు సమీపంలో బియ్యం, కందిపప్పును విక్రయాలను చేపట్టినట్లు జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వంలో నిత్యావసర ధరలు అధికంగా పెరగడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని విమర్శించారు. ఆ నేపథ్యంలో గత ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబునాయుడు నిత్యావసర సరుకులను అందరికీ అందుబాటులో తెస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు ఆ ప్రకారం చర్యలు తీసుకున్నారని తెలిపారు. ప్రస్తుతం కందిపప్పు, బియ్యం అందుబాటులోకి తెచ్చామన్నారు. బయట మార్కెట్లో రూ.180 ఉన్న కందిపప్పును రూ.160కి తీసుకొచ్చి విక్రయాలు చేపట్టామన్నారు. రానున్న రోజుల్లో వ్యాపారులు కూడా ఇదేవిధంగా తక్కువ ధరలకు విక్రయించే విధంగా చూస్తామని పేర్కొన్నారు. ఎప్పుడైతే సమర్థవంతమైన నాయకత్వం ఉంటుందే అప్పుడు అన్నివర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందని దామచర్ల తెలిపారు. ఇప్పటికే చంద్రబాబు పింఛన్‌ను రూ.4వేలు చేశారని, ఉచిత ఇసుకను ప్రారంభించారని ఆయన తెలిపారు. ఉద్యోగులకు 1వతేదీనే జీతాలు ఇస్తున్నట్లు చెప్పారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా వాటన్నింటినీ అధిగమించి ప్రజలకు మేలు చేసే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారని తెలిపారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ మాట్లాడుతూ బియ్యం, కందిపప్పు హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులతో మాట్లాడి తక్కువ ధరలకే విక్రయించే విధంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. కూరగాయలు కూడా వినియోగదారులకు తక్కువ ధరలకు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌వో ఉదయభాస్కర్, జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, టీడీపీ నగర అధ్యక్షుడు కొఠారి నాగేశ్వరరావు, కుసుమకుమారి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు లాయర్‌పేటలోని ప్రకాశం పంతులు విగ్రహానికి దామచర్ల పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మరో హామీ అమలుకు సిద్ధం

తల్లికి వందనం కింద రూ.15వేలు సహాయం

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం



ఒంగోలు(విద్య), జూలై 11 : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్‌లో మరో హామీ అమలు చేసేందుకు అడుగులు ముందుకు వేస్తోంది. తల్లికి వందనం పేరుతో పాఠశాలల్లో చదువుతున్న దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న విద్యార్థుల తల్లులకు అందజేసే రూ.15వేలు ఆర్థిక సాయం అమలుకు సంబంధించి విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీచేశారు. తల్లికి వందనం హామీతో పాఠశాలల్లో 1 నుంచి 12 తరగతులు చదువుతున్న పిల్లల తల్లికి ఏడాదికి రూ.15వేలు ఆర్థిక సాయంగా అందజేస్తామని పేర్కొన్నారు. పేదరికం కారణంగా ఏ పిల్లవాడు చదువుకు దూరం కాకుండా చూడాలన్న లక్ష్యంతో ఈ వినూత్న పథకానికి శ్రీకారం చుట్టనున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపించి డ్రాపౌట్‌లను గణనీయంగా తగ్గించడమే దీని ఉద్దేశం.

ఆధార్ సీడింగ్ తప్పనిసరి

తల్లికి వందనం ఆర్థిక సహాయం పొందేందుకు విద్యార్థి ఆధార్ సీడింగ్ తప్పనిసరి. ఆధార్ నెంబరు లేకపోతే వెంటనే తీయించాలి. ఆధార్ అథెంటికేషన్ నెంబరు అయినా తప్పనిసరి. ఆధార్ సీడింగ్ అయిన తల్లి బ్యాంకు ఖాతాకు నేరుగా రూ.15వేలు నగదు జమచేస్తారు. తల్లికి వందనం ఆర్థిక సహాయం పొందేందుకు విద్యార్థికి పాఠశాలలో 75శాతం హాజరు ఉండాలి. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నట్లు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది. ఆధార్ లేని కారణంగా విద్యార్థి తల్లి నష్టపోకుండగా ఇతర పది రకాల ధ్రువీకరణల్లో ఏ ఒక్కటి ఇచ్చినా సరిపోతుంది. ఫొటోతో ఉన్న బ్యాంకు/పోస్టాఫీసు పాసు బుక్, పాన్‌కార్డు, రేషన్‌కార్డు, ఓటరు గుర్తింపుకార్డు, ఉపాధి హామీ పథకం గుర్తింపు కార్డు, కిసాన్ పాస్ బుక్, డ్రైవింగ్ లైసెన్సు, తహసీల్దార్ జారీచేసే గుర్తింపుకార్డు, ఇతర గుర్తింపు కార్డులు సమర్పించడం ద్వారా ఆర్థికసాయం పొందవచ్చని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బీపీఎల్ కుటుంబాల గుర్తింపు ప్రక్రియ, తల్లికి వందనం ఆర్థిక సాయం పొందేందుకు అర్హులైన విద్యార్థులు జాబితాల తయారీకి సంబంధించి ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించాల్సి ఉంది.

భారీగా అక్రమాలు జరిగితే ఏం చేస్తున్నారు..!


రెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జేసీ గోపాలకృష్ణ

రెవెన్యూ అధికారులపై జేసీ ఆగ్రహం

ప్రభుత్వ భూముల్లో తొలగింపుల పరిశీలన

కనిగిరి, జూలై 11: కనిగిరి నియోజకవర్గంలో పెద్దఎత్తున అక్రమాలు, ఆక్రమణలు జరిగితే ఏం చేస్తున్నారంటూ జేసీ గోపాలకృష్ణ రెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వరుస కథనాలతో ఇటీవల రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ప్రభుత్వ భూములు, స్థలాలను గుర్తించి వాటిల్లో ఉన్న ఆక్రమణలను తొలగించారు. గురువారం పట్టణంలోని ఒంగోలురోడ్డు, పామూరు రోడ్డు, కంభం రోడ్డులోని వివిధ ప్రభుత్వ భూముల్లో ఉన్న నిర్మాణాల తొలగింపును ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ అసైన్డ్ భూముల్లో వెంచర్లు వేయటం చట్టవిరుద్ధమన్నారు. పక్కా భూముల్లో వేసిన వెంచర్లకు కన్వర్షన్‌తో పాటు, ప్లాన్ అప్రూవల్ తప్పనిసరిగా ఉండాలన్నారు. వీటిపై దృష్టి సారించి అప్రూవల్, కన్వర్షన్ లేని సెటిల్‌మెంట్ భూముల్లో వెంచర్లు వేసిన వారికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. వీటిపై నివేదిక అందజేయాలన్నారు. అసైన్డ్ భూముల్లో వేసిన వెంచర్లను తొలగించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఆర్డీవో, తహసీల్దార్, డీటీ, వీఆర్వోలు బృందంగా ఏర్పడి కనిగిరి ప్రాంతంలో అనుమతులు లేని వెంచర్లను తొలగించాలని ఆదేశించారు. జేసీ వెంట ఆర్డీవో జాన్‌ఇర్విన్, మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు, తహసీల్దార్ సురేష్, డీటీలు, ఆర్ఐలు, వీఆర్వోలు, సర్వేయర్‌లు ఉన్నారు.


తొలగించిన నిర్మాణాలను పరిశీలిస్తున్న జేసీ, పక్కన ఆర్డీవో, కమిషనర్



జీజీహెచ్ క్యాజువాలిటీలో ఉన్న మాజీ సీఎం జగన్ బోర్డు

జీజీహెచ్‌లో మారని జగన్ బొమ్మ..!

● అధికారుల తీరుపై విమర్శలు

గత వైసీపీ ప్రభుత్వంలో జగన్‌కు బొమ్మల పిచ్చి పీక్ వెళ్ళిన విషయం అందరికీ తెలిసిందే. బడి, గుడి, ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాలు, హద్దురాళ్ళు, బ్యాగులు, ఫించన్ కార్డు, పాస్ పుస్తకాలు, పేదల ఇళ్లు.. ఇలా ఎక్కడ పడితే అక్కడ సీఎం హోదాలో ఇష్టారాజ్యంగా జగన్ ఫొటోలు ముద్రించారు. అయితే రాజకీయాలకు అతీతంగా పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాల్సిన ప్రభుత్వ ఆసుపత్రి (జీజీహెచ్)లో మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిపై ఇంకా కొందరు అధికారులు అభిమానం పోలేదు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటు అయి నెల దాటింది. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రిగా కొణిదెల పవన్ కల్యాణ్‌తో పాటు పూర్తిస్థాయిలో మంత్రి వర్గం ఏర్పాటు అయ్యింది. అయితే నేటికీ జీజీహెచ్ క్యాజువాలిటీలో ఇంకా జగన్ బొమ్మలు తొలగించకపోవడం ఆసుపత్రిలోని కొందరు అధికారుల అభిమానాన్ని తెలియజేస్తోంది. అయితే జీజీహెచ్‌కు విచ్చేసిన రోగులు ఇంకా జగన్ ఫొటోలతో ఉన్న బోర్డులపై పెదవి విరుస్తున్నారు.

- ఒంగోలు (కార్పొరేషన్)



పండ్ల తోటల పెంపకాన్ని పరిశీలిస్తున్న కేంద్ర జలశక్తి అభియాన్ బృందం

ఉపాధిపనిలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు

మద్దిపాడు,జూలై 11: ఉపాధి పనుల్లో కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లు అధికమస్టర్లు వేసి అవకతవకలకు పాల్పడుతున్నారని అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్ర జలశక్తి అభియాన్ బృందం అధికారి దేవదత్తు సేతుపతి హెచ్చరించారు. గురువారం వెల్లంపల్లి, అన్నంగి గ్రామాలో గౌడ్స్ ఫండ్ అభివృద్ధి పనుల్లో భాగంగా పండ్ల తోటల పెంపకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో మద్దిపాడు, వెల్లంపల్లి గ్రామాల్లో కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లు అవకతవకలకు పాల్పడినట్లు ఫిర్యాదులు వచ్చాయని, మండల అధికారులు అప్రమత్తమై సమగ్ర నివేదిక ఇవ్వాలని అన్నారు. శాస్త్రవేత్త సంతోష్ గౌతమ్ మాట్లాడుతూ పండ్ల తోటల్లో క్షేత్రస్థాయిలో జరిగిన పనులపై సమగ్రంగా కొలతలు చూడాలన్నారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.అర్జున్‌రావు మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో కూలీలు శాతం పెంచాలన్నారు. కూలీలకు పనిదినాలు పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు.ఉపాధి హామీ పనుల్లో సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీవో మధుసూదన్, ఏపీడీ పాలేటి వెంకటస్వామి, ఎంపీడీవో శ్రీహరి, ఏపీవో ధనుంజయ వర్మ, వెల్లంపల్లి సర్పంచ్ చిట్టిబోయిన అనిల్‌కుమార్ యాదవ్, ఎంపీటీసీ సభ్యురాలు అద్దేపల్లి గంగాభవాని, గ్రామ కార్యదర్శి మాధవి, టీడీపీ నాయకులు ముచ్చు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరకాలనీలో చోరీ

● 4.5 సవర్ల బంగారం, ఆరువేల నగదు అపహరణ

సింగరాయకొండ, జూలై 11 : మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వరకాలనీలో బుధవారం రాత్రి ఓ ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. గదిలో ఉన్న బీరువాను తెరిచి అందులో ఉన్న 4.5 సవర్ల బంగారాన్ని, నాలుగువేల రూపాయల విలువ చేసే వెండిని, ఆరువేల నగదును అపహరించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శానంపూడి గ్రామానికి చెందిన దాసరి కోటేశ్వరరావు ఐదేళ్లుగా వెంకటేశ్వరకాలనీలో ఆర్ఎంపీగా పనిచేస్తూ అక్కడే ఇంటిని అద్దెకు తీసుకొని నివాసం ఉంటున్నారు. బుధవారం రాత్రి శానంపూడిలో తన బంధువులకు అనారోగ్యంగా ఉండటంతో కుటుంబ సభ్యులతో కలిసి గ్రామానికి వెళ్లారు. వెళ్తూ ఇంటి తాళాన్ని బయట కిటికీలో, బీరువా తాళాన్ని ఇంటిలోపల అరమరలో గుట్టుగా పెట్టివెళ్లారు. ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు బయట కిటికీలో ఉంచిన తాళాలను గుర్తించి వాటి సాయంతో తలుపును తెరిచి ఇంటిలోకి ప్రవేశించారు. అనంతరం అరమరలో ఉన్న తాళాలతో బీరువాను తెరిచి అందులో ఉన్న బంగారం, వెండి, నగదును దోచుకెళ్లారు. గురువారం ఉదయం తిరిగి కోటేశ్వరరావు దంపతులు వెంకటేశ్వరకాలనీ తిరిగి వచ్చారు. బయటతలుపు, బీరువా తాళాలు తీసి ఉండటాన్ని చూసి నిర్ఘాంతపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు క్లూస్ టీం బృందాన్ని రప్పించి వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి. శ్రీరామ్ తెలిపారు.



బీరువాను పగులకొట్టి చిందరవందరగా వేసిన దుస్తులు

మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని..

● భార్య గొంతుకోసిన భర్త

● చావు బతుకుల మధ్య మహిళ

ఒంగోలు(క్రైం),జూలై11: మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని భార్యపై హతాయత్నం చేశాడు భర్త. ఈ సంఘటన ఒంగోలు మండలం త్రోవగుంట అంబేద్కర్ నగర్‌లో గురువారం తెల్లవారుజామున జరిగింది. కూచనపూడి నాగలక్ష్మి ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్‌లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగం చేస్తున్నది. మద్యానికి బానిసైన భర్త గోపి బుధవారం రాత్రి నుంచి నాగలక్ష్మితో గొడవపడుతున్నాడు. తాను మద్యం తాగేందుకు నగదు కావాలని వేధించడమే కాకుండా చేయి చేసుకున్నాడు. అమె డబ్బులు ఇవ్వలేదనే అక్కసుతో గురువారం తెల్లవారు జామున తిరిగి గొడవపడి ఇంట్లో ఉన్న చాకుతో గొంతు కోశాడు. చేతులు అడ్డుపెట్టగా చేతులపైన కూడా చాకుతో కోశాడు. అమె బలవంతంగా భర్త బారి నుంచి తప్పించుకొని ఇంటి నుంచి బైటకు వచ్చి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి త్రీవంగా గాయపడిన నాగలక్ష్మిని రిమ్స్‌కు తరలించారు. అమె ప్రస్తుతం అపస్మారక స్థితిలో ఉంది. ప్రాణహాని ఏమి లేదని డాక్టర్లు చెబుతున్నారు. విచక్షణా రహితంగా ప్రవర్తించి తన కుమార్తెను చంపేదుకు ప్రయత్నించిన గోపిపై కఠిన చర్యలు తీసుకోవాలని నాగలక్ష్మి తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈమేరకు తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సాగుకు అవసరమైన ఇన్‌పుట్స్‌ను సిద్ధంగా ఉంచాలి

- కలెక్టర్ అన్సారియా ఆదేశం



వ్యవసాయ అనుబంధ శాఖల అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 11 : సాగుకు అవసరమైన ఇన్‌ఫుట్స్‌ను ముందుగానే పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో గురువారం వ్యవసాయశాఖ, దాని అనుబంధ శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని సాగు వివరాలు, అందుబాటులో ఉన్న నీటి వనరులు, సాగు పద్ధతులు, ప్రభుత్వం అందిస్తున్న ఇన్‌ఫుట్స్ సరఫరా- దిగుబడి లక్ష్యాలు, వాటి అంతిమ ఫలితం, సాగులో అందుబాటులోకి వస్తున్న నూతక సాంకేతికత తదితర అంశాలపై సమీక్షించారు. ఆయా అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు ఈ సందర్భంగా కలెక్టర్‌కు వివరించారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం దృష్ట్యా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను సిద్ధం చేయాలన్నారు. అర్హులకు సీసీఆర్‌సీ కార్డులను మంజూరు చేయాలని ఆదేశించారు. వ్యవసాయంలో ఖర్చును తగ్గించేందుకు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకొనేలా రైతులకు అవగాహన కల్పించి వారిని ఆ దిశగా ప్రోత్సహించాలన్నారు. ఈసమావేశంలో వ్యవసాయ, దాని అనుబంధ శాఖల అధికారులు శ్రీనివాసరావు, బేబిరాణి, పీవీ రమణ, గోపిచంద్, అన్నపూర్ణ, ఉపేంద్ర, చంద్రశేఖర్‌రెడ్డి, సుభాషిణి, సుజయ్‌కుమార్‌తో పాటు ఏపీ మార్క్‌ఫెడ్, ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ అధికారులు ఉన్నారు.

ఫైళ్ల క్లియరెన్స్‌లో జాప్యం లేకుండా చూడాలి

ఫైళ్ల క్లియరెన్స్‌లో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఆర్డీవో కార్యాలయాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో ఎంత మంది పనిచేస్తున్నారు, ఎవరు ఏ సబ్జెక్టు చూస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అందుకు సంబంధించిన ఫైళ్లను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఆమోదం కోసం తహసీల్దార్ కార్యాలయాల నుంచి ఎన్ని ఫైల్స్ వచ్చాయి, వాటిలో ఎన్ని ఆమోదించారు, తుది ఆమోదం కోసం కలెక్టర్‌కు పంపించారా లేదా అని ప్రశ్నించారు. ఏ ఉద్యోగి ఏ సబ్జెక్టును పరిశీలిస్తున్నారో తెలియజేసేలా సంబంధిత ఉద్యోగి సీటు వద్ద డిస్‌ప్లే ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలోని అన్ని గదులను పరిశీలించారు. కలెక్టర్ వెంట ఒంగోలు ఆర్డీవో జీవీ సుబ్బారెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు.

అధిక జనాభాతో అనేక అనర్థాలు

ర్యాలీలో కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 11 : అధిక జనాభా వల్ల కలిగే అనార్థాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్యశాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ఏర్పాటు చేసిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా అక్కడ జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ బాలికలను చదివిద్దాం, బాల్య వివాహాలను నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు. చిన్న వయస్సులో వివాహం చేయడం వల్ల కాన్పు కష్టం కావడంతో మాతృమరణాలు, శిశు మరణాలు సంభవిస్తున్నాయన్నారు. మొదటి బిడ్డ బడికి, రెండో బిడ్డ ఒడికి అనే నినాదంతో కుటుంబ నియంత్రణ తాత్కాలిక పద్ధతిగా చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. అధిక జనాభా పెరుగుదల వల్ల పేదరికం, ఆర్థికంగా, సామాజిక పరంగా వెనుకడగు పటడటంతో పాటు నిరుద్యోగుల సంఖ్య పెరుగుతుందన్నారు. ఈ అనార్థాలపై అవగాహన కలిగించి చిన్న కుటుంబం - చింతలేని కుటుంబం అనే నినాదంతో అధిక జనాభాను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్సారియా పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సురేష్‌కుమార్, జిల్లా ప్రోగ్రామ్ అధికారులు, వివిధ శాఖల అధికారులు, మునిసిపల్, స్టెప్ ఆర్గనైజేషన్, ప్రభుత్వ, జేఎస్ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు, ఆశా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీని జెండా ఊపిప్రారంభిస్తున్న కలెక్టర్ అన్సారియా

మద్దిపాడులో

మద్దిపాడు: జనాభా నియంత్రణకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని డాక్టర్ ఆనంద్ మోహన్ అన్నారు. గురువారం ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాలలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారులు డాక్టర్ ఆనంద్ మోహన్, డాక్టర్ శ్రావణ్‌కుమార్‌లు మాట్లాడగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జగదీష్ బాబు, కమ్యూనిటీ హెల్త్ అధికారులు లలితమ్మ, సీహెచ్ రజిత కుమారి, పీహెచ్ఎన్ పద్మావతి, హెల్త్ సూపర్వైజర్లు సీతమ్మ, నాగరాజి, దరియా, సురేష్ బాబు, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న కరవది పీహెచ్‌సీ సిబ్బంది

కరవదిలో జనాభా దినోత్సవ ర్యాలీ

ఒంగోలు(రూరల్), : దేశంలో పెరుగుతున్న జనాభాను తగ్గించుకోవాల్సిన అవసరం ఉందని కరవది ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ సుందర ప్రసాద్ అన్నారు. ఒంగోలు మండలం కరవది ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారులు, సిబ్బంది గురువారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురష్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుందర ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో జనాభా పెరుగుదల వల్ల వారికి తగిన విధంగా వైద్య సౌకర్యాలు కల్పించటం కష్టంగా ఉంటుందన్నారు. అందువల్ల జనాభా నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, గ్రామస్థులు ఉన్నారు.

అనధికార బోర్లు వాస్తవమే

● కమిషనరు జశ్వంతరావు

● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 11 :ఆంధ్రజ్యోతిలో గురువారం ప్రచురితమైన 'జోరుగా నీటి విక్రయాలు' కథనంపై కార్పొరేషన్ అధికారులు స్పందించారు. కమిషనరు ఎం. జశ్వంతరావు ఆదేశాలతో డీఈ పద్మజతోపాటు, ఇతర ఇంజనీరింగ్ అధికారులు ఐడీఎస్ఎంటీ స్థలాల్లో ఏర్పాటు చేసిన అనధికార బోర్లను పరిశీలించారు. కాగా వాటికి అనుమతులు లేవని గుర్తించిన వారు యజమానులకు నోటీసులు జారీ చేశారు. అనధికారకంగా బోర్లు ఏర్పాటు చేసి, నీటిని విక్రయించడం ఓల్టా చట్టం ఉల్లంఘన కిందకు వస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా యజమాని తమ్మిశెట్టి చిన్నయ్యకు నోటీసులు జారీ చేయడంతోపాటు తగిన డ్యాక్యుమెంట్లు 24 గంటల్లో చూపించాలని హెచ్చరించారు. అలాగే ఇకపై అనధికార బోర్లు ఏర్పాటు కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కమిషనర్ జశ్వంతరావు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ విజిలెన్స్ డీఈ వెంకటేశ్వర్లు

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు

● విజిలెన్స్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు

మర్రిపూడి, జూలై 11 : విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కట్టా వెంటేశ్వర్లు హెచ్చరించారు. గురువారం స్థానిక విద్యుత్ ఉపకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మండలంలో విద్యుత్ కనెక్షన్‌లను ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు చెప్పారు. 16 విద్యుత్ అధికారులు, 85 మంది సిబ్బంది ఏకకాలంలో 3,222 సర్వీస్ కనెక్షన్లను తనిఖీ చేసినట్లు తెలిపారు. అదనపు లోడు వాడుతున్న 18 మందికి రూ.1,49,000 అపరాద రుసుం విధించినట్లు చెప్పారు. ఇతర కేటగిరి కింద విద్యుత్ వినియోగిస్తున్న నలుగురికి రూ.6000 పెనాల్టీ విధించినట్లు చెప్పారు. సమావేశంలో దర్శి ఈఈ ఎస్ఏ కరీం, పొదిలి, దర్శి, చీమకుర్తి డీఈలు కే శ్రీనివాసులరెడ్డి, కే పిచ్చయ్య, కృష్ణారెడ్డి, విజిలెన్స్ డీఈ ఏ శ్రీనివాసరావు, మర్రిపూడి ఏఈ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో సుభద్ర

జడ్పీస్కూల్‌ను తనిఖీ చేసిన డీఈవో

జరుగుమల్లి (కొండపి), జూలై 11 : జరుగుమల్లిలోని జడ్పీ స్కూల్‌ను డీఈవో డి. సుభద్ర గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా రిజిస్టర్లు తనిఖీ చేశారు. నాడు-నేడు పనులను పరిశీలించారు. అనంతరం 3వ తరగతి, 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి పఠన సామర్థ్యాలను పరిశీలించారు. పాఠ్య పుస్తకాలు, విద్యార్థుల కిట్స్‌ల పంపిణీపై ఆరా తీశారు. ఈసందర్భంగా పీడీ ప్రసాద్ విద్యార్థులతో నిర్వహింపచేసిన మాక్ డ్రిల్‌ను డీఈవో ప్రశంసించారు. కెరీర్ ఎడ్యుకేషన్‌లో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం స్కూల్ సాధించినందుకు స్కూల్ హెచ్ఎం ఎం. శ్రీనివాసరావును, ఉపాధ్యాయుడు నరసింహారావును డీఈవో సన్మానించారు. పాఠశాల నిర్వహణ పట్ల డీఈవో సంతృప్తి వ్యక్తం చేశారు. డీఈవో వెంట ఎంఈవో నాగేంద్రవదన్ పాల్గొన్నారు.



టంగుటూరు కేంద్రంలో జరుగుతున్న కొనుగోళ్లు

పొగాకు కిలో అత్యధిక ధర రూ.366

టంగుటూరు, జూలై 11 : టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో గురువారం అత్యధికంగా రూ.366కు పలికింది. గురువారం పొందూరు, తూర్పునాయుడుపాలెం, జరుగుమల్లి, చిరికూరపాడు, పాలేటిపాడు రైతుల 994 పొగాకు బేళ్ల వేలం కేంద్రానికి తీసుకొచ్చారు. వాటిని సూపరింటెండెంట్ ఏ శ్రీనివాసరావు వేలానికి అనుమతించారు. మొత్తం 994 చెక్కులను వేలం వేయగా 882 బేళ్ల మాత్రమే కొన్నారు. కొనుగోళ్లలో 23 కంపెనీల బయ్యర్లు పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్ గది తాళాలు తొలగింపు

● నాలుగు నెలల క్రితం నుంచి విధులకు గైర్హాజరు

సింగరాయకొండ, జూలై 11 : సింగరాయకొండ పంచాయతీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న విజయకృష్ణ నాలుగు నెలల క్రితం తన గదికి తాళాలు వేశాక అప్పట్నుంచి విధులకు హాజరుకావడం లేదు. పంచాయతీలో జరుగుతున్న అవకతవకల గురించి, జూనియర్ అసిస్టెంట్ గదికి తాళాలు వేసుకొని పత్తాలేకపోవడంపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో డీపీవో ఉషారాణి ఆదేశాలతో గురువారం ఈవోఆర్డీ సుధాకర్, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది సమక్షంలో జూనియర్ అసిస్టెంట్ గదికి వేసిన తాళాలను పంచాయతీ కార్యదర్శి రామకోటయ్య తొలగించారు. అనంతరం ఆ గదిలో ఉన్న రికార్డులకు అధికారుల సమక్షంలో పంచనామా నిర్వహించారు.



జూనియర్ అసిస్టెంట్ గదికి వేసిన తాళాలను తొలిగిస్తున్న పంచాయతీ కార్యదర్శి రామకోటయ్య

అవీ..ఇవీ..

ఆకట్టుకున్న ఏకపాత్రాభినయ ప్రదర్శనలు



అంబేడ్కర్ ఏకపాత్రాభినయం ప్రదర్శిస్తున్న దృశ్యం

ఒంగోలు(కల్చరల్),జూలై 11:స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో గురువారం వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు కళాకారులు ప్రదర్శించిన ఏకాపాత్రాభినయ ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. జిల్లా రంగభూమి కళాకారుల సంఘం 7వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన జాతీయస్థాయి ఏకపాత్రాభినయ పోటీలలో భాగంగా కళాకారులు సాంఘిక, జానపద, చారిత్రక పాత్రలను ప్రదర్శించారు. టీడీపీ నాయకులు సింగరాజు రాంబాబు, ఎద్దు శశికాంత్‌లు ప్రారంభసభలో పాల్గొని ప్రసంగిస్తూ కళల వల్ల సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని, ప్రభుత్వం చేసే కార్యక్రమాలను కళాకారులు తమ కళల ద్వారా సమాజంలోకి తీసుకువెళ్లాలని అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, హరిశ్చంద్రుడు వంటి అనేక పాత్రల ఏకాపాత్రాభినయం ప్రదర్శన జరిగింది. కార్యక్రమంలో పాటిబండ్ల ఆనందరావు, బేతంశెట్టి హరిబాబు, ధేనువకొండ వెంకట సుబ్బారావు, పి.రాజ్యలక్ష్మి, మాకా ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ వయోపరిమితి పెంపునకు వినతి

ఒంగోలు(విద్య), జూలై 11 : కూటమి ప్రభుత్వం త్వరలో ప్రకటించనున్న మెగా డీఎస్సీకి వయోపరిమితిని పెంచాలని పలువురు నిరుద్యోగులు, ఉపాధ్యాయ అభ్యర్థులు మానవవనరుల, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. గత ఐదు సంవత్సరాల్లో డీఎస్సీ ఇవ్వకుండా దగా చేసినందున డీఎస్సీకి అర్హత కోల్పోయామని వారు లోకేష్‌కు వివరించారు. తమ పట్ల సానుకూలంగా స్పందించి డీఎస్సీకి వయోపరిమితి పెంచి తదనుగుణంగా అవకాశం కల్పించాలని వారు మంత్రికి విజ్ఞప్తి చేశారు.

సదస్సును విజయవంతం చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 11 : కాకినాడలో ఈనెల 27నజరిగే అంబేద్కర్ ఆలోచన ఫౌండేషన్ 17వ రాష్ట్రస్థాయి సదస్సును విజయవంతం చేయాలని దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు కోరారు. స్థానిక అంబేద్కర్ భవన్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిజాయితీగల నాయకత్వం, సమాజ భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చగలిగే నమ్మకం కలిగించే దిశగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో అంబేద్కర్, పూలే, పెరియార్, కాన్షీరాం వారసులు, మేధావులు, అభ్యుద వాదులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ముస్లిం కమ్యూనిటీ హాలు నూతన కమిటీ ఎన్నిక

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 11 : ఒంగోలు నగరంలోని ముస్లిం కమ్యూనిటీ హాలు నూతన కమిటీ ఎన్నిక గురువారం జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు సయ్యద్ సర్దార్, గౌస్ బాషా ఆధ్వర్యంలో జనసేన జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా షేక్ అల్లాభక్షు, కార్యదర్శిగా షేక్ రఫీ, కోశాధికారిగా పఠాన్ ముజులుల్లాతోపాటు ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు పఠాన్ హనీఫ్ ఖాన్, కపిల్ బాషా, పఠాన్ కరీముల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



నూతన కమిటీని అభినందిస్తున్న జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్

గాంధీ ఈ టెక్నోలో విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 11 : నగరంలోని గాంధీ ఈ టెక్నో స్కూలులో ట్రైడెంట్ డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం స్కూలులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కరస్పాండెంట్ శ్రీనివాస రెడ్డి, ప్రిన్సిపాల్ మాధురి పర్యవేక్షణలో డాక్టర్లు సాహితీ వరదా, భూషణ్‌లు విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించడంతో పాటు దంత సంరక్షణపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ప్రతి రోజూ నోటిని శుభ్రం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా స్కూలు యాజమాన్యం ట్రైడెంట్ బృందాన్ని అభినందించింది.

రోగులపట్ల కులవివక్షపై చర్యలు తీసుకోవాలి

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 11 : ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) కొందరు డ్యూటీ డాక్టర్లు కాసుల కోసం కుల వివక్ష చూపుతున్నారని, అటువంటి వారిపై చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని దళిత నాయకులు సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాదేవిని కోరారు. గురువారం వారు ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన సూపరింటెండెంట్ త్వరలోనే జీజీహెచ్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి, అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

మద్దిపాడు,జూలై 11: జాతీయ రహదారిపై వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని మద్దిపాడు ఎస్సై వెలగా మహేష్ అన్నారు. గురువారం వెల్లంపల్లిలో ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనదారులు తమ వెంట ధ్రువపత్రాలను తీసుకురావాలని, తగిన పత్రాలు లేని వారికి జరిమానాలు విధిస్తామన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నాగులుప్పలపాడు, జూలై 11 : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని నాగులుప్పలపాడు ప్రభుత్వ వైద్యశాల వైద్యులు ఒనారియల్ అన్నారు. చేకూరపాడు గ్రామంలో గురువారం నిర్వహించిన డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవ అవగాహన ర్యాలీలో ఆయన మాట్లాడారు. గ్రామంలోని శ్రీవేణుగోపాలస్వామి ఓరియంటల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సీజనల్ వ్యాధుల పట్ల వైద్యాధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ శిరీషా, ఎంఈవోలు తిరుమలశెట్టి రవి, రమణయ్య, సర్పంచ్ కొమ్మినేని రమేష్ బాబు, పంచాయతీ కార్యదర్శి ఎ.సుభాషిణి, ప్రధానోపాధ్యాయురాలు అనిత, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



చేకూరపాడులో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

ఆన్‌లైన్‌లో నామినేషన్లు సమర్పించాలి

ఒంగోలు(విద్య), జూలై 11 : జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరంలో ఇన్‌స్పైయిర్ అవార్డు మనాక్ స్కీంకు సెప్టెంబరు 15వతేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి డి. సుభద్ర ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఉన్నత పాఠశాలలు 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఐదు నామినేషన్లు సమర్పించాలన్నారు. అన్ని యాజమాన్యాల యూపీ పాఠశాలలు మూడు నామినేషన్లు సమర్పించాలన్నారు. జిల్లాలోని అన్ని మేనేజ్‌మెంట్ పాఠశాలలు తప్పని సరిగా ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనాక్ స్కీం అన్‌లైన్‌లోనే సమర్పించాలన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తప్పని సరిగా అవార్డుకు నామినేషన్లు సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు జిల్లా సైన్స్ అధికారి, 9666955504 నెంబర్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

వెనుకబడిన వర్గాలకు సంక్షేమఫలాలు అందించాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 11 : బడుగు, బలహీన, వెనుకబడిన తరగతుల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు అందేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో గురువారం సాయంత్రం సంక్షేమశాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ఈ వర్గాల జనాభా ఎక్కువగా ఉన్నందున అధికారులు మరింత దృష్టి పెట్టాలన్నారు. సంక్షేమ హాస్టల్స్‌లో వసతులు మెరుగు పర్చడంతో పాటు నాణ్యమైన ఆహారం, విద్య అందేలా చూడాలన్నారు. పొదుపు రుణాలు, తద్వారా మహిళల జీవనోపాధి మెరుగుపడుతున్న తీరును సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు లక్ష్మానాయక్, అంజల, అర్చన, నారాయణ, అర్జున్ నాయక్, ధనలక్ష్మి, లోకేశ్వరరావు, శ్రీమన్నారాయణ, వసుంధర, డిపిఎంలు, ఇతర అధికారులు ఉన్నారు.

రూ.5కోట్ల ప్రభుత్వ భూమి స్వాహాకు యత్నం

- నకిలీ పట్టాలు సృష్టించిన అక్రమార్కులు

దర్శి, జూలై 11: కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వభూమిని స్వాహా చేసేందుకు కొంతమంది అక్రమార్కులు నకిలీ పట్టాలు సృష్టించారు. ఆ పట్టాలను అడ్డుపెట్టుకొని తమకు పొజిషన్ చూపాలని ఏకంగా కోర్టుకు వెళ్లారు. కోర్టు నుంచి ఆ ప్రభుత్వభూమికి సంబంధించిన వివరాలను సమర్పించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించటంతో అసలు విషయం బయట పడింది. ఆ ప్రభుత్వభూమికి ఎలాంటి పట్టాలు ఇవ్వలేదని తేలింది. దర్శి-అద్దంకి రోడ్డులో 340/5 సర్వే నెంబర్‌లో సుమారు 80 సెంట్ల ప్రభుత్వభూమి ఉంది. అందులో పది సెంట్ల భూమిని సొసైటీ కార్యాలయానికి కేటాయించారు. మరికొంత భూమిని అధికారులు రోడ్డుకు కేటాయించారు. ప్రస్తుతం 50 సెంట్ల స్థలం ఖాళీగా ఉంది. దర్శి-అద్దంకి ప్రధాన రహదారి ఆనుకొని ఉన్న ఆ స్థలం సెంటు విలువ రూ.10 లక్షలకు పైగా ఉంది. ఎంతోకాలంగా ఆ స్థలాన్ని స్వాహా చేసేందుకు అనేకమంది ఎన్నోరకాలుగా ప్రయత్నాలు చేశారు. అందులోభాగంగా కొంతమంది 20 సెంట్లను ఐదుగురు వ్యక్తులకు ఇంటి నివేశ పట్టాలు ఇచ్చినట్లు రికార్డులు సృష్టించారు. ఈవిషయంపై వారే కోర్టుకు వెళ్లటంతో రెవెన్యూ అధికారులు పూర్తి వివరాలను కోర్టుకు సమర్పించారు. రికార్డుల ప్రకారం ఆ భూమి ప్రభుత్వ భూమిగా నమోదైంది. ఇప్పటివరకు ఎవరికీ ఎలాంటి పట్టాలు మంజూరు చేయలేదు.

అయితే, అక్రమార్కులు సృష్టించిన పట్టాలలో 2001లో తహసీల్దార్ ఎల్‌వీ ప్రసాద్ ఆ పట్టాలు ఇచ్చినట్లు సంతకాలు ఉన్నాయి. తహసీల్దార్ కార్యాలయంలో పట్టాలు ఇచ్చిన ఫైలు ఎక్కడా లేదు. దీంతో ఆ పట్టాలు నకిలీవని ధ్రువీకరించుకున్న అధికారులు కొద్దిరోజుల క్రితం కోర్టుకు నివేదిక సమర్పించారు. అదేస్థలంలో తాము కొంతభాగంలో ఇళ్లు వేసుకొని 30 సంవత్సరాల క్రితం నివాసం ఉన్నామని, తమకు పట్టాలు ఇవ్వాలని మరికొందరు కోర్టుకు వెళ్లారు. వీరి మధ్య వివాదంతో నకిలీ పట్టాల బాగోతం బయటపడింది. గత ఏడాది, ప్రస్తుతం నకిలీ పట్టాలు సృష్టించిన వ్యక్తులు అక్కడ ఇళ్లు నిర్మించే ప్రయత్నాలు చేశారు. ఆంధ్రజ్యోతి కథనంతో అప్రమత్తమైన అధికారులు అడ్డుకున్నారు. అప్పటి కనిగిరి ఆర్డీవో తోటా అజయ్‌కుమార్ ఆ స్థలాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ స్థలం ప్రభుత్వానికి సంబంధించిందని, ఎవరైన ఆక్రమణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆ సందర్భంగా అక్రమార్కులను హెచ్చరించారు. ఇళ్ల నిర్మాణం కోసం పెట్టిన గోడలను తొలగించారు. వాస్తవంగా ఈ పట్టాలు నిజమైతే ఆ సమయంలో ఈ పట్టాలను ఆర్డీవోకు చూపించేవారు. ఆ సమయంలో తాము ఈ స్థలాన్ని ఇతర వ్యక్తుల నుంచి తెలియక కొనుగోలు చేశామని న్యాయం చేయాలని వారు కోరారు. ప్రభుత్వభూమిని కొనటం, విక్రయించటం నేరమని ఇలాంటి చర్యలకు పాల్పడవద్దని ఆసందర్భంగా ఆర్డీవో అజయ్‌కుమార్ హెచ్చరించారు. సుమారు ఏడాది కాలం మౌనంగా ఉన్న అక్రమార్కులు ప్రస్తుతం ఏకంగా పట్టాలనే సృష్టించారు. కోట్లాది రూపాయలు విలువచేసే ప్రభుత్వ స్థలాన్ని స్వాహా చేసే ప్రయత్నం చూసి ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.



దర్శి-అద్దంకి రోడ్డులోని కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూమి

ఆ పట్టాలు తాము ఇవ్వలేదు

● జి. సుజాత, తహసీల్దార్

దర్శి పట్టణంలోని 334/5 సర్వే నెంబర్‌లో గల స్థలానికి ఇప్పటివరకు రెవెన్యూ అధికారులు ఎవ్వరూ ఎలాంటి పట్టాలు ఇవ్వలేదు. రికార్డులు పరిశీలించి పూర్తి నివేదికను కోర్టుకు సమర్పించాం. ఆ పట్టాలు పూర్తిగా నకిలీవని స్పష్టం చేశారు. భవిష్యత్తులో కోర్టు ఉత్తర్వుల మేరకు తగు చర్యలు తీసుకుంటాం. ఆ స్థలం పూర్తిగా ప్రభుత్వానికి చెందినది అయినందున ఎలాంటి ఆక్రమణలకు గురికాకుండా రక్షణ చర్యలు తీసుకుంటాం.



ఇలవరలో బ్యారన్‌ను పరిశీలిస్తున్న ఆర్‌ఎం లక్ష్మణరావు సిబ్బంది

అనధికారికంగా బ్యారన్లు నిర్మించవద్దు

● ఆర్‌ఎం లక్ష్మణరావు

కొండపి, జూలై 11 : ప్రస్తుత పొగాకు మార్కెట్‌ను చూసి రైతులు అనధికారికంగా బోర్డు అనుమతి లేకుండా బ్యారన్ నిర్మించడం చట్టరీత్యా నేరమని బోర్డు ఒంగోలు ఆర్‌ఎం ఎం. లక్ష్మణరావు చెప్పారు. గురువారం ఉదయం ఆయన కొండపిలోని పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించారు. ఈసందర్భంగా వేలం కేంద్రంలో జరుగుతున్న పొగాకు చూర, ముక్క, పండుగుల్ల కొనుగోళ్లను పరిశీలించారు. అనంతరం వేలం కేంద్రం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అక్రమంగా రైతులు నిర్మించే బ్యారన్లపై దృష్టి పెట్టి నివేదిక ఇవ్వాలని సూచించారు. అనంతరం కట్టావారిపాలెం, ఇలవర(నేతివారిపాలెం) గ్రామాల్లో పొగాకు బ్యారన్లను ఆయన పరిశీలించారు. ఆయన వెంట వేలం నిర్వహణాధికారి సునీల్, క్షేత్ర సహాయకుడు మోతీలాల్ సిబ్బంది పాల్గొన్నారు.

● **చూర అత్యధిక ధర కేజీ రూ. 181**

కొండపి పొగాకు వేలం కేంద్రంలో కేజీ చూర అత్యధిక ధర 181 రూపాయలు పలికింది. 338 బేళ్ల రైతులు వేలానికి తీసుకురాగా వ్యాపారులు 226 బేళ్లను కొనుగోలు చేశారని వేలం నిర్వహణాధికారి జి. సునీల్‌కుమార్ తెలిపారు.

● **పండుగుల్ల కేజీ అత్యధిక ధర రూ.199**

కొండపి పొగాకు వేలం కేంద్రంలో కేజీ పండుగుల్లకు అత్యధిక ధర 199 రూపాయలు పలికింది. రైతులు 125 బేళ్లను వేలానికి తీసుకురాగా వ్యాపారులు 92 బేళ్లను కొన్నారు.

ఘనంగా బొమ్మినేని జన్మదిన వేడుకలు

ఒంగోలు, జూలై 11 : (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గం సీనియర్ నాయులు బొమ్మినేని రామాంజనేయులు జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఒంగోలులోని ఆయన కార్యాలయంలో గురువారం రాత్రి రామాంజనేయులు కేక్ కట్ చేశారు. అంతకముందు స్వగ్రామమైన ఎండ్లూరులో టీడీపీ శ్రేణుల సమక్షంలో రామాంజనేయులు జన్మదిన వేడుకలు వైభవంగా జరిగాయి. అనంతరం ఒంగోలులోని దివ్యాంగుల హాస్టల్‌లోని విద్యార్థుల మధ్య వేడుకలను నిర్వహించారు. కాగా ఒంగోలులోని బొమ్మినేని కార్యాలయంలో జరిగిన కేక్ కటింగ్ కార్యక్రమంలో సంతనూతలపాడు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన టీడీపీ ముఖ్య నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే నియోజకవర్గంలోని ఇతర గ్రామాలకు చెందిన టీడీపీ ముఖ్యనేతలలు పాల్గొన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అడకా స్వాములు, ఎస్ఎన్‌పాడు మాజీ జడ్పీటీసీ తన్నీరు శ్రీనివాసరావు, నియోజకవర్గ సీనియర్ నాయకులు గుమ్మడి సాయిబాబు, ఈదర విష్ణువర్ధన్, తక్కెళ్ళ కళ్యాణ్, పలు గ్రామాల మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

జంధ్యాల చంద్రభాస్కరశాస్త్రి స్మృతివనం ప్రారంభం

● ఆయన పంచలోహ విగ్రహం ఏర్పాటు

● ప్రత్యేక పూజలు చేసిన జనార్దన్, మాగుంట రాఘవరెడ్డి, పూర్ణచంద్రరావు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్



శనీశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న మాగుంట రాఘవరెడ్డి



చంద్రభాస్కరశాస్త్రి పంచలోహ విగ్రహం వద్ద పూజలు చేస్తున్న దామచర్ల పూర్ణచంద్రరావు

జరుగుమల్లి(కొండపి), జూలై 11 : మండలంలోని నర్సింగోలు గ్రామంలోని గంగా పార్వతీ సమేత లింగరూప శనీశ్వర ఆలయ నిర్మాత, ప్రముఖ జ్యోతిషుడు, దోష పరిహారకర్త, దివంగత జంధ్యాల చంద్రభాస్కర శాస్త్రి స్మృతివనాన్ని గురువారం వేద పండితుల చేతులమీదుగా ప్రారంభించారు. ఈస్మృతివనంలో శాస్త్రి పంచలోహ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, టీడీపీ సీనియర్ నేత పూర్ణచంద్రరావు, ఎంపీ మాగుంట తనయుడు రాఘవరెడ్డిలు పంచలోహ విగ్రహాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జరుగుమల్లి మాజీ ఎంపీపీ బెల్లం సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, సీనియర్ నాయకుడు పోటు శ్రీనివాసమురళి, నాయకులు ఏలూరి రాంబాబు, దగ్గుమాటి సుబ్బారెడ్డి, పాతూరి కోటేశ్వరరావు, కొమ్మాలపాటి కృష్ణ, చెన్నారెడ్డి వెంకటేశ్వర్లు, పోటు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రేపు చీమకుర్తిలో ఉచిత కంటి వైద్య శిబిరం

చీమకుర్తి,జూలై11: సినీనటుడు బూచేపల్లి కమలాకరరెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని శనివారం చీమకుర్తి పట్టణంలోని బీవీఎస్ఆర్ కల్యాణమండపం ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ,ఎమ్మెల్యే బూచేపల్లి వెంకాయమ్మలు తెలిపారు. చీమకుర్తిలో గురువారం సాయంత్రం జరిగిన ప్రెస్‌మీట్‌లో బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఉచిత కంటివైద్యశిబిరానికి సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించి, వివరాలను తెలిపారు. బీవీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్, శంకర కంటి ఆసుపత్రి,పెదకాకాని, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బూచేపల్లి సుబ్బారెడ్డి స్ఫూర్తితో ఏటా నిర్వహిస్తున్నట్లే ఈ ఏడాది కంటి వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి ఒంటిగంట వరకు జరిగే ఈ శిబిరం వద్దకు వచ్చేవారు ఆధార్,రేషన్‌కార్డు జిరాక్స్ పత్రాలు తీసుకురావాలని కోరారు.పరీక్షలు నిర్వహించిన తర్వాత అవసరమైన వారికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించి మందులు,కళ్లజోడు అందిస్తామన్నారు.చీమకుర్తి నుంచి బస్సులో పెదకాకాని తీసుకెళ్లి శంకర కంటి ఆసుపత్రి వైద్యులచే శస్త్రచికిత్సలు అందించిన తదుపరి తిరిగి చీమకుర్తికి తీసుకువస్తామన్నారు. ఉచిత వైద్యశిబిరానికి హాజరయ్యేవారితో పాటు అందరికి అన్నదాన చేస్తామన్నారు.ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని కంటివ్యాధులునుంచి ఉపశమనం పొందాలని వారు కోరారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు,వైసీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, క్రిస్టిపాటి శేఖరరెడ్డి, గోగినేని వెంకటేశ్వర్లు, సోమా శేషాద్రి, సుందరరామిరెడ్డి, చల్లా అంకులు, తప్పెట బాబురావు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ

పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య

ఒంగోలు(క్రైం),జూలై11: పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన స్థానిక బాపూజీ మార్కెట్ ఎదురుగా ఉన్న హనుమాన్‌లాడ్జిలో గురువారం రాత్రి వెలుగు చూసింది. జరుగుమల్లి మండలం వద్దినేనివారిపాలెంనకు చెందిన మూల రవీంద్రరెడ్డి (27) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బేల్దారి పనులు చేసే రవీంద్రరెడ్డి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. కొద్దిరోజులు వ్యవసాయ పనులపై వద్దినేనివారిపాలెం వస్తాడు. బుధవారం ఒంగోలు వచ్చి హనుమాన్‌లాడ్జిలో రూం అద్దెకు తీసుకున్నాడు. అయితే గురువారం సాయంత్రం వరకు గది తలుపులు తీయక పోయేసరికి లాడ్జి సిబ్బంది కిటికి తెరిచి చూడగా రవీంద్ర రెడ్డి నురుగు కక్కి మంచపై పడి ఉన్నాడు. ఒంగోలు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ తన సిబ్బందితో వచ్చి తలుపులు తెరిచి చూడగా రవీంద్ర రెడ్డి గదిలో మద్యం బాటిళ్లు , పురుగు మందుల డబ్బాతో పాటు తినుబండారాలు ఉన్నాయి. బుధవారం రాత్రి మద్యంలో పురుగు మందు కలుపుకొని తాగి మృతి చెందిఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహన్ని రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


అపార్ట్‌మెంట్ నుంచి పడి మహిళా కూలీ మృతి

ఒంగోలు(క్రైం),జూలై11: బేల్దారి పనులు చేస్తున్న మహిళ కూలీ అపార్ట్‌మెంట్ పై నుంచి కింద పడి మృతి చెందింది. ఈ సంఘటన స్థానిక రాజీవ్‌నగర్ ఎక్స్‌టెన్షన్‌లో నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్ వద్ద గురువారం ఉదయం జరిగింది. తాడివారిపల్లెకు చెందిన బొమ్మనబోయిన అల్లూరమ్మ(35) నాలుగో అంతస్తులో పిల్లరు బాక్సులు ఊడ తీస్తుండగా కాలు జారి కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. ఆరునెలలుగా స్థానిక శ్రీనివాసకాలనీలో నివాసం ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్న అల్లూరమ్మ రోజువారిగానే అపార్టుమెంట్ వద్దకు పనులు చేసేందుకు వెళ్ళి ప్రమాదవశాత్తు కింద పడి పోయి మృతి చెందింది. ఈమేరకు రిమ్స్‌కు తరలించి తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంచాయతీ నిధులు దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 11 : నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుంటూరు గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగం, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్థులు కోరారు. గురువారం సాయంత్రం కలెక్టర్ అమీమ్ అన్సారియాను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్యదర్శి ఇష్టారీతిన వ్యవహరించి నిధులను దుర్వినియోగం చేసినట్లు సర్పంచ్ దేవరకొండ జయమ్మ ఫిర్యాదు చేయడంతో విచారణ కూడా జరిగిందన్నారు. విచారణలో అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారించినా ఇంతవరకు చర్యలు తీసుకోలేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

గుంటూరు	: నాజ్ థియేటర్	పిడుగురాళ్ళ	: గంగామహల్
గుంటూరు	: హరిహరమహల్	పొన్నూరు	: శ్రీలక్ష్మీ
గుంటూరు	: గౌరీ శంకర్	మంగళగిరి	: ఊర్వశి
గుంటూరు	: శివ థియేటర్	మంగళగిరి	: వెంకటేశ్వర
గుంటూరు	: సినీ స్క్వేర్	రేపల్లె	: రాజ్యలక్ష్మి
గుంటూరు	: సినీ ప్రైమ్	మాచర్ల	: వెంకటేశ్వర
గుంటూరు	: వి.ప్లాటినో	సత్తెనపల్లి	: సాయికృష్ణ
గుంటూరు	: ఫోనిక్స్ మాల్ (మైత్రీ)	వినుకొండ	: కీర్తి డీలక్స్
గుంటూరు	: ది సినిమాస్	అద్దంకి	: వి.ఎన్.ఎస్
గుంటూరు	: జెఎల్ఇ సినిమాస్	టంగుటూరు	: అప్సర
ఒంగోలు	: గోరంట్ల సినిమాస్	చీమకుర్తి	: కె3కె సినిమాస్
ఒంగోలు	: రవి ప్రియమాల్		
ఒంగోలు	: సత్యం థియేటర్		
తెనాలి	: సంగమేశ్వర		
తెనాలి	: పెమ్మసాని		
నరసరావుపేట	: లక్ష్మి నరసింహ		
నరసరావుపేట	: ఈశ్వరమహల్		
చిలకలూరిపేట	: సాయి కార్తీక		
చీరాల	: సురేష్‌మహల్		
బాపట్ల	: శ్రీనివాసమహల్		



ఆంధ్రజ్యోతి ప్రతిరోజు క్లాసిఫైడ్స్ ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం

ట్రైనింగ్ సెంటర్

n రాధిక M.P.H.W ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్, సుందరయ్య భవన్ రోడ్, శ్రీనివాస హాస్పిటల్ ఎదురు, ఒంగోలు, కోర్సులు : M.P.H.W(F), ANM / DMLT Q: ఇంటర్ ఏ గ్రూప్ వారైన, ప్రభుత్వ స్కాలర్‌షిప్ కలదు. సంప్ర॥ 08592 282349, 8978869519, 7674998230

AJO-190174

WANTED HINDI TEACHER

n Hindi Subject Teacher Wanted from 6th to 10th Classes Hindi Subject Teaching. Free Boarding and Lodging. Contact immediately, Sri Raghavendra High School, Kurichedu, Cell: 9490327336

AJO-190347

WANTED

n ఒంగోలు సమతానగర్‌లోని శ్రీగాయత్రి గ్రామర్ స్కూల్ నందు పనిచేయుటకు Clerak Cum Computer Operator, Lady Computer Teacher కావలెను. సంప్రదించండి సెల్ : 9014404155

AJO-274

కావలెను

n మీ ఇంటి వద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి, న్యూ రికార్డులు వ్రాయుటకు స్త్రీ, పురుష అభ్యరులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12,000. సంప్ర॥ 9550745296.

AJV-192984

PROPERTY FOR SALE

n BHK flat in BSK Guptas Lake Side Apartment, 1st floor (No.102, SOUTH facing) in Lawyerpet, Montessori School Road for Sale. Genuine buyers please Contact : 9866595746

AJH-14295

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు,చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, ఉద్యోగ, వ్యాపార, బహిరంగ ప్రకటనలు, అంత్యక్రియలు, శ్రద్ధాంజలి, వర్థంతి, జయంతి మరియు అన్నిరకాల ప్రకటనలు కొరకు సంప్ర॥

ఒంగోలు : 99854 11071, 97036 18694, 95053 05888
చీమకుర్తి : 96525 55752
చీరాల : 99859 21376
మార్కాపురం : 99859 21358
కందుకూరు : 97036 18697
కనిగిరి : 99854 11483
గిద్దలూరు : 99859 21358

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావలసినవారు మరియు పేపరు పంపిణీ విషయంలో ఎటువంటి సమస్యలు ఉన్నా సంప్ర॥ Asst-Cir-Manager. 9985411484

ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన ఐదుగురు విద్యార్థులు

నాగులుప్పలపాడు, జూలై 11 : పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. ఉప్పుగుండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎండ్లూరి సిరివెన్నెల పదో తరగతిలో 561 మార్కులు సాధించి శ్రీకాకుళంలోని ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. మాచవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కందుకూరి సుమశ్రీ 587 సాధించి జిల్లాస్థాయిలో 3 వ స్థానంలో నిలిచి నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించగా, మరో విద్యార్థి గోళ్ళ సాత్విక్ 565 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించడంతో పాటు ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికైయ్యాడు. బి.నిడమానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు షేక్ మొహమ్మద్ షఫి ఆలం, లామా లిఖిత్ కుమార్‌లు గురువారం ప్రకటించిన ట్రిపుల్ ఐటీ ఫలితాలలో ఎంపికైయ్యారు. ఆయా విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

మద్దిపాడులో..

మద్దిపాడు :మద్దిపాడు మండలం ఇనమనమెల్లూరు గుండ్లాపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన చందలూరి సాయి భార్గవ్‌కు శ్రీకాకుళం క్యాంపస్‌లో ట్రిపుల్ ఐటీ సీటు దక్కింది. అలాగే గుండ్లాపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన చిట్టిమాల నిలీష్ కూడా ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నూతక్కి నాగకల్యాణి, మండవ ప్రభాకర్ రావులు తెలిపారు.

సీట్లు సాధించిన మర్రిపూడి విద్యార్థినులు

మర్రిపూడి : మండలంలోని కాకర్ల, మర్రిపూడి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినిలు ట్రిపుల్‌ఐటీలో సీట్లు సాధించారు. మర్రిపూడికి చెందిన ఎన్ ప్రత్యూషా, పీ కళ్యాణి, కాకర్లకు చెందిన రావూరి అర్చణ, చిర్రా రమ్యలు నూజివీడు, ఒంగోలు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో ప్రవేశ అర్హత పొందారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రెబ్బా వెంకటేశ్వర్లు, బీడీ కిశోర్‌కుమార్‌లు విద్యార్థినిలను అభినందించారు.

టంగుటూరులో సత్తా చాటిన విద్యార్థులు

ఆలకూరపాడు(టంగుటూరు) : మండలంలోని ఆలకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ట్రిబుల్ ఐటీలో సత్తా చాటి ప్రత్యేకతను చాటుకుంది. ఇదే ఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు ట్రిబుల్ ఐటీలో సీట్లు సాధించారు. వారిలో ఉప్పితెర్ల నాగవెంకటసాయి(నూజివీడు), చిడిపోతు అమృత(నూజివీడు), పేరం యెహోషువా(ఒంగోలు)లో ట్రిబుల్ ఐటీ సీట్లు సాధించారు. వీరిని ప్రధానోపాధ్యాయుడు వాకా వెంకటేశ్వరరెడ్డి, పీఎంసీ చైర్మన్ చీకటి విక్రమ్, ఎన్ఆర్ఐ నార్నె శ్రీనివాసులు, ఆలం రామారావు, దివి హరిబాబు, నార్నె రామారావు, బడుగు వేణు పాఠశాల ఉపాధ్యాయులు దామచర్ల శ్రీధర్, ముప్పరాజు సురేష్ అభినందించారు.

సెక్టోరల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ఒంగోలు(విద్య), జూలై 11 : సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో ఖాళీగా ఉన్న సెక్టోరల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. కమ్యూనిటీ మొబిలైషన్ ఆఫీసర్(సీఎంవో) ఇన్ క్యూజివ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్(ఐఈసీవో), అల్టర్నేటివ్ స్కూల్స్ కో ఆర్డినేటర్(ఎఎల్ఎస్‌సీవో), అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్(ఏఎస్‌వో) పోస్టులను భర్తీ చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి డి. సుభద్ర తెలిపారు. స్కూలు అసిస్టెంట్లను ఫారిన్ సర్వీసుపై ఈ పోస్టుల్లో నియమిస్తారు. ప్రభుత్వ జిల్లా పరిషత్, మునిసిపల్ యాజమాన్యాల పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూలు అసిస్టెంట్లు ఈ పోస్టులకు అర్హులు. అర్హులైన స్కూలు అసిస్టెంట్లు ఈ పోస్టులకు ఈనెల 16వతేదీ సాయంత్రం ఐదు లోపు స్థానిక సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో సమర్పించాలి. అభ్యర్థులు తమ దరఖాస్తులతో పాటు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు, సర్వీసు రిజిస్టరు జెరాక్స్ కాపీలు సమర్పించాలి. ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేసేవారు అయా పోస్టులకు విడివిడిగా దరఖాస్తులు సమర్పించాలని డీఈవో కోరారు.

పల్లామల్లి సీఈవో ఫిర్యాదుపై నేడు జేసీ విచారణ

ఒంగోలు(విద్య), జూలై 11 : చీమకుర్తిమండలం పల్లామల్లి సొసైటీ విచారణాధికారి బీవీఎస్ శాస్త్రిపై ఆ సొసైటీ సీఈవో జీవీ రమణయ్య చేసిన ఫిర్యాదుపై శుక్రవారం జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ విచారణ జరపనున్నారు. సొసైటీలో జరిగిన అక్రమాలపై విచారణ చేస్తున్న విచారణాధికారి సొసైటీ సీఈవో రమణయ్యను దూషించడం, అందరి ముందు పరువు తక్కువగా మాట్లాడటం చేసేవారు. విచారణాధికారి అవమానాలు తట్టుకోలేక రమణయ్య సహకార శాఖ ఉన్నతాధికారులు, డీసీవో, ఒంగోలుడిఎస్‌సీలకు ఫిర్యాదు చేశారు. ఇది జరిగి 15 రోజులైంది. దీనిపై డీసీవో శ్రీనివాసరెడ్డి విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదికను సమర్పించారు. కలెక్టర్ ఎటువంటి చర్యలు తీసుకోకుండానే నివేదికను జాయింట్ కలెక్టర్‌కు పంపించి మళ్లీ విచారణ జరపమన్నారు. దీంతో జేసీ శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు విచారణ నిర్వహించనున్నారు. విచారణకు హాజరు కావాలని విచారణాధికారికి, సొసైటీ సీఈవోకు నోటీసులు జారీ చేశారు. జేసీ విచారణలో ఏమి తేలనుందో వేచి చూడాల్సిందే.

VEHICLE FOR SALE

VEHICLE NO	VEHICLE DESCRIPTION	YEAR
AP39TE-4652	TATA LPT 1412 FBT	2018
AP27TX-5299	AL 3718 IL FBT	2015
AP27TX-9812	AL DOST	2016
AP39W-0728	MAHINDRA BOLERO MAXI TRUCK PLUS	2019
AP39HA-4175	SWIFT DZIRE LDI DIESEL 5 SEATER	2017
AP26BR-2622	JCB INDIA LTD	2016

AUCTION DATE : 12-07-2024
SHRIRAM AUTO MALL INDIA LIMITED
Doddavarappadu(V&PO), Maddipadu(M), ONGOLE, Prakasam(DT), 99498 29182, 95737 11099

భాష్పాంజలి



మంచితనం, మానవత్వం మూర్తీభవించి, మా అందరి హృదయాలలో చెరగని ముద్ర వేసి మా ఉన్నతికి అహర్నిశలు శ్రమించి, తిరిగిరాని లోకాలకు వెళ్ళిన శ్రీ నల్లూరి రాఘవస్వామి గారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

అశ్రునయనాలతో...

స్వర్గీయ నల్లూరి రాఘవస్వామి గారు
సుజాతనగర్, ఒంగోలు

భార్య : అనంతరాజ్యం

కుమారులు - కోడళ్లు : నల్లూరి రాము - కిరణ్మయి | నల్లూరి వెంకయ్య - లక్ష్మీకిరణ్

మనుమరాండ్రు : ప్రణీత, హసిత | మనుమలు : అభినవ్, సాత్విక్

పెద్దకర్మ : తేది.13-07-2024 శనివారం ఒంగోలు సుజాతనగర్ 6వలైనులోని మా స్వగృహము నందు జరుగును . కావున తెలియజేయడమైనది.

పార్కు ఏర్పాటు చేయరూ..!



జూనియర్ కళాశాల గ్రౌండ్ అరుగుపై సేదతీరుతున్న పలువురు

- సేదతీరేందుకు అవకాశం లేక ప్రజల్లో నిరాశ
- కళాశాల మైదానాన్నైనా అభివృద్ధి చేయాలని వినతి

పొదిలి, జూలై 11 : పొదిలి పట్టణం జిల్లాకు మధ్యలో, పశ్చిమ ప్రకాశానికి సింహద్వారంలా ఉంటుంది. దీనికితోడు నగర పంచాయతీగా స్థాయి పెరిగింది. కానీ ప్రజలు సేద తీరేందుకు చిన్నపాటి పార్కు(ఉద్యానవనం) కూడా లేదు. దీంతో పట్టణవాసులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్కుల ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రాదేశాలు ఉన్నప్పటికీ, ఏర్పాటుకు అధికారులు, పాలకులు ముందుకు రావడం లేదని వాపోతున్నారు.

రోజురోజుకు పట్టణం విస్తరిస్తూ నగరపంచాయతీగా స్థాయి పెరిగింది. కానీ మౌలికవసతుల కల్పన అంతంత మాత్రంగానే ఉంది. పట్టణంలో 20 వార్డులు, సుమారుగా 38,500లకుపైగా జనాబా ఉన్నారు. పెరుగుతున్న జనాబాకు అనుకూలంగా అహ్లాదంగా, ఉల్లాసంగా గడిపేందుకు పార్కులు లేకపోవడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రస్తుతానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒక్కటే పట్టణం మొత్తానికి దిక్కయింది. అదేవిధంగా ఉద్యోగులు వారాంత పు సెలవుల్లో, రిటైర్ ఉద్యోగులు, విద్యార్థులు సాయంత్రం సమయంలో కాసేపు అహ్లాదంగా సేదతీరేందుకు అనుకూలమైన ప్రదేశం లేకపోవడంపై కాసింత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణ ప్రజలే కాకుండా వివిధ రకాల పనులపై చుట్టుపక్కల గ్రామాలవారు, దగ్గరి మండలాలైన కొనకనమిట్ల, మర్రిపూడి చెందిన వారు కూడా రకరకాల పనులమీద పట్టణానికి వస్తుంటారు. వారికి కూడా వీధుల వెంబడి చెట్లనీడే దిక్కవుతోంది. చుట్టుపక్కల మండలాల్లో పనిచేసే ఉద్యోగులు పొదిలిలోనే నివాసం ఉంటారు. వారు అలా కాసేపు సేదతీరేందుకు కనీసం చిన్నపాటి పార్కు లేకపోవడంతో ఇళ్లకే పరిమితం కావాల్సి వస్తోందని అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

గతంలో చొరవ చూపినా

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో దర్శిరోడ్డులో పార్కు ఏర్పాటు చేయాలని స్థలం కేటాయించి పనులు కూడా ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వం మారడంతో పార్కు ఏర్పాటు ఆగిపోయింది. కానీ ఆ ప్రాంతం పట్టణానికి దూరంగా ఉంటుందని అప్పట్లో కొంతమంది స్థానికులు తమ అభిప్రాయపడ్డారు. కనుక పట్టణానికి అనువైన ప్రాంతంలో పార్కు ఏర్పాటు చేసి ప్రజలు అహ్లాదంగా గడిపేందుకు అవకాశం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. పొదిలి పంచాయతీగా ఉన్నప్పుడు స్థలం కొరతతో ఉద్యానవనాలు ఏర్పాటు చేయలేకపోతున్నామని అధికారులు చెబుతున్నారు. అయితే స్థానికంగా ఉండే ప్రజాప్రతినిధులు చొరవతీసుకుంటే ప్రస్తుతం అందరు సాయంత్రం వేళ సేదతీర్చుకుంటున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణాన్ని అనుకూలం గా ఏర్పాటు చేయవచ్చు. ఇప్పటికే వాకింగ్ చేసుకు నేందుకు అనుకూలంగా రహదారి ఏర్పాటు చేశారు. అదేవిధంగా అధికారుల అనుమతితో చిన్నారులు ఆటలాడుకునేందుకు, పెద్దలు సేదతీరేందుకు అవకాశం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కనుక ప్రజల, చిన్నారులు, విశ్రాంత ఉద్యోగులు ఉల్లాసంగా గడిపేందుకు అనుకూలంగా పార్కును ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



మైదానంలో ఆటలాడుతున్న చిన్నారులు, యువకులు



వాకింగ్‌కు అనుకూలంగా ఏర్పాటు చేసిన రహదారి

వాసంతి హంతకులను కఠినంగా శిక్షించాలి

మార్కాపురం వన్‌టౌన్, జూలై 11: చిన్నారి వాసంతిని అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని వాల్మికీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక వాల్మికీ సంఘ కార్యాలయంలో గురువారం మాట్లాడుతూ.. నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం ముచ్చుమర్రిలో వాసంతిని ముగ్గురు యువకులు మాయమాటలు చెప్పి తీసుకెళ్లి కిరాతంగా అత్యాచారం చేశారు. అనంతరం కాలువలో పడేసి చంపేశారు.. నిందితులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకుల భూపతి కాశయ్య, నల్లబోతుల కొండయ్య, అచ్చయ్య, కాటంరాజు, గురుబ్రహ్మం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వాల్మీకి సంఘం నాయకులు

ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి

- ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ మండల అధ్యక్షుడు ధనరాజు

పెద్ద దోర్నాల, జూలై 11: ఎస్సీ, ఎస్టీలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందేలా కృషి చేస్తానని ఆ కమిటీ మండల అధ్యక్షుడు కాకర్ల ధనరాజు అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండల కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటి జిల్లా అధ్యక్షులు బూదాల గురవయ్య, కార్యదర్శి ఆరేటి నాగయ్య, గౌరవాధ్యక్షులు ఉప్పల పాటి నాగయ్యలు కమిటీని ఎంపిక చేశారు. మండల అధ్యక్షులుగా కాకర్ల ధనరాజును నియమిస్తూ, నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర నాయకులు జయచంద్ర, ఆదిమూలపు అనిల్‌లూకా పీ కాశయ్య, నాగేశ్వరరావు, యేసేబు, ప్రభుదాసు, పోలయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

తూనికలు కొలతల శాఖల అధికారుల దాడి

- పలువురిపై కేసులు నమోదు

కంభం, జూలై 11 : కంభం పట్టణంలో పలుదుకాణాలపై తూనికలు, కొలతల శాఖ అధికారులు దాడులు చేసి కేసులు నమోదు చేసినట్లు అధికారి షేక్ రియాజ్ తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని బేకరి, కిరాణా, సిగరేట్ హోల్‌సేల్ షాపు, రిలయన్స్‌మార్ట్ షాపులపై ఆకస్మికంగా దాడులు చేశారు. తూనికలలో తేడా, వస్తువులను అధిక రేట్లకు విక్రయించడం గమనించి రూ.18,500 జరిమానా విధించినట్లు తెలిపారు.



దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

మంత్రి జనార్దన్‌రెడ్డితో ముత్తుముల భేటీ

గిద్దలూరు టౌన్, జూలై 11 : రాష్ట్రరోడ్డు భవనాల శాఖ మంత్రి బీ.సీ.జనార్దన్‌రెడ్డితో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి భేటీ అయ్యారు. గురువారం సచివాలయంలో మంత్రి జనార్ధన్‌రెడ్డిని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి కలిసి నియోజకవర్గంలోని పలు ఆర్‌అండ్‌బీ రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, వాటి మరమ్మతులతోపాటు కొత్తరోడ్లను ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి జనార్ధన్‌రెడ్డి గిద్దలూరు నియోజకవర్గంలోని రోడ్ల అభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చారు.



జనార్ధన్‌రెడ్డితో మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

15న మండల సర్వసభ్య సమావేశం

కంభం, అర్ధవీడు, జూలై 11 : ఈ నెల 15న సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు కంభం మండల సర్వసభ్య సమావేశం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మస్తాన్‌వలి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ శాఖల అధికారులు తగు సమాచారంతో హాజరుకావాలని కోరారు.

16న అర్ధవీడు మండలంలో

ఈనెల 16న మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటలకు అర్ధవీడు మండల సర్వసభ్య సమావేశం అర్ధవీడు మండల ఎంపీడీవో కార్యలయ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సాంబశివరావు తెలిపారు. కావున ఈ సమావేశాలకు ఆయా మండలాల్లోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, జడ్పీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

సాయిమందిరంలో భక్తులకు అన్నదానం

- ప్రారంభించిన కృష్ణకిషోర్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, జూలై 11 : పట్టణంలోని సాయి బాబా మందిరంలో గురువారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని సాగనబోయిన రమేష్, చిన్నరోశయ్య కుటుంబ సభ్యులు సాగనబోయిన రాముడు వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేయగా అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముత్తుముల అశోకొరెడ్డి సోదరుడు కృష్ణకిశోర్‌రెడ్డి ప్రారంభించారు. తొలుత దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దప్పిలి భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పాలుగుళ్ల ప్రతాపరెడ్డి, టీడీపీ నాయకులు దుత్తా బాలీశ్వరయ్య, బీజేపీ నాయకులు డాక్టర్ జేవీ.నారాయణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి సోదరుడు కృష్ణకిశోర్‌రెడ్డి

అర్హులైన ప్రతి కౌలు రైతుకు గుర్తింపు కార్డు

మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా

మార్కాపురం రూరల్, జూలై 11: అర్హులైన ప్రతి కౌలు రైతుకు గుర్తింపు కార్డును జారీ చేయాలని సంబంధిత అధికారులను సబ్ కలెక్టర్ రాహుల్ మీనా ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం కౌలురైతులకు గుర్తింపు కార్డుల జారీప్రక్రియపై రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాటాడుతూ.. గ్రామాలలో రైతులతో సమావేశాలు నిర్వహించి కౌలు రైతులను గుర్తించాలన్నారు. భూమిని కౌలుకు తీసుకొని పంటలు సాగు చేస్తున్న రైతుల వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న మూడు రోజులలో కౌలు రైతుకు గుర్తింపు కార్డును మంజూరు చేయాలని ఆదేశించారు. ఏడీఏ బాలాజీనాయక్ మాట్లాడుతూ.. ఈ-పంట నమోదు, అన్నదాత సుఖీభవ, పంట నష్ట పరిహారం, బీమా, పంట కొనుగోలు, రాయితీపై వ్యవసాయ పరికరాలను సైతం కౌలు రైతులకు ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏవో దేవిరెడ్డి శ్రీనివాసులు, డీటీ శ్రీనివాసులు, మండలంలోని వీఆర్‌వోలు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏవో జవహర్‌లాల్‌నాయక్

కౌలు కార్డులపై అవగాహన

గిద్దలూరు : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో కౌలు కార్డుల జారీపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ జి.సిద్ధార్థ మాట్లాడుతూ సీసీఆర్‌సీ చట్టం ప్రకారం మండలంలోని ప్రతి కౌలు రైతుకు తప్పనిసరిగా కౌలు కార్డులు ఇవ్వాలన్నారు. గిద్దలూరు మండలానికి 1461 కౌలుకార్డులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. గ్రామసభలు ఏర్పాటు చేసి అర్హులందరికీ కౌలు కార్డులు ఇవ్వాలని సూచించారు. ఈ కార్డు పరిమితి 11 నెలలు మాత్రమే ఉంటుందని దీని మీద కౌలుదారులకు పంట మీద మాత్రమే హక్కు ఉంటుందన్నారు. భూమి మీద హక్కు ఉండదని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : మండలంలోని అర్హులైన కౌలురైతులను గుర్తించాలని మండల వ్యవసాయాధికారి డీ జవహర్‌లాల్ నాయక్ వీఆర్‌వో, వ్యవసాయ సహాయకులకు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారులు, వ్యవసాయ సహాయకులకు కౌలు రైతుల గుర్తింపు, వారికి ప్రభుత్వ పథకాల అమలుపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో జవహర్ లాల్‌నాయక్ మాట్లాడుతూ పంటసాగు పత్రం (సీసీఆర్‌సీ) కార్డుల మంజూరు, వాటిని పొందడం వల్ల కలిగే ప్రయోజనాలను కౌలు రైతులకు వివరించారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, చిన్న సన్నకారు రైతులకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఆయా గ్రామాల్లోని వీఆర్‌వో, వీఏఏలు గ్రామసభలు నిర్వహించాలన్నారు. పంటరుణాలు, విత్తనాలు, పంటలబీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ఈ-పంట నమోదు చేయించు కోవడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ వీ.నాగేశ్వర రావు, రెవెన్యూ అధికారులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

1023 మంది కౌలురైతు కార్డులు

గిద్దలూరు టౌన్, : కంభం మండలంలో మొత్తం 1023 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చేలా లక్ష్యంగా పనిచేయాలని వ్యవసాయశాఖ, రెవెన్యూ శాఖల సిబ్బందికి ఏవో స్వరూప సూచించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సంవత్సరానికి 1023 మంది రైతులను లక్ష్యంగా నిర్ణయించామని, ప్రతి గ్రామంలో షెడ్యూలు వేసుకుని రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు.



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా

ఆర్టీసీ డిపోలో సమస్యలు వెంటనే పరిష్కరించాలి

ఆవిర్భావ వేడుకల్లో ఎంప్లాయీస్ యూనియన్ నాయకుల డిమాండ్

పొదిలి, జూలై 11 : ఆర్టీసీ డిపోలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంప్లాయిస్ యూనియన్ జాయింట్ సెక్రెటరీ ఏ దివాకర్ కోరారు. గురువారం యూనియన్ 73వ ఆవిర్భదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా జెండా ఆవిష్కరించి కేకు కట్ చేసి కార్మికులకు పంచిపెట్టారు. అనంతరం గేట్‌మీటింగ్‌లో భాగంగా సమస్యలపై మాట్లాడుతూ త్వరితగతిన డ్యూటీచార్ట్‌లు వేసి కండక్టర్, డ్రైవర్లకు లీవ్‌పొజిషన్ కల్పించాలన్నారు. సమస్యలను డీపీటీవో దగ్గరకు తీసుకెళ్లినా పరిష్కరించలేదన్నారు. కనుక ఈ నెల 15వ తేదీ నుంచి నాయకత్వ సూచనల మేరకు కార్యచరణ అమలు చేస్తామన్నారు. సంబంధిత అధికారులు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అసిస్టెంట్ సెక్రెటరీ ఎస్‌కే బాష మాట్లాడుతూ సూపరిండెంట్ ధనమ్మ రిలీవింగ్‌పై వచ్చారన్నారు. ఒక యూని యన్‌కు సపోర్టు చేస్తున్నారని ఆమెను వెంటనే బదిలీ చేయా లని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యోగు లు, మహిళా ఉద్యోగులు, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ ఆరోపణపై సూపరింటెండెంట్ ధనమ్మ స్పందిస్తూ, డిపోలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు అందరు సమానమే అన్నారు. అందరిని కలుపుకొని వెళతూ డిపో అభివృద్ధికి తోడ్పడుతున్నట్లు తెలిపారు.



కేకు కట్ చేస్తున్న యూనియన్ నాయకులు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

ద్విచక్రవాహనాన్ని తప్పించే క్రమంలో బోల్తాపడ్డ ఆటో

పెద్దారవీడు, జూలై 11: రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పెద్దారవీడు మండలం తోకపల్లి వద్ద గురువారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఎర్రగొండపాలెం మండలం అమ్మాని గుడిపాడుకు చెందిన సీహెచ్ బ్రహ్మాచారి, ఆయన భార్య గంగాదేవి, కుమారుడు సుబ్రహ్మణ్యాచారీలు ఆటోలో మార్కాపురం వస్తున్నారు. ఎర్రగొండపాలెం మండలం గంగుపల్లికి చెందిన డి.రామానుజన్ నాయక్ మార్కాపురం నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామం వెళుతున్నాడు. తోకపల్లి వద్ద అమరావతి-అనంతపురం జాతీయ రహదారిపై మోటార్ సైకిల్‌పై వెళుతున్న రామా నుజన్‌నాయక్ ఆటోను ఢీ కొట్టాడు. మోటార్‌సైకిల్‌ను తప్పించ బోయిన క్రమంలో ఆటోబోల్తా పడింది. ఈ ఘటనలో సుబ్రహ్మణ్యాచారి(14)కి తీవ్రగాయా లయ్యాయి. రెండు కాళ్లు, రెండు చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. బాలుడి తల్లిదండ్రులు బ్రహ్మాచారి, గంగావతిలకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను మార్కాపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. వందలాది వాహనాలు తిరిగే జాతీయ రహదారిపై గురువారం ఉదయం 8 గంటల సమయంలో ఈ ఘటన తమ దృష్టికి రాలేదని పోలీసులు చెప్పడం శోచనీయం.



ప్రమాదంలో గాయపడిన సుబ్రహ్మణ్యాచారి



గాయపడ్డ బ్రహ్మాచారి, రమాదేవి

రూ.5కోట్ల ప్రభుత్వ భూమి స్వాహాకు యత్నం

దర్శి, జూలై 11: కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వభూమిని స్వాహా చేసేందుకు కొంతమంది అక్రమార్కులు నకిలీ పట్టాలు సృష్టించారు. ఆ పట్టాలను అడ్డుపెట్టుకొని తమకు పొజిషన్ చూపాలని ఏకంగా కోర్టుకు వెళ్లారు. కోర్టు నుంచి ఆ ప్రభుత్వభూమికి సంబంధించిన వివరాలను సమర్పించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించటంతో అసలు విషయం బయటపడింది. ఆ ప్రభుత్వభూమికి ఎలాంటి పట్టాలు ఇవ్వలేదని తేలింది. దర్శి-అద్దంకి రోడ్డులో 340/5 సర్వే నెంబర్‌లో సుమారు 80 సెంట్ల ప్రభుత్వభూమి ఉంది. అందులో పది సెంట్ల భూమిని సొసైటీ కార్యాలయానికి కేటాయించారు. మరికొంత భూమిని అధికారులు రోడ్డుకు కేటాయించారు. ప్రస్తుతం 50 సెంట్ల స్థలం ఖాళీగా ఉంది. దర్శి-అద్దంకి ప్రధాన రహదారి ఆనుకొని ఉన్న ఆ స్థలం సెంటు విలువ రూ.10 లక్షలకు పైగా ఉంది. ఎంతోకాలంగా ఆ స్థలాన్ని స్వాహా చేసేందుకు అనేకమంది ఎన్నోరకాలుగా ప్రయత్నాలు చేశారు. అందులోభాగంగా కొంతమంది 20 సెంట్లను ఐదుగురు వ్యక్తులకు ఇంటి నివేశ పట్టాలు ఇచ్చినట్లు రికార్డులు సృష్టించారు. ఈవిషయంపై వారే కోర్టుకు వెళ్లటంతో రెవెన్యూ అధికారులు పూర్తి వివరాలను కోర్టుకు సమర్పించారు. రికార్డుల ప్రకారం ఆ భూమి ప్రభుత్వ భూమిగా నమోదైంది. ఇప్పటివరకు ఎవరికీ ఎలాంటి పట్టాలు మంజూరు చేయలేదు.

అయితే, అక్రమార్కులు సృష్టించిన పట్టాలలో 2001లో తహసీల్దార్ ఎల్‌వీ ప్రసాద్ ఆ పట్టాలు ఇచ్చినట్లు సంతకాలు ఉన్నాయి. తహసీల్దార్ కార్యాలయంలో పట్టాలు ఇచ్చిన ఫైలు ఎక్కడా లేదు. దీంతో ఆ పట్టాలు నకిలీవని ధ్రువీకరించుకున్న అధికారులు కొద్దిరోజుల క్రితం కోర్టుకు నివేదిక సమర్పించారు. అదేస్థలంలో తాము కొంతభాగంలో ఇళ్లు వేసుకొని 30 సంవత్సరాల క్రితం నివాసం ఉన్నామని, తమకు పట్టాలు ఇవ్వాలని మరికొందరు కోర్టుకు వెళ్లారు. వీరి మధ్య వివాదంతో నకిలీ పట్టాల భాగోతం బయటపడింది. గత ఏడాది, ప్రస్తుతం నకిలీ పట్టాలు సృష్టించిన వ్యక్తులు అక్కడ ఇళ్లు నిర్మించే ప్రయత్నాలు చేశారు. ఆంధ్రజ్యోతి కథనంతో అప్రమత్తమైన అధికారులు అడ్డుకున్నారు. అప్పటి కనిగిరి ఆర్డీవో తోటా అజయ్‌కుమార్ ఆ స్థలాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ స్థలం ప్రభుత్వానికి సంబంధించిందని, ఎవరైన ఆక్రమణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆ సందర్భంగా అక్రమార్కులను హెచ్చరించారు. ఇళ్ల నిర్మాణం కోసం పెట్టిన గోడలను తొలగించారు. వాస్తవంగా ఈ పట్టాలు నిజమైతే ఆ సమయంలో ఈ పట్టాలను ఆర్డీవోకు చూపించేవారు. ఆ సమయంలో తాము ఈ స్థలాన్ని ఇతర వ్యక్తుల నుంచి తెలియక కొనుగోలు చేశామని న్యాయం చేయాలని వారు కోరారు. ప్రభుత్వభూమిని కొనటం, విక్రయింటచం నేరమని ఇలాంటి చర్యలకు పాల్పడవద్దని ఆసందర్భంగా ఆర్డీవో అజయ్‌కుమార్ హెచ్చరించారు. సుమారు ఏడాది కాలం మౌనంగా ఉన్న అక్రమార్కులు ప్రస్తుతం ఏకంగా పట్టాలనే సృష్టించారు. కోట్లాది రూపాయలు విలువచేసే ప్రభుత్వ స్థలాన్ని స్వాహా చేసే ప్రయత్నం చూసి ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ఆ పట్టాలు మేము ఇవ్వలేదు

దర్శి పట్టణంలోని 334/5 సర్వే నెంబర్‌లో గల స్థలానికి ఇప్పటివరకు రెవెన్యూ అధికారులు ఎవ్వరూ ఎలాంటి పట్టాలు ఇవ్వలేదు. రికార్డులు పరిశీలించి పూర్తి నివేదికను కోర్టుకు సమర్పించాం. ఆ పట్టాలు పూర్తిగా నకిలీవని స్పష్టం చేశారు. భవిష్యత్తులో కోర్టు ఉత్తర్వుల మేరకు తగు చర్యలు తీసుకుంటాం. ఆ స్థలం పూర్తిగా ప్రభుత్వానికి చెందినది అయినందున ఎలాంటి ఆక్రమణలకు గురికాకుండా రక్షణ చర్యలు తీసుకుంటాం.

జి సుజాత, తహసీల్దార్



దర్శి-అద్దంకి రోడ్డులోని కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమి

అవీ..ఇవీ..

పౌష్టికాహారంపై బాలింతలకు అవగాహన

త్రిపురాంతకం, జూలై 11: బాలింతలకు, గర్భిణులకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం మండలంలోని రాజుపాలెంలో గురువారం చోటు చేసుకొంది. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ హైమావతి మాట్లాడుతూ 100 రోజుల కార్యక్రమంపై వివరించారు. 3 సంవత్సరాలు నిండిన చిన్నారులను తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించే ప్రీ స్కూల్‌కు పంపించాలన్నారు. బాల్యవివాహాలు, వాటివల్ల జరిగే నష్టాలు, చట్టాలపై వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజరు విశ్రాంతమ్మ, బాలామణి, నాంచారమ్మ, తల్లులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ హైమావతి

అధ్వానంగా పాములపల్లి రహదారి



అధ్వానంగా మారిన పాములపల్లి రహదారి

గిద్దలూరు, జూలై 11 : పట్టణంలోని కొండపేట రోడ్డులోని అండర్ బ్రిడ్జి నుంచి పాములపల్లికి వెళ్లే అడ్డరోడ్డు వరకు రోడ్డంతా అధ్వానంగా తయారైంది. మట్టిరోడ్డు కావడంతో చిన్నపాటి వర్షానికే రోడ్డు బురదమయంగామారి నడిచేందుకు కూడా వీలుకావడం లేదు. దీంతో పాదాచారులు జారి పడుతుండగా, ద్విచక్ర వాహనచోదకులు బురదలో టైర్లు ఇరుక్కుని అల్లాడిపోతున్నారు. ఈ రోడ్డును సిమెంటు రోడ్డుగా మార్చాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

గురుపౌర్ణమి విశిష్టత తెలుసుకోవాలి

మార్కాపురం వన్‌టౌన్, జూలై 11: ప్రతిఒక్కరూ గురుపౌర్ణమి విశిష్టత తెలుసుకోవాలని సాయి ఉపాసకులు సాయిదాసు శ్రీశైలం అన్నారు. గురు పౌర్ణమి ఉత్సవాల లో భాగంగా స్థానిక నెహ్రూబజార్‌లోని షిరిడీసాయి మందిరంలో గురువారం ఆయన హాజరై గురుపౌర్ణమి విశిష్టత వివరించారు. శ్రీ మహావిష్ణువు అంశగా జన్మిం చిన వ్యాసభగవానుడు జన్మించిన రోజును గురువులను పూజించడం సంప్రదాయం అన్నారు. బాబా తన భక్తులకు పరోక్షంగా గురుపౌర్ణమి రోజు గురువును పూజించమని సూచించారన్నారు. అలాగే అందరూ వారివారి గురువులను పూజించటం సంప్రదాయం అన్నారు. అనంతరం సాయి జీవిత చరిత్ర అఖండ పారాయణం ప్రారంభించారు.



సందేశం ఇస్తున్న సాయిదాసు శ్రీశైలం

డిగ్రీ నాలుగవ సెమిస్టర్‌లో శ్రీసాధన ప్రతిభ

మార్కాపురం వన్‌టౌన్, జూలై 11: డిగ్రీ నాలుగవ సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో శ్రీ సాధన డిగ్రీ కళాశాల విద్యార్థులు 92శాతం సగటు ఉత్తీర్ణతతో అద్భుత ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మధుసూధన్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కరస్పాండెంట్ రాజగోపాల్‌రెడ్డి, డైరెక్టర్‌లు వీఆర్‌కే ప్రసాద్, ఎంవీ కృష్ణారెడ్డి, వెన్నా కృష్ణారెడ్డి, జీఎల్ రమేష్‌బాబు, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో నగదు అందజేత

మార్కాపురం వన్‌టౌన్, జూలై 11: స్థానిక ఇండోర్ స్టేడియంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు రవిచంద్రన్ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఆచారి కుటుంబానికి రూ.2వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో వాసవిక్లబ్ నాయకులు రామకృష్ణారావు, సముద్రాల రమేష్, ప్రభాకర్‌రావు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా పంటలను సాగు చేసుకోవాలి



పరీక్షా ఫలితాలను రైతులకు అందజేస్తున్న అధికారులు

మార్కాపురం రూరల్, జూలై 11: భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా రైతులు పంటలను సాగుచేసుకోవాలని భూసార పరీక్షాకేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు సుచరిత సూచించారు. మండలంలోని కొండేపల్లి గ్రామ రైతుసేవా కేంద్రంలో భూసార పరీక్షలపై, ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఆ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మట్టినమూనా సేకరించే విధానం ఫలితాలను బట్టి పంటలకు ఎరువుల వాడకం, సమస్యాత్మక భూముల యాజమాన్యం గురించి అవగాహన కల్పించారు. ప్రస్తుతం రైతులు విచక్షణారహితంగా పురుగు మందులు వినియోగించడం వలన నేల, గాలి, నీరు కాలుష్యం అవడంతో పాటు పంటల సాగుకు ఖర్చులు విపరీతంగా పెరిగిపోతున్నాయన్నారు. సేంద్రీయ ఎరువుల, జీవన ఎరువుల, శిలింద్ర నాశనాలు, వేపకషాయం, వేపనూనె లాంటి ప్రకృతి వనరులను ఉపయోగించాలని కోరారు. గ్రామంలోని ప్రభుత్వ ఏపీయూపీ పాఠశాల 6,7,8 తరగతుల విద్యార్థులకు మట్టి నమూనా సేకరించే విధానంపై పొలాలలో చూపించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారులు శైలజారాణి, శేషమ్మ, ఏవో దేవిరెడ్డి శ్రీనివాసులు, వీఏఏ హైమావతి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీకి 21మంది విద్యార్థులు ఎంపిక



ట్రిపుల్‌ఐటీకి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవోలు

పీసీపల్లి, జూలై 11: మండలం నుంచి 21మంది విద్యార్థులు ట్రిపుల్‌ఐటీకి ఎంపికయ్యారని మండల విద్యాశాఖ అధికారులు సంజీవి, ఆర్.శ్రీనివాసులు తెలిపారు. పీసీపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ఏడుగురు, గుంటుపల్లి నుంచి నలుగురు, పెదయిర్లపాడు నుంచి ముగ్గురు, పీసీపల్లి కేజీబీవీ నుంచి ముగ్గురు, నేరేడుపల్లి నుంచి ఇద్దరు, మురుగుమ్మి నుంచి ఒకరు, పెదఅలవలపాడు జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ఒకరు ఎంపికయ్యారు. వీరి ఎంపిక పట్ల ఎంఈవోలు, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ట్రిపుల్‌ఐటీకి ఎంపికైన విద్యార్థులను ఆయా పాఠశాలల ప్రాంగణంలో అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

ముండ్లమూరులో ఇద్దరు.. ముండ్లమూరు, జూలై 11: మండలంలోని వేముల జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన కమ్మవారిపాలెం గ్రామానికి చెందిన దామా పూర్ణిమ వెంకట నందినికి ట్రిపుల్ ఐటీలో ఒంగోలు కళాశాలలో సీటు సాధించింది. ఎంఈవో ఎం.సుబ్బారావు, కె.వెంకటేశ్వర్లు నందినిని అభినందించారు. ఈదర జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన కొండ్రముట్ల రాజేశ్వరి కూడా ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది.

కురిచేడులో ఐదుగురు.. కురిచేడు, జూలై 11: కురిచేడు మండలంలో ఐదుగురు విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ సీట్లు వచ్చినట్లు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. కురిచేడు వైఆర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు, బోదనంపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో ముగ్గురికి సీట్లు వచ్చాయి. కురిచేడులో యాగంటి మల్లిక, గంధం నరేంద్ర, బోదనంపాడులో ఐ.వెంకటసాయి ప్రసన్నకుమారి, వెంకట గణేష్, పాతర్ల అమూల్యలకు సీట్లు వచ్చినట్లు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సాయి, కడియం పాపారావు తెలిపారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

బాల్య వివాహాలు నిరోధించాలి

దొనకొండ, జూలై 11: బాల్య వివాహాలు వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించి, వాటిని నిరోధించేలా ప్రతిఒక్కరూ ముందుకు రావాలని స్థానిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ సునీత వివరించారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ సునీత మాట్లాడుతూ జనాభా పెరుగుదలతో కలిగే నష్టాలను వివరిస్తూ చిన్న కుటుంబం చింతలేని కుటుంబం అని పేర్కొన్నారు. బిడ్డకు బిడ్డకు కనీసం మూడు సంవత్సరాల వ్యవధి ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జగదీష్, సీహెచ్ వో ఇన్నాసమ్మ, సూపర్‌వైజర్ కె.ప్రభావతిదేవి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై విత్తనాలు



పామూరు: రైతులకు కంది విత్తనాలు పంపిణీ చేస్తున్న ప్రభాకర్ చౌదరి

దొనకొండ, జూలై 11: ఖరీఫ్ 2024 కాలానికి మొదటి విడతగా 130 క్వింటాళ్ల విత్తనాలు మంజూరైనట్లు మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. ఇందులో కందులు 50 క్వింటాళ్లు, వడ్లు బీపీటీ 5204 రకం 80 క్వింటాళ్ల మండలానికి వచ్చాయన్నారు. ఈఏడాది 30 శాతం సబ్సిడీ మీద కంది విత్తనాలు, కేజీ వరి విత్తనానికి రూ.5 చొప్పున సబ్సిడీపై సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఒక్కో రైతుకు ఐదు ఎకరాల వరకు ఇస్తారని తెలిపారు. కంది విత్తనాలు 4 కేజీల ప్యాకెట్ ధర రూ.560 కాగా, సబ్సిడీ రూ.168 పోను రైతు వాటాగా రూ.392 చెల్లించాలన్నారు. అలాగే, వరి విత్తనాలు 25 కేజీల ప్యాకెట్ ధర రూ.1045 కాగా, రూ.125 సబ్సిడీ పోను రూ.920 చెల్లించాలన్నారు. అవసరమైన రైతులు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, నకళ్లతో గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకొని రైతు వాటా చెల్లించాలన్నారు. రైతుల అవసరం మేరకు ఇంకా విత్తనాలు తెప్పిస్తామని చెప్పారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పామూరులో.. పామూరు, జూలై 11: మండలంలోని బొట్లగూడూరు రైతు సేవా కేంద్రంలో గురువారం టీడీపీ రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల ప్రధాన కార్యదర్శి అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి కంది విత్తనాలు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై అందించే కంది విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కోటపాటి వెంకటేశ్వర్లు, రాయవరపు శ్రీకాంత్, కోటపాటి రాజ, గూడూరు వెంకటాద్రి, హరికృష్ణ, పార్థు, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గ్రామోత్సవం

పామూరు, జూలై 11: మొహర్రం వేడుకల్లో భాగంగా మూడవ రోజు గురువారం సాయంత్రం పీర్లపెట్టలు దించి గ్రామోత్సవం జరిపారు. పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద గల పీర్ల చావిడికి సంబంధించి స్థానిక ఆకులవీధిలో ఉన్న శ్రీ హజరత్ మహబూబ్ సుభాని స్వామి వార్ల దర్గా వద్ద పీర్లపెట్టెలకు ముజావర్లు ప్రత్యేక (ఫాతేహాలు) ప్రార్థనలు నిర్వహించారు. పీర్ల పెట్టెలకు గ్రామోత్సవం చేసుకొంటూ స్థానిక పీర్ల చావిడి వరకు చేరుకొన్నారు. ఈ సందర్భంగా దర్వాజాగల్లీ, ఆకులవీధిలలో హిందూ ముస్లింలు పీర్ల పెట్టెల గ్రామోత్సవం సందర్భంగా బిందెలతో నీళ్లను వారుగా పోస్తూ మొక్కుబడులు చెల్లించుకొన్నారు. అనంతరం చావిడి వద్ద ప్రార్థనలు నిర్వహించి ప్రసాదాలను భక్తులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో హిందూ ముస్లిం భక్తులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

శరవేగంగా జాతీయ రహదారి నిర్మాణ పనులు

పామూరు, జూలై 11: సింగరాయకొండ- మైదుకూరు జాతీయ రహదారి నిర్మాణ పణులు శరవేగంగా సాగుతున్నాయి. పామూరు - సింగరాయకొండ జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్డు మధ్యలో ఉన్న కల్వర్టుల వద్ద డ్రైవర్షన్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దసరా నాటికి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేస్తామని జాతీయ రహదారుల అధికారులు తెలిపారు. అక్కినరసాపురం గ్రామం వద్ద మోపాడు రిజార్వాయర్ ప్రధాన కాలువపై బ్రిడ్జి పనులు చేపట్టే కార్యక్రమాల్లో భాగంగా తాత్కాలికంగా సిమెంట్ పైపులువేసి డైవర్షన్ పనులు చేపడుతున్నారు. అలాగే, పలుచోట్ల బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడుతున్నట్లు హైవే అధికారులు తెలిపారు.

నిజమైన కౌలుదారులను గుర్తించాలి

ముండ్లమూరు, జూలై 11 : మండలంలో సీసీఎల్ఆర్ కార్డులు ఇచ్చేందుకు నిజమైన కౌలు రైతులను గుర్తించాలని తహసీల్దార్ మధుబాబు అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌వోలు, వీఏఏలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో కౌలు రైతులు సాగుచేసిన పొలాలను గుర్తించి వారు ఏ పంట సాగు చేసింది తెలుసుకొని పంటలను నమోదు చేయాలన్నారు. అర్హత కలిగిన కౌలు రైతుకు కార్డులు ఇచ్చే విధంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రణాళికలు తయారుచేస్తామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఫరూక్, డీటీ జీ పుల్లారెడ్డి, ఏ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

నేడు బడికి పోతా కార్యక్రమంపై ర్యాలీ

ముండ్లమూరు, జూలై 11: ముండ్లమూరులోని హెచ్‌డబ్ల్యూ పాఠశాలలో గురువారం నేను బడికి పోతా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఈవో ఎన్. సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో బడి బయట విద్యార్థులు ఉండరాదని చెప్పారు. వంద శాతం పిల్లలందరూ బడిలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.శారద, పద్మావతి, ఉపాధ్యాయులు రాఘవ, లలిత, కోటేశ్వరరావు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పొదుపు రికార్డుల ఆడిట్

తాళ్లూరు, జూలై 11: వైకేపీ పొదుపు రికార్డులను ఆడిట్ అధికారి తిరుపతినేని ప్రసాద్ ఆధ్వర్యంలో ఉద్యోగులు గురువారం ఆడిట్ నిర్వహించారు. గత ఆర్థిక సంవత్సరంలో సీఎస్‌ఎఫ్ కింద రూ.66 లక్షలు, స్త్రీనిధి కింద రూ.10 కోట్ల రుణాలు పొదుపు గ్రూపు మహిళలకు అందజేశారు. గత ఏడాది విడుదలైన రుణాల లావాదేవీల నిర్వహణ, వీవోఏల రికార్డులను ఆడిట్ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం దేవరాజ్, సీసీ కోటేశ్వరమ్మ, వీవోఏలు పాల్గొన్నారు.

దర్శి అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలి

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



మంత్రి పయ్యావుల కేశవ్‌కు బొకే అందిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు

దర్శి, జూలై 11: దర్శి నియోజకవర్గ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను ఏపీ సచివాలయంలో గురువారం టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్‌లు కలిసి విజ్ఞప్తి చేశారు. ఎంతో అనుభవం ఉన్న కేశవ్‌కు ఆర్థికశాఖ కేటాయించినందుకు ముందుగా ఆయనకు వారు అభినందనలు తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ అస్తవ్యస్త పాలనలో దర్శి నియోజకవర్గం ఎలాంటి అభివృద్ధి లేక ఎంతో వెనుకబడిపోయిందన్నారు. సాగు, తాగునీటి ప్రాజెక్టులు అధ్వాన్నంగా మారాయన్నారు. రహదారులు ఛిద్రమయ్యాయన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో అభివృద్ధి పథంలో నడిపిస్తారనే ఆశతో ప్రజలు ఉన్నారని చెప్పారు. అందుకు అనుగుణంగా అధిక నిధుల విడుదల చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి పయ్యావుల కేశవ్ సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.

శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి

శాంతి భద్రతల పరిరక్షణకు దర్శి నియోజకవర్గంలో పటిష్ట చర్యలు తీసుకోవాలని గుంటూరు రేంజి ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠికి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు విజ్ఞప్తి చేశారు. గుంటూరులోని ఐజీ క్యాంపు కార్యాలయంలో ఆయన్ను కలిసి ఎన్నికల సందర్భంగా వైసీపీ చేసిన అక్రమాలను, దర్శి పోలీసులు వ్యవహరించిన అనుచిత వైఖరిని వివరించారు. కొంతమంది పోలీసులు వైసీపీ నాయకులకు ఊడిగం చేస్తూ కార్యకర్తల్లాగా వ్యవహరించారని ఫిర్యాదు చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేసినప్పటికీ పట్టించుకోలేదని తెలిపారు. తాము ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ డివిజనల్ పోలీస్ అధికారితో పాటు అందరూ నిర్లక్ష్యవైఖరి అవలంబించారని తెలిపారు. పక్షపాత వైఖరి అవలంబించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు వారు తెలిపారు.

వాహనచోదకులు హెల్మెట్‌లు ధరించాలి

» న్యాయాధికారి భరత్‌చంద్ర



హెల్మెట్ ధరించి బైక్ నడుపుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్న న్యాయాధికారి భరత్‌చంద్ర, ఎస్ఐ త్యాగరాజు

కనిగిరి, జూలై 11: హెల్మెట్ వాహన చోదకుల ప్రాణాల్ని కాపాడటమే కాకుండా వారి కుటుంబాల్ని కూడా కాపాడుతుందన్న విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తించాలని కనిగిరి జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి కె.భరత్‌చంద్ర అన్నారు. హెల్మెట్ లేకపోవటం వల్ల కలిగే అనర్థాలను, ధరిస్తే కలిగే ప్రయోజనాలపై గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పిస్తున్నా చాలామంది విద్యా వంతులు కూడా వాటిని ధరించకపోవటం బాధాకరమన్నారు. ఈవిషయంలో కఠినంగా వ్యవహరించేందుకు ప్రభుత్వం సిద్ధమైందన్నారు. ప్రతిఒక్కరూ తమ కుటుంబ సంక్షేమం కోసం హెల్మెట్ ధరించాలని విజ్ఞప్తి చేశారు.

పట్టణంలో బైక్‌లపై పోలీసులతో కలసి న్యాయాధికార్లి భరత్‌చంద్ర హెల్మెట్ ధరించి ర్యాలీలో పాల్గొని ప్రజలకు అవగాహన కల్గించారు. కార్యక్రమంలో ఎస్ఐ త్యాగ రాజు, పోలీసులు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి



పూరిమెట్లలో నీటి కుంటలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

ముండ్లమూరు, జూలై 11: ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా ఇంకుడు గుంతలు, పండ్ల తోటల సాగుపై రైతులకు అవగాహన కల్పించి వారి అభివృద్ధికి పాటుపడాలని కేంద్ర బృందం జలశక్తి అభియాన్ డైరెక్టర్ మినిస్ట్రీ ఆఫ్ స్టీల్ నోడల్ అధికారి శ్రీదేవి అన్నారు. కేంద్ర బృందం గురువారం మండలంలోని పూరిమెట్ల గ్రామంలో ఇంకుడు గుంతలను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి రైతు తన పొలంలో, ఖాళీ ప్రదేశాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవటం వల్ల ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రధానంగా రైతులు ఉద్యాన పంటల్లో భాగంగా పండ్ల తోటలు సాగు చేసుకోవాలన్నారు. వాటిపై వచ్చే లాభంతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. అనంతరం కొబ్బరి చెట్లను నాటారు. కార్యక్రమంలో భూగర్భ జల శాస్త్రవేత్త సంతోష్ గౌతమ్, డ్వామా పీడీ అర్జునరావు, ఏపీడీ నిర్మల, ఎండీవో ఆర్.జనార్దన్, ఏపీవో మధుసూదనరావు, కె.నాగరాజు, ఈసీ శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో ప్రతిభచాటిన ఎంఎన్‌ఎం విద్యార్థులు



ధనలక్ష్మి | ఎస్‌కే రజీఫ్ | మౌనిక

కనిగిరి, జూలై 11: నాగార్జున యూనివర్శిటీ పరిధిలో ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన డిగ్రీ నాల్గవ సెమిస్టర్ ఫలితాల్లో ఎంఎన్‌ఎం విద్యార్థులు హవా చాటారు. గురువారం విడుదలైన డిగ్రీ సెకండ్ ఇయర్ (నాల్గవ సెమిస్టర్)లో ఎంఎన్‌ఎం విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. బీఎస్సీ / బీజడ్‌సీలో కామిరెడ్డి ధనలక్ష్మి 986 మార్కులు, ఎస్.కే రజీఫ్ 984 మార్కులు సాధించారు. బీఎస్సీ/అగ్రికల్చర్‌లో కొమెర్ల మౌనిక 960 మార్కులు, కనపర్తి మహేశ్వరి 934 మార్కులు పొందారు. బీఎస్సీ / ఎంపీసీఎస్ కోర్సులో ముక్కు మనీషా 803 మార్కులు, బీకాం కంప్యూటర్‌లో దాసరి యామిని 698 మార్కులు సాధించారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఎంఎన్‌ఎం కళాశాల కరస్పాండెంట్ ఏలూరి సుబ్బారావు, అధ్యాపక బృందం అభినందించారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన గౌతమి విద్యార్థులు

దొనకొండ, జూలై 11: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డిగ్రీ నాలుగో సెమిస్టర్ ఫలితాల్లో దొనకొండ గౌతమి డిగ్రీ కలేజీ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు కళాశాల అడ్మిన్ ఎఫ్రాయిమ్(నాని) తెలిపారు. బీకాం కంప్యూటర్స్ విభాగంలో వంది సుబ్బయ్య 644 మార్కులు, నున్నా రామసీతమ్మ 647 మార్కులు, పలుకూరి ప్రశాంత్ 599 మార్కులు సాధించారు. బీఏ విభాగంలో షేక్ నాజ్ 610 మార్కులు, సానియామీర్జా 570 మార్కులు, నీరూడి సువర్ణ 544 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను గౌతమి కళాశాలల చైర్మన్ కె.గుండారెడ్డి, డైరెక్టర్ నాగేంద్రబాబు, ప్రిన్సిపాల్ గోపి, అధ్యాపకులు అభినందించారు.

యాజమాన్య పద్ధతులతో ఎండుతెగులు నివారణ



ఎండిన బత్తాయి చెట్లను పరిశీలిస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త

వీసీపల్లి, జూలై 11: ఉద్యాన పంటలైన బత్తాయి, నిమ్మలో యాజమాన్య పద్ధతులు చేపట్టడం ద్వారా ఎండుతెగులు నివారించవచ్చునని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎం.శివ అన్నారు. మండలంలోని చింతగుంపల్లి గ్రామంలో ఉన్న బత్తాయి తోటలను మండల ఉద్యాన అధికారి కె.కుసుమతో కలిసి గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఎండిపోయిన బత్తాయి చెట్లను పరిశీలించిన రైతులతో మాట్లాడారు. ఎండుతెగులు ప్రభావం వల్ల ఒక్కో తోటలో 20 నుంచి 25 చెట్లు ఎండిపోయి రైతులకు నష్టాన్ని కలిగిస్తున్నాయన్నారు. ఈ తెగులు సాధారణంగా నాటిన మొదటి సంవత్సరం నుంచి ఎక్కువ వయస్సు కలిగిన తోటల వరకు ప్రభావితం అవుతాయని చెప్పారు. ఈ తెగులు ఆశించిన చెట్లు కుళ్లిపోయి కణజాలం దెబ్బతింటుందని అన్నారు. అలాగే, వేరు వ్యవస్థ కుళ్లిపోవడంతో కాండంపై శీఘ్రం ఆశించి చెట్లు ఎండిపోతాయన్నారు. ఈ తెగులు నివారణకు ప్రతి సంవత్సరం వర్షాకాలం మొదటిదశలో పది కిలోల పశువుల ఎరువులో ట్రైకోడెర్మా, సుడోమోనాజ్ కలిపి చెట్ల మొదళ్లలో వేయాలన్నారు. అనంతరం మొక్క మొదళ్ల వద్ద నీళ్ల తేమ లేకుండా చూసుకోవాలన్నారు. వేపపిండి ఐదు కేజీలు, గుళికలు ప్రతి సంవత్సరం వేసుకోవాలన్నారు. రసాయన పద్ధతుల ద్వారా అయితే టెబుకోనజోల్ 1.5ఎంఎల్, ప్లాంటోమైసిన్ కలిపిన మిశ్రమాన్ని 10లీటర్ల నీటిలో కలిపి చెట్టు మొదలు తడిసేవిధంగా పోయాలని చెప్పారు. ఈవిధంగా యాజమాన్య పద్ధతులు చేపట్టడం ద్వారా బత్తాయి, నిమ్మ చెట్లకు ఎండుతెగులు సోకకుండా అరికట్టవచ్చునని వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు షేక్ నాయబ్‌రసూల్, చింతగుంపల్లి రైతులు పాల్గొన్నారు.

దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్‌కు చర్యలు

» గుంటూరు డివిజనల్ మేనేజర్ రామకృష్ణ



గుంటూరు రైల్వే డీఆర్‌ఎంను సన్మానిస్తున్న దొనకొండ వాసులు

దొనకొండ, జూలై: దొనకొండ రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్ విషయమై మరోసారి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ ఎం.రామకృష్ణ స్పష్టం చేశారు. రైల్వేస్టేషన్ల తనిఖీల్లో భాగంగా గురువారం దొనకొండ రైల్వేస్టేషన్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా విశ్వభారతి విద్యాలయం చైర్మన్ మల్లెల రామిరెడ్డి, వ్యాపార వేత్తలు ఎం.రమేష్, శంకర్, షేక్ కరిముల్లా, మరికొందరు డీఆర్‌ఎంను కలిసి శాలువతో సన్మానించారు. దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని మూడేళ్లుగా ప్రజలు పడుతున్న ఇబ్బందులను విన్నవిస్తున్నా పట్టించుకోవటం లేదని వివరించారు. కనీసం హుబ్లీ అమరావతి, కొండవీడు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని విన్నవిస్తూ వినతిపత్రం సమర్పించగా, డీఆర్‌ఎం ఆ రెండు రైళ్ల వివరాలను ప్రత్యేకంగా నమోదు చేసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రైల్వే ఎటువంటి పనిచేపట్టినా ప్రయాణికుల సౌకర్యమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. దొనకొండ రైల్వే స్టేషన్‌లో అమృత్‌భారత్ పథకంలో పొందుపర్చిన అభివృద్ధి పనులన్నీ పూర్తవుతాయన్నారు. అనంతరం రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. రైల్వే కార్యాలయాలను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డివిజనల్ పరిధిలోని పలువురు రైల్వే ఉన్నతాధిరులు పాల్గొన్నారు.

నీటి వనరులను పెంపొందించుకోవాలి



తూర్పువీరాయపాలెంలో నీటి వనరులను పరిశీలిస్తున్న కేంద్ర జలశక్తి అభియాన్ డైరెక్టర్ దేవదత్తా శతపతి, శాస్త్రవేత్త సంతోష్‌గౌతమ్ తదితరులు

దర్శి, జూలై 11 : నీటి వనరులను పెంపొందించుకునేందుకు ప్రజలు అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కేంద్ర జలశక్తి అభియాన్ డైరెక్టర్ దేవదత్తా శతపలి సూచించారు. మండలంలోని తూర్పువీరాయపాలెంలో గురువారం శాస్త్రవేత్త సంతోష్ గౌతమ్‌తో కలిసి నీటి వనరులను పరిశీలించారు. వాటర్ క్వాలిటీని పేరామీటరు ద్వారా పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. మంచినీటి ప్రాజెక్టుల ద్వారా శుద్ధ జలాలను అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ అర్జునరావు, ఎంపీడీవో హనుమంతరావు, ఏపీవో కళ్యాణి, ఏఈ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర



పీఏ ప్రసాద్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, జూలై 11: ఆప్తుల ఆరోగ్య పరిస్థితిపై ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి గురువారం వారి నివాసాలకు వెళ్లి పరామర్శించారు. ఎమ్మెల్యేకు ఎంతో ఆప్తులైన చీమలమర్రి ప్రసాద్ (పీఏ ప్రసాద్) ఇటీవల గుండె సంబంధ ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఉగ్ర పాతూరులోని వారి నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై పరామర్శించారు. ఎలాంటి అవసరమున్నా అండగా ఉంటానని ఆయనకు భరోసా ఇచ్చారు. అలాగే, ఎన్టీయార్ వీరాభిమాని, టీడీపీ సీనియర్ కార్యకర్త పాతూరుకు చెందిన మీరాబిని పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఆటోలు తనిఖీ.. రూ.40 వేలు జరిమానా

దర్శి, జూలై 11: దర్శి ప్రాంతంలో తిరుగుతున్న ఆటోలను రవాణాశాఖ అధికారి రవికుమార్, ఆర్టీసీ పొదిలి డీఎం సుందరకుమార్ సంయుక్తంగా గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న 25 ఆటోలను గుర్తించి రూ.40వేలు జరిమానా విధించారు. ఆర్టీసీ బస్సులకు తీవ్రకొరత శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందించారు. ఆటోల్లో వేలాడుతూ ప్రయాణిస్తున్న విద్యార్థుల ఫొటోలను గుర్తించిన అధికారులు అనేకచోట్ల తనిఖీలు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనల మేరకు నడుచుకోవాలని సూచించారు.

నేడు మండల సమావేశం

సీఎస్‌పురం(పామూరు), జూలై 11: సీఎస్‌పురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం ఎంపీపీ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరుగుతుందని ఇన్‌చార్జ్ ఎంపీడీవో రామచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

VEHICLE FOR SALE

VEHICLE NO	VEHICLE DESCRIPTION	YEAR
AP39TE-4652	TATA LPT 1412 FBT	2018
AP27TX-5299	AL 3718 IL FBT	2015
AP27TX-9812	AL DOST	2016
AP39W-0728	MAHINDRA BOLERO MAXI TRUCK PLUS	2019
AP39HA-4175	SWIFT DZIRE LDI DIESEL 5 SEATER	2017
AP26BR-2622	JCB INDIA LTD	2016

AUCTION DATE : 12-07-2024
SHRIRAM AUTO MALL INDIA LIMITED
Doddavarappadu(V&PO), Maddipadu(M), ONGOLE, Prakasam(DT), 99498 29182, 95737 11099

గుంటూరు	నాజ్ థియేటర్	పిడుగురాళ్ళ	గంగామహల్
గుంటూరు	హరిహరమహల్	పొన్నూరు	శ్రీలక్ష్మీ
గుంటూరు	గౌరీ శంకర్	మంగళగిరి	ఊర్వశి
గుంటూరు	శివ థియేటర్	మంగళగిరి	వెంకటేశ్వర
గుంటూరు	సినీ స్క్వేర్	రేపల్లె	రాజ్యలక్ష్మి
గుంటూరు	సినీ ప్రైమ్	మాచర్ల	వెంకటేశ్వర
గుంటూరు	వి.ప్లాటినో	సత్తెనపల్లి	సాయికృష్ణ
గుంటూరు	ఫోనిక్స్ మాల్ (మైత్రీ)	వినుకొండ	కీర్తి డీలక్స్
గుంటూరు	ది సినిమాస్	అద్దంకి	వి.ఎన్.ఎస్
గుంటూరు	జెఎల్ఇ సినిమాస్	టంగుటూరు	అప్సర
ఒంగోలు	గోరంట్ల సినిమాస్	చీమకుర్తి	కె3కె సినిమాస్
ఒంగోలు	రవి ప్రియమాల్		
ఒంగోలు	సత్యం థియేటర్		
తెనాలి	సంగమేశ్వర		
తెనాలి	పెమ్మసాని		
నరసరావుపేట	లక్ష్మి నరసింహ		
నరసరావుపేట	ఈశ్వరమహల్		
చిలకలూరిపేట	సాయి కార్తీక		
చీరాల	సురేష్‌మహల్		
బాపట్ల	శ్రీనివాసమహల్		



ఆంధ్రజ్యోతి ప్రతిరోజు క్లాసిఫైడ్స్ — ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం

ట్రైనింగ్ సెంటర్

రాధిక M.P.H.W ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్, సుందరయ్య భవన్ రోడ్, శ్రీనివాస హాస్పిటల్ ఎదురు, ఒంగోలు. కోర్సులు : M.P.H.W(F), ANM / DMLT Q: ఇంటర్ ఏ గ్రూప్ వారైన, ప్రభుత్వ స్కారలషిప్ కలదు. సంప్ర॥ 08592 282349, 8978869519, 7674998230
AJO-190174

WANTED HINDI TEACHER

Hindi Subject Teacher Wanted from 6th to 10th Classes Hindi Subject Teaching. Free Boarding and Lodging. Contact immediately, Sri Raghavendra High School, Kurichedu, Cell: 9490327336
AJO-190347

WANTED

ఒంగోలు సమతానగర్‌లోని శ్రీగాయత్రి గ్రామర్ స్కూల్ నందు పనిచేయుటకు Clerak Cum Computer Operator, Lady Computer Teacher కావలెను. సంప్రదించండి సెల్ : 9014404155
AJO-274

కావలెను

మీ ఇంటి వద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి, న్యూ రికార్డులు వ్రాయుటకు స్త్రీ, పురుష అభ్యరులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12,000. సంప్ర॥ 9550745296.
AJV-192984

PROPERTY FOR SALE

BHK flat in BSK Guptas Lake Side Apartment, 1st floor (No.102, SOUTH facing) in Lawyerpet, Montessori School Road for Sale. Genuine buyers please Contact : 9866595746
AJH-14295

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లైయిమ్స్‌కు,చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, ఉద్యోగ, వ్యాపార, బహిరంగ ప్రకటనలు, అంత్యక్రియలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి మరియు అన్నిరకాల ప్రకటనలు కొరకు సంప్ర॥

ఒంగోలు : 99854 11071, 97036 18694, 95053 05888
చీమకుర్తి : 96525 55752
చీరాల : 99859 21376
మార్కాపురం : 99859 21358
కందుకూరు : 97036 18697
కనిగిరి : 99854 11483
గిద్దలూరు : 99859 21358

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావలసినవారు మరియు పేపరు పంపిణీ విషయంలో ఎటువంటి సమస్యలు ఉన్నా సంప్ర॥
Asst-Cir-Manager. 9985411484

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
శుక్రవారం 12 జూలై 2024





విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి విలియమ్స్

సదరంలో.. సర్టిఫికేట్లు



శారీరక లోపం.. మనిషికి శాపం. వైక్యలం ఉండే వారి జీవనం కనాకష్టం. వారు పని చేసుకోవాలనుకున్నా శరీరం సహకరించదు. అలాంటి వారికి సాయంగా ప్రభుత్వం పింఛన్ ఇస్తుంది. అయితే ఈ పింఛన్లకు కక్కుర్తి పడిన కొందరు సదరం సర్టిఫికెట్లు పొందుతున్నారు. వైకల్యం లేకపోయినా ఏదో ఒక లోపం ఉన్నట్లుగా సదరం నుంచి ధ్రువీకరణ చేయించుకుని దివ్యాంగ పింఛన్లు పొందుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇలాంటివి పెద్దఎత్తున చోటుచేసుకున్నట్లు తాజాగా వెలుగుచూస్తున్నాయి. ఎటువంటి వైకల్యం లేకపోయినా వైసీపీకి చెందిన వారు పెద్దసంఖ్యలో పింఛన్లు పొందినట్లు వెలుగుచూస్తోంది. సదరం సర్టిఫికెట్లు జారీలో వైసీపీ నేతల ఆధ్వర్యంలో పెద్ద మాఫియా నడిచినట్లు అర్థమవుతోంది. ఇదే అవకాశంగా సదరం సర్టిఫికెట్లును నగదుకు కూడా కొందరు అమ్ముకున్నట్లు తెలుస్తోంది. దీంతో అసలైన లబ్ధిదారులు దివ్యాంగ పింఛన్ల కోసం ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తాజాగా కూటమి ప్రభుత్వంలో ఇటీవల పింఛన్ల పంపిణీ సమయంలో దివ్యాంగ పింఛన్లు అందుకుంటున్న వారిని చూసి ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు ఆశ్చర్యపోయారంటే సదరం ఏ స్థాయిలో దుర్వినియోగం చేశారో తెలుసుకోవచ్చు. ఈ పరిస్థితుల్లో నకిలీ సదరం సర్టిఫికేటుగాళ్ల పని పట్టాలని పలువురు కోరుతున్నారు.

- వైకల్యం లేకపోయినా సర్టిఫికెట్
- దర్జాగా పింఛను అందుకుంటున్న అనర్హులు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో భారీగా ధ్రువీకరణలు
- కూటమి ప్రభుత్వం రాకతో వెలుగులోకి నకిలీ లబ్ధిదారులు



గుంటూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఇదీ ఉమ్మడి గుంటూరు జిల్లాలో దివ్యాంగ పింఛన్ల పరిస్థితి. అనర్హులు ఏళ్ల తరబడి దర్జాగా పింఛన్లు కాజేస్తుంటే, అర్హులు పింఛన్లు దొరక్క నానా అగచాట్లు పడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. దివ్యాంగ పింఛన్లు తీసుకుంటున్న వారు వేలల్లో ఉంటే బాధితులు ఎందరో తమకు పింఛన్లు అందడంలేదని తిరగడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఐదేళ్లుగా అటు పాలకులు, ఇటు అధికారులు వారిని కరుణించలేదు. ఎలాంటి వైకల్యం లేకపోయినా సదరం సర్టిఫికెట్లు తీసుకుని వేలాది మంది దివ్యాంగుల పింఛన్లు కైంకర్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఏ పనీ చేసుకోలేని దీన స్థితిలో ఉండే దివ్యాంగులు మాత్రం తమకు పింఛను అందజేసి పుణ్యం కట్టుకోవాలంటూ కనిపించిన ప్రతీ అధికారికీ మొక్కుకుంటున్నారు.

వైసీపీ నేతలకే సదరం

వైసీపీ ప్రభుత్వ హయాంలో సదరం సర్టిఫికెట్లు అనేకం దుర్వినియోగం అయ్యాయి. వైకల్యం కారణంగా పనిచేసుకోలేనివారికి ప్రభుత్వం తరఫున చేయూతను అందించడానికి ప్రభుత్వం దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లు జారీ చేస్తుంటుంది. ప్రభుత్వ వైద్యులు పరీక్షించి దివ్యాంగులకు సర్టిఫికెట్లు జారీ చేస్తుంటారు. సాధారణంగా 40 శాతానికి మించి వైకల్యం ఉంటేనే ప్రభుత్వ పథకాలకు అర్హులవుతుంటారు. కాగా ఈ ప్రక్రియను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా దుర్వినియోగం చేసినట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ శాఖలన్నీ అప్పటి అధికారపార్టీ సేవకే పరిమితమయ్యాయి. అందులో భాగంగా సదరం సర్టిఫికెట్లలో ఎక్కువభాగం వారికే దక్కాయి. వైసీపీ ఎమ్మెల్యేలు, నాయకులకు కుడి భుజాలుగా ఉన్న గ్రామ స్థాయి నాయకులు, వారి కుటుంబసభ్యులు సదరం సర్టిఫికెట్లతో లబ్ధి పొందారు. చాలా చోట్ల వైసీపీ సర్పంచులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ, వార్డు కౌన్సిలర్లు, మెంబర్లు, వారి బంధువులు, మిత్రులు, వారి అనుచరులు భారీ సంఖ్యలో సదరం సర్టిఫికెట్లు కాజేసినట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్లో స్లాట్లు బుక్ చేసుకోవడం, సదరం సర్టిఫికెట్ మాఫియాకి రూ.10 వేలు ఇస్తే వారి పని పూర్తవుతుంది. ఆ తరువాత తతంగమంతా ఆ మాఫియా చూసుకుంటుంది. పరీక్షించే వైద్యులను, ఇతర సిబ్బందిని వారే మెయింటెయిన్ చేసి సదరు వైసీపీ అనుయాయులకు సర్టిఫికెట్లు అందిస్తారు. ఆ వెంటనే తమ పార్టీ పెద్దల సిఫారసుతో వారంతా దరఖాస్తు చేసుకుని పింఛన్లు పొందుతున్నారు.



19 వేలు నకిలీ పింఛనుదారులు?

తాజాగా వెలుగు చూస్తున్న అంశాలను బట్టి ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు బాపట్ల జిల్లాలో భాగమైన చీరాలతో కలిపి మూడు జిల్లాల్లో దాదాపు 19వేల వరకూ నకిలీ దివ్యాంగ పింఛన్లు ఉండవచ్చని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. తాజా పింఛన్ల పంపిణీ సందర్భంగా ఒక్కో ఊరిలో 10 నుంచి 15 దివ్యాంగ పింఛన్లు ఉంటే వాటిలో సగం అనర్హులవేనని సచివాలయ సిబ్బంది గుర్తించారు. విభజిత గుంటూరు జిల్లాలో 25,488 దివ్యాంగ పింఛనుదారులున్నారు. వారికి ఈ నెల 15.29 కోట్లు ప్రభుత్వం అందజేసింది. కానీ 6 వేల మంది పింఛనుదారులు అనర్హులని అధికారులు అంచనా వేస్తున్నారు. పల్నాడు జిల్లాలో 35,895 మంది దివ్యాంగ పింఛనుదారులు ఉండగా వారికి ఈ నెల 21.537 కోట్లు ప్రభుత్వం పింఛను కింద ఇచ్చింది. వీరిలో మరో 8వేల మంది వరకూ అనర్హులు ఉండవచ్చని ప్రాథమిక అంచనా. కాగా బాపట్ల జిల్లాలో 20 వేల మంది పింఛనుదారులు ఉన్నారు. వారిలో 5 వేల మంది వరకూ అనర్హులు ఉన్నట్లు తెలుస్తోంది. వీటిని పరిశీలించి, అనర్హులను తొలగించి, అర్హులకు పింఛన్లు జారీ చేయాలి.

- ప్రతి రోజూ ఎమ్మెల్యేల వద్దకు పదుల సంఖ్యలో పింఛను దరఖాస్తులు వస్తున్నాయి. వాటిలో మూడో వంతు దివ్యాంగుల పింఛన్లకు సంబంధించినవే. తీవ్ర వైకల్యంతో బాధ పడుతున్నవారే అత్యధికంగా ఉన్నారు. కానీ ఈరోజు వరకూ వారికి సదరం సర్టిఫికెట్లు దొరకలేదు. పింఛను వరం వరించలేదు.

- పిడుగురాళ్ల మండలం వైరాపురానికి చెందిన ఓ వ్యక్తి ఆర్థోపెడిక్ వైకల్యం 84 శాతం ఉన్నట్లు సర్టిఫికెట్ తీసుకుని మూడేళ్లుగా దివ్యాంగ పింఛను తీసుకుంటున్నాడు. అయితే అతడికి ఎటువంటి వైకల్యం లేదు. అతడు వైసీపీ నేత కావడంతో సదరం సర్టిఫికెట్ తీసుకుని ప్రభుత్వం నుంచి పింఛను అందుకుంటున్నాడు. చెన్నాయపాలెంలో మరో ఇద్దరు ఇలాగే దివ్యాంగుల పేరిట పింఛను కాజేస్తున్నారు.

- గుంటూరు జిల్లాలో ఓ ఎమ్మెల్యే దివ్యాంగ మహిళకు రూ.6వేలు పింఛను అందజేశారు. అయితే ఆమెను చూసిన ఎమ్మెల్యే, ఇతర నాయకులు, జిల్లా అధికారులు ఆశ్చర్యపోయారు. ఆమెకు ఎలాంటి వైకల్యం లేదు. కన్ను, కాలు అన్నీ బాగానే ఉన్నాయి. ఆర్థికంగా అత్యంత స్థితిమంతురాలు. అయినా ఆమె గత కొన్నేళ్లుగా దివ్యాంగుల కోటా పింఛను తీసుకుంటోంది. ఈ పరిణామం చూసి విస్తుపోవడం ఎమ్మెల్యే వంతైంది.



తక్కువ ధరకే.. బియ్యం, కందిపప్పు

- కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్ వెంకటమురళి
- జిల్లాలో ఆరు చోట్ల ప్రత్యేక కేంద్రాల్లో విక్రయాలు

బాపట్ల, జూలై 11: ప్రజలకు అందుబాటులో నిత్యావసర వస్తువులు ఉంచేందుకు ఏర్పాటు చేసిన కేంద్రాల్లో తక్కువ ధరకే బియ్యం, కందిపప్పు విక్రయాలు చేపట్టినట్లు కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. బాపట్ల తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయంలో పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆరు చోట్ల ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి ఫైన్‌రకం స్టీమ్ బియ్యం కిలో రూ.49, ముడి బియ్యం కిలో రూ.48, దేశవాళి కందిప్పుకు కిలో రూ.160 చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రైస్, దాల్ మిల్లర్స్ అసోసియేషన్లు లాభాల్లో కొంత తగ్గించుకుని తక్కువ ధరకు బియ్యం, కందిపప్పు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఎవరైనా సరే ఆధార్‌కార్డు చూపించి బియ్యం, కందిపప్పు కొనుగోలు చేయవచ్చన్నారు. తక్కువ ధరకే బియ్యం ఇస్తున్నామని చెప్పి రైతుల వద్ద ధాన్యం ధరలు తగ్గించి కొనుగోలు చేయరాదన్నారు. జిల్లాలో ఎక్కడైనా అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత సృష్టిస్తే ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు.

ప్రజా ప్రయోజనాలే ప్రభుత్వ లక్ష్యం

ప్రజా ప్రయోజనాలే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. ముఖ్యమంత్రి నిర్ణయాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్ తక్షణమే అమల్లోకి తెచ్చారన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటలు వరకు ప్రత్యేక కౌంటర్ అందుబాటులో ఉంటుందని చెప్పారు. అధిక ధరలను నియంత్రించటానికే ప్రభుత్వం బృహత్తరమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి విలియమ్స్, ఆర్డీవో గంధం రవీందర్, డీటీలు ఓంకార్, శ్రీదేవి, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బీవీ.రత్నగుప్తా, బాపట్ల అధ్యక్షుడు కోళ్ళపూడి శివరామప్రసాద్, నాయకులు నల్లమల్లి శ్రీనివాసరావు, తటవర్తి శిరీష, మలిశెట్టి పుల్లయ్య, పవన్‌కుమార్, దేవకి సుబ్రహ్మణ్యం, పీవీ.రంగారావు, సుధాకర్, టీడీపీ నాయకులు అల్లం గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు బియ్యం, కందిపప్పు అందజేస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి విలియమ్స్

ఇసుక.. చౌకగా

- నిర్మాణదారుడికి భారీ ఊరట
- నామమాత్రంగా సీనరేజి, రవాణా చార్జీలు
- నాడు లారీ ఇసుక రూ.50 వేలు.. నేడు రూ.10 వేలు
- గతంలో నిలిపిన భవన నిర్మాణాలకు తాజాగా శ్రీకారం

● ఓ సామాన్యుడు ఇల్లు కట్టుకోవాలనుకున్నాడు. అందుకోసం దాదాపు 5 లారీల ఇసుక అవసరం అవుతుందని తెలిసింది. ఒక్కో లారీకి రూ.40 వేల నుంచి రూ.50 వేలు చెల్లించాల్సి ఉందని, ఆ ప్రకారం కేవలం ఇసుక కోసమే రూ.2.50 లక్షలు ఖర్చు చేయాల్సి వస్తుందని అంచనా వేసుకున్నాడు. డబ్బంతా ఇసుకకే ఖర్చవుతుందని, ఇటుక, ఇనుము, కలప, కూలీలకు డబ్బు లేకుండా పోతుందని భావించాడు. దీంతో అతడి సొంతింటి కల అర్థాంతరంగా ఆగిపోయింది.
- ఇది నాటి వైసీపీ పాలనలో పరిస్థితి

● అదే సామాన్యుడు ఇప్పుడు తన ఇంటి నిర్మాణానికి కావాల్సిన 5 లారీల ఇసుకకు రూ.50 వేలు మాత్రమే ఖర్చు చేయనున్నాడు. గతంలో ఒక లారీకి పెట్టే ఖర్చుతో ఇప్పుడు ఐదు లారీల ఇసుక వస్తుందని అతడు అంచనా వేసుకున్నాడు. ఒక్క ఇసుకలోనే రూ.2 లక్షల ఖర్చు తగ్గనున్నదని ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.
- ఇది ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పరిస్థితి

గుంటూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనకు.. ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనకు ఇసుక విషయంలో మార్పు రావడంతో సామాన్యుడి సొంతింటి కల ఇంకెంతో దూరంలో లేదని స్పష్టమవుతుంది. వైసీపీ హయాంలో రూ.50 వేలు ఇచ్చినా దొరకని ఇసుక ఈ రోజు పదివేలకే వస్తుంది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక అంతకముందు టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత విధానాన్ని రద్దు చేసింది. కొత్త పాలసీ తీసుకు వస్తామని నాటి సీఎం జగన్ దాదాపు 8 నెలలు ఇసుక అందకుండా చేశారు. ఆ తర్వాత ఇసుక పాలసీ తెచ్చినా సామాన్యులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పైగా వారిని ఇసుక పేరుతో వైసీపీ నాయకులు నిలువు దోపిడీ చేశారు. లారీ ఇసుక రూ.25 నుంచి 40వేల వరకూ వెళ్లింది. బ్లాక్ మార్కెట్, ఇసుక మాఫియా పుణ్యమా అని రూ.50 వేలు కూడా చెల్లించాల్సిన పరిస్థితి వచ్చింది. ట్రాక్టరు ఇసుక కనీసంగా రూ.5 వేలు, గరిష్ఠంగా 10 వేల వరకూ వెళ్లింది. దీంతో నిర్మాణరంగం కుదేలైంది. కూలీలు పనులు లేక అల్లాడిపోయారు. అయితే ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయంతో లారీ ఇసుక రవాణా చార్జీలతో కలిపి రూ.9 నుంచి 10 వేలకే తన గుమ్మంలోకి వస్తోందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ట్రాక్టరు ఇసుక రూ.2 వేలకే వస్తోందని వినియోగదారులు చెబుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టన్ను ఇసుకకు రూ.2000 నుంచి 2500 వరకూ ఖర్చు చేయాల్సిరాగా, ఇప్పుడు అది కేవలం రూ.265కే వస్తోంది. టన్ను ఇసుకకు సీనరేజి కింద రూ.88 చెల్లించాలి. ఇసుక తవ్వినందుకు కాంట్రాక్టు సంస్థలకు టన్నుకు రూ.30 చెల్లించాలి. నిర్వహణ వ్యయం కింద రూ.20 చెల్లించాలి. రీచ్ నుంచి స్టాక్ పాయింట్లకు ఇసుక తరలింపునకు కిలో మీటరుకు రూ.4.90 రవాణా చార్జీగా నిర్ణయించారు. అదే ఇసుకను వినియోగదారుడు రీచ్ నుంచి తెచ్చుకుంటే రూ.4.90 చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఆ మొత్తానికి వినియోగదారు 18 శాతం జీఎస్టీ చెల్లించాలి.

పనులకు శ్రీకారం.. కూలీలకు ఉపాధి

వైసీపీ హయాంలో ఇసుక కారణంగా నిర్మాణదారుల కష్టాలు, ఉపాధి కోల్పోయి కూలీలు పడిన ఆర్థిక బాధలను పరిష్కరించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో చంద్రబాబు ఉచిత ఇసుక పాలసీని అమలు చేశారు. తొలి రెండు మూడు రోజుల్లోనే లక్షలాది మెట్రిక్ టన్నుల ఇసుక జన సామాన్యానికి అందుబాటులోకి వచ్చింది. సామాన్యులు ఇప్పటి వరకు ఆపేసుకున్న నిర్మాణాలకు తిరిగి శ్రీకారం చుట్టారు. కూలీలు, మేస్త్రీలు పనుల్లో బిజీగా మారారు. గత ప్రభుత్వ హయాంలో టన్ను ఇసుక రూ.2 వేల నుంచి రెండున్నర వేలు ఉండగా అది ఇప్పుడు 265 రూపాయలకే సామాన్యుల గడప వద్దకు వచ్చి పడుతోంది.

ఓర్వలేక విష ప్రచారం..

ప్రస్తుత ఇసుక పాలసీకి వస్తున్న అనూహ్య స్పందనను చూసి ఓర్వలేని వైసీపీ విష ప్రచారానికి తెరతీసింది. తప్పుడు కథనాలు, వ్యాఖ్యానాలతో సామాజిక మాధ్యమాల ద్వారా విషం చిమ్ముతోంది. స్థానిక సంస్థలకు చెల్లించే సీనరేజిని, ఇసుక రవాణా నిమిత్తం అయ్యే ఖర్చులను ఆసరా చేసుకుని దారుణమైన తప్పుడు ప్రచారానికి వైసీపీ తెగబడుతోంది. వైసీపీ విష ప్రచారాన్ని ప్రజలు నమ్మే పరిస్థితి కనిపించడంలేదు. వైసీపీ హయాంలో రూ.50 వేలకు లారీ ఇసుక కొన్నవాళ్లు, భారం మోయలేక పనులు ఆపేసుకున్నవాళ్లు అధికంగా ఉండడంతో వైసీపీ దుష్ప్రచారాన్ని వారే తిప్పికొడుతున్నారు.



ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తా

- బాధ్యతలు స్వీకరించిన జేసీ సుబ్బారావు

బాపట్ల, జూలై 11: ప్రజల ఆనందం ప్రభుత్వ లక్ష్యం కాబట్టి దానికి అనుగుణంగా పనిచేస్తానని జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు తెలిపారు. బాపట్ల జాయింట్ కలెక్టర్‌గా గురువారం బాధ్యతలు చేపట్టిన ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అన్ని విషయాల్లో ప్రజలకు న్యాయం జరిగేలా చూడడం తన బాధ్యత అన్నారు. గ్రీవెన్స్ కార్యక్రమాలలో అత్యధికంగా రెవెన్యూ సమస్యలతోనే అర్జీలు వస్తున్నాయని వాటిని తక్షణమే పరిష్కరిస్తామన్నారు. రెవెన్యూశాఖపై ప్రత్యేకంగా దృష్టిసారించాల్సిన అవసరం ఉందన్నారు. 2017 ఐఏఎస్ బ్యాచ్‌లో ఎంపికైనా జాయింట్ కలెక్టర్‌గా తొలిసారిగా బాపట్లలోనే బాధ్యతలు చేపట్టానన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సీఈవోగా చేసిన అనుభవంతో అన్ని మండలాలు గురించి తెలుసుకాబట్టి ఖచ్చితంగా కష్టపడి పనిచేస్తానన్నారు. బాధ్యతలు చేపట్టే ముందు కలెక్టర్ జె.వెంకటమురళిని జేసీ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జేసీని ఆర్డీవోలు గంధం రవీందర్, జి.సూర్యనారాయణరెడ్డి, హేలాషారోను, ఏఈవో లక్ష్మీకుమారి, తహసీల్దార్‌లు, కలెక్టరేట్ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.



జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపడుతున్న బి.సుబ్బారావు

హరే కృష్ణ.. హరే రామ్

- మంగళగిరిలో వైభవంగా జగన్నాథ రథయాత్ర
- రథయాత్రను ప్రారంభించిన మంత్రి నారా లోకేశ్

మంగళగిరి సిటీ, జూలై 11: ఇస్కాన్ ఆధ్వర్యంలో మంగళగిరిలో శ్రీ జగన్నాథుని రథయాత్ర గురువారం అత్యంత వైభవంగా సాగింది. జై జగన్నాథ్, హరేకృష్ణ, హరేరామ్ నినాదాలతో మంగళగిరి పురవీధులు మార్మోగాయి. తొలుత జగన్నాథుడు, బలరాముడు, సుభద్రల విగ్రహాలకు హారతులిచ్చిన మంత్రి లోకేశ్... అనంతరం రథాన్ని లాగి రథయాత్రను ప్రారంభించారు. రథానికి ముందు సంప్రదాయబద్ధంగా బంగారు చీపురుతో రహదారి మార్గాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ ప్రజా సేవ అంటే పరమాత్ముడి సేవ అన్నారు. ఇప్పుడు అందరి దృష్టి మంగళగిరి వైపే ఉందని, ఆ దేవుడి ఆశీస్సులతో ప్రజలకు మెరుగైన సేవలందిస్తానని తెలిపారు. మంగళగిరి నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి సైతం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. మంగళగిరి బస్టాండు నుంచి బైపాస్ రోడ్డులోని ఆత్మకూరు బాపూజీ విద్యాలయం వరకు రథయాత్ర సాగింది. దారిపొడవునా జగన్నాథ రథం ముందు భక్తులు పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ ఆనంద పారవశ్యంలో మునిగిపోయారు. ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు ఒడిశాలోని పిప్లి నుంచి తెప్పించిన రంగుల పందిరి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కోలాట ప్రదర్శనలు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, బాపూజీ అకాడమీ చైర్మన్ యర్రాకుల తులసీరామ్, పిరమిడ్ ధ్యాన మండలి అధ్యక్షుడు ఆకురాతి శంకరరావు, బలరామ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు పల్లెబాట రాజా, సువర్ణ శ్రీనివాస దాస్, ఇస్కాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



జగన్నాథుడు, బలరాముడు, సుభద్రల విగ్రహాలకు హారతి ఇస్తున్న మంత్రి నారా లోకేశ్



మంగళగిరి ఇస్కాన్‌కు వచ్చిన ఇండియన్ వరల్డ్ రికార్డును మంత్రి లోకేశ్‌కు చూపుతున్న ఇస్కాన్ ప్రతినిధులు

మారని మెప్మా..!

మార్ట్‌లలో లాభాలు ఇస్తాం.. వాటిల్లో వచ్చిన ఆదాయం ఏడాది తర్వాత చెల్లిస్తామంటూ గత వైసీపీ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీ గాల్లో కలిసిపోయింది. ఇంతవరకు చెల్లించిన సొమ్ముకే గతి లేదని పొదుపు మహిళలు వాపోతున్నారు. జనం సొమ్ముతో జగనన్న మహిళ మార్ట్‌లు ఏర్పాటు చేసినా ఒక్కపైసా ఆదాయం చూపించకపోవడంపై అనుమానాలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం మారింది.. పాలకులు మారారు అయితే మెప్మా అధికారులు మాత్రం తమ వైఖరిని మార్చుకోలేదు. పొదుపు మహిళలు మార్ట్‌లోనే సరుకులు కొనాలని బలవంతం చేయడం, లేకుంటే రుణాలు ఇవ్వబోమంటూ హెచ్చరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆర్పీలకు రోజువారీ అమ్మకాలు టార్గెట్ పెట్టడంతో వారు బెదిరించి సరుకులు అమ్మడంపై పొదుపు మహిళలు మండిపడుతున్నారు.


ఒంగోలులోని మహిళా మార్ట్

- మహిళా మార్ట్‌లో బలవంతపు అమ్మకాలు
- కొనాల్సిందేనంటూ పొదుపు మహిళలపై ఒత్తిడి
- ఆర్పీలకు రోజువారీ అమ్మకాల బాధ్యతలు
- కొనకుంటే రుణాలు ఇచ్చేది లేదంటూ వెల్లడి
- టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చినా పాత పద్ధతి కొనసాగింపుపై ఆగ్రహం

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 11 : కొత్త ప్రభుత్వం కొలువుదీరినా మెప్మాలో ఏం మార్పు రాలేదు. గత వైసీపీ ప్రభుత్వ వాసనలు ఇంకా పోలేదు. పట్టణ పేదరిక నిర్మూలనే లక్ష్యం.. ప్రతి మహిళ ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా వడ్డీ లేని రుణాలు.. మహిళల ఆర్థిక చేయూత కోసమంటూ గత జగన్ ప్రభుత్వం ఏడాది క్రితం కొత్త పథకానికి తెరదీసింది. పొదుపు మహిళల భాగస్వామ్యంతో వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు 'జగనన్న మహిళా మార్ట్'లు ఏర్పాటు అంటూ హడావుడి చేసింది. తక్కువ ధరకు నిత్యావసర సరుకులు అందించే సూపర్ మార్కెట్‌లను ఏర్పాటు చేసి, అందులో పొదుపు మహిళలే భాగస్వాములుగా పేర్కొంది. అయితే పెట్టి ఏడాది దాటినా మహిళల వాటాగా ఎటువంటి చెల్లింపులు లేవు. పైగా సరుకులు కొనేవారిని తీసుకురావాలని, లేదంటే మీరే కొనుగోలు చేయాలంటూ మెప్మా నుంచి ఒత్తిడి ఉండటంతో ఆయా సభ్యులు అల్లాడిపోతున్నారు.

సొమ్ము సభ్యులది... పేరు జగన్‌ది

మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేశారు. ఈ మార్ట్‌ల ద్వారా ప్రజలకు అందుబాటులో ధరకు నాణ్యమైన నిత్యావసర సరుకులు, ఇతర వస్తువులను విక్రయించే విధంగా ప్రతి పట్టణంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావించింది. తొలుత జిల్లా కేంద్రాలలో ప్రారంభించాలని మెప్మా అధికారులకు ఆదేశాలు అందాయి. ఆ వ్యాపారాల్లో పొదుపు మహిళలను భాగస్వామ్యం చేస్తామంటూ పేర్కొనడంతోపాటు ప్రతి పొదుపు సంఘం నుంచి రూ.1500 ముక్కుపిండి మరీ వసూలు చేశారు. ఇందుకు సంబంధించి వసూళ్ల బాధ్యతను మెప్మాకు అప్పగించారు. అందులో భాగస్వాములైన ఆర్పీలు పొదుపు సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రతి మహిళ దగ్గర డబ్బులు వసూలు చేశారు. మహిళా సాధికారత కోసం నవరత్నాలలో భాగంగా వడ్డీ లేని రుణాలు మంజూరు చేస్తున్నామని గొప్పలకు పోయిన వైసీపీ.. జనం సొమ్ముతో జగనన్న మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేయడంపై అప్పట్లో విమర్శలొచ్చాయి. ఇందుకు సంబంధించి జిల్లాలో ఒంగోలు నగరంతోపాటు చీమకుర్తి, దర్శి, గిద్దలూరు, కనిగిరి, మార్కాపురంలలో మహిళా మార్టులు ఏర్పాటు చేశారు. ఏడాది కాలంగా ఆశించిన స్థాయిలో కొనుగోళ్లు జరగలేదు. దీంతో మార్ట్‌ల్లో పొదుపుసభ్యులకు బలవంతపు అమ్మకాలు జరుపుతుండగా, వాటిపై వచ్చే ఆదాయం ఎటు పోతుందో, ఎవరి ఖాతాలో జమవుతుందో కూడా తెలియని పరిస్థితి. జగన్ పాలనపై ప్రజలు విరక్తి చెంది ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఘోరంగా ఓడించి, తెలుగుదేశం పార్టీ కూటమిని భారీ మెజారిటీతో గెలిపించారు. అయినా మెప్మా అధికారులు మాత్రం తమ వైఖరి మార్చుకోలేదు. నేటికీ ఆర్పీల ద్వారా మార్ట్‌లో సరుకులు కొనాల్సిందే, ఆ బాధ్యత అందరూ తీసుకోవాల్సిందేనని హెచ్చరించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

మార్ట్‌ల నిర్వహణ కమిటీ నియామకం ఇలా..

కనీసం ఇంటర్ విద్యార్హత, వ్యాపారంలో అనుభవం కలిగిన 11 మందితో కమిటీని నియమించారు. మెప్మా కార్యాలయం రూపొందించిన బైలా ప్రకారం అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి వంటి పాలకవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. పరస్పర సహాయ, సహకార సంస్థ చట్టం (మాక్స్ యాక్ట్) పరిధిలో జేఎంఎంను రిజిస్ట్రేషన్ చేయించి, అన్నీ ఆన్‌లైన్ లావాదేవీలనే నిర్వహిస్తున్నా. లాభనష్టాలు మాత్రం అధికారులు బయటకు చెప్పడం లేదు.

జిల్లాలో రూ.1.34 కోట్లు వసూలు లక్ష్యం

జిల్లాలో మహిళా మార్ట్‌ల ఏర్పాటుకు పొదుపు సభ్యుల నుంచి రూ.1,37,79,600 వసూలు చేయాల్సి ఉంది. ఒంగోలు నగరంలో 44,331 పొదుపు సంఘాలు ఉండగా, 43,080 మంది పొదుపు సభ్యులు ఉన్నారు. చీమకుర్తిలో 590 సంఘాలు ఉండగా, 5,574మంది పొదుపు సభ్యులు ఉన్నారు. దర్శిలో 805 సంఘాలు, 8,050 మంది సభ్యులు, గిద్దలూరు 943 సంఘాలు, 8,982 మంది సభ్యులు, వారితోపాటు కనిగిరిలో 872 సంఘాలు 8,496 మంది సభ్యులు, మార్కాపురంలో 1,596 సంఘాలు, 15,682 మంది సభ్యులు ఉన్నారు. మొత్తం 9,237 సంఘాలు ఉండగా, ఆ సంఘాల్లో 89,864 మంది పొదుపు మహిళలు ఉన్నారు. వీరి నుంచి ఒక్కొక్కరు మహిళామార్ట్ ఏర్పాటుకు రూ.150 చెల్లించారు. ఇంతవరకు లాభ, నష్టాలు, వ్యాపారం జరిగిన లెక్కలపై అధికారులు పొదుపు సభ్యులకు వివరించకపోగా, నేటికీ మార్ట్‌ల ద్వారానే అమ్మకాలు చేస్తుండడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

భాగస్వామ్యమే... లాభాలు ఇవ్వం

వైసీపీ ప్రభుత్వ ఆదేశాలు ప్రతి ఒక్కరూ పాటించాల్సిందేనని మెప్మా వైపు నుంచి ఏడాది క్రితం పొదుపుసంఘాలకు ఆదేశాలు అందాయి. ఆర్పీలలో కొందరు కచ్చితంగా ప్రతి మహిళ వాటా చెల్లించాల్సిందేనని వసూలు చేశారు. పొదుపు సభ్యులు చెల్లించే రూ.150కి ఎలాంటి భాగస్వామ్యం ఉండదు. ఏడాది తర్వాత రూ.150 తిరిగి ఇస్తామన్నారు. ఆ తర్వాత వ్యాపారంలో ఎలాంటి భాగస్వామ్యం ఉండకపోగా, దానిపై వచ్చే లాభాలను ప్రభుత్వ ఖాతాల్లోకి జమవుతాయి. అంతేకాకుండా ప్రతి మహిళ తమ ఇంటికి అవసరమైన సరుకులు మహిళామార్ట్‌ల ద్వారానే కొనుగోలు చేపిస్తున్నారు.


చట్టాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు, న్యాయవాదులు

హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలి

చీరాలటౌన్, జూలై 11 : వాహన దారులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని లేకుంటే ప్రమాదాలబారిన పడతారని వన్‌టౌన్ ఎస్ఐ హరిబాబు, న్యాయవాది రమేష్‌బాబు అన్నారు. న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు గురువారం స్థానిక ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూల్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రమాదాల నియంత్రణలో భాగంగా చట్టాలు కఠినతరం చేసినట్లు వివరించారు. ప్రతి ఒక్కరు వాటిపై అవగాహన పొంది నిబంధనలు పాటించాలన్నారు. అలాగే భిన్నంగా వ్యవహరించిన వారిపై జరిమానాలతో పాటు శిక్షలు కఠినంగా అమలులో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు కస్తూరీనాథ్, రామారావు, సోషల్ వర్కర్ మతీన్, ట్రాఫిక్ ఏఎస్సై శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది వాహనదారులు పాల్గొన్నారు.

వైకుంఠపురం రైల్వే గేటుకు తాత్కాలిక అంతరాయం

చీరాలటౌన్, జూలై 11 : రైల్వే లైన్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు వైకుంఠపురం వద్ద రైలు గేటును తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు గురువారం ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం చేపట్టిన మరమ్మతులు పూర్తి అయిన వెంటనే యథావిధిగా సేవలు కొనసాగుతాయన్నారు. ఈక్రమంలో ఏర్పడిన అంతరాయానికి ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

డిగ్రీ కోర్సులో ప్రవేశాల గడువు పెంపు

చీరాలటౌన్, జూలై 11 : వైఏ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి డిగ్రీ కోర్సులలో ఆన్‌లైన్ ప్రవేశాల మొదటి దశకు గడువు పెంచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.మురళి గురువారం ప్రకటనలో తెలిపారు. బీఏ (ఎకనామిక్స్), బీకామ్(కంప్యూటర్), బీఎస్సీ(కంప్యూటర్ సైన్స్), బీఎస్సీ (వృక్షశాస్త్రం), బీఎస్సీ (జంతుశాస్త్రం), బీఎస్సీ (రసాయనశాస్త్రం) కోర్సులలో ప్రవేశాలకు అనుమతి కలిగించినట్లు తెలిపారు. అడ్మిషన్‌లు పొందని వారు అవకాశాన్ని వినియోగించుకోవాలని, వివరాలకు కళాశాల సిబ్బందిని సంప్రదించాలని చెప్పారు.

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య

- పురుగుమందు తాగి మృతి
- నూతలపాడులో విషాదం


పొలంలో నాగరాజు మృతదేహం

నూతలపాడు(పర్చూరు), జూలై 11 : అప్పుల బాధతో యువ కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటుచేసుకుంది. పొలాల్లో పురుగు మందు తాగి మృతి చెందిన విషయం వెలుగులోకి వచ్చింది. బాపట్ల జిల్లా, పర్చూరు మండలం, నూతలపాడు గ్రామానికి చెందిన బాదుగుల నాగరాజు (37) తనకు సొంత భూమి లేదు. దీంతో 15 నుంచి 20 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నారు. అత్యధికంగా మిర్చి పంటను వేశారు. గత ఏడాది వాతావరణ పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్ల కారణంగా పంట పూర్తిగా దెబ్బతిన్నది. వ్యవసాయం కోసం చేసిన అప్పులు పెరిగిపోవడంతో మనస్తాపానికి గురయ్యారు. ఏటా పంటలు దెబ్బతినడం, అప్పులు పెరిగిపోన్నాయి. సుమారు రూ.20లక్షల వరకూ అప్పు ఉండడంతో అవి తీర్చే దారిలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. ఉదయం ఇంటి నుంచి బయలు దేరి చిలకలూరిపేట మండలం, బొప్పూడి ఆంజనేయస్వామి ఆలయం సమీపంలోని పొలాల్లో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. నాగరాజుకు భార్య, ఇద్దరు చిన్న కుమారులున్నారు.

నన్ను క్షమించు

నన్ను క్షమించి నీకు నేను న్యాయం చేయలేక పోతున్నానంటూ భార్య సామ్రాజ్యానికి నాగరాజు మెసేజ్ పెట్టారు. దాని ఆధారంగా పోలీసులు లోకేషన్ ద్వారా మృతదేహాన్ని గుర్తించారు.

కాలం చెల్లిన బస్సులతో అవస్థలు

- దూరప్రాంతాలకు అవే వాహనాలు
- మార్గమధ్యలో నిలిచి పాట్లు


అంబేడ్కర్ బొమ్మ సెంటర్ సమీపంలో బస్‌ను నెడుతున్న స్థానికులు

అద్దంకి, జూలై 11 : ఆర్టీసీలో కాలం చెల్లిన బస్సులతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఎప్పుడు మార్గమధ్యంలో నిలిచిపోతుందోనని బిక్కు బిక్కుమంటూ ప్రయాణిస్తున్నారు. వినుకొండ డిపోకు చెందిన బస్సు గురువారం ఉదయం 10 గంటల సమయంలో ఒంగోలు నుంచి వినుకొండ వెళ్తూ అద్దంకి పట్టణంలోని అంబేడ్కర్ బొమ్మ సెంటర్‌కు వచ్చే సరికి మరమ్మతులకు గురై నిలిచి పోయింది. దీంతో వినుకొండ వైపు వెళ్లే ప్రయాణికులను వేరే బస్సులో పంపించారు. వినుకొండ నుంచి ఒంగోలు సుమారు 80 కిలోమీటర్ల దూరం ఉండగా ఆ రూట్‌లో వినుకొండ డిపో నుంచి నడిపే అద్దెబస్సులు మినహా ఆర్టీసీ బస్సులు కాలం చెల్లినవే కావడంతో తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. కనీసం దూర ప్రయాణం బస్సు రూట్లలోనైనా మంచి కండిషన్‌లో ఉన్న బస్సులు నడపకపోవడం మరింత విమర్శలకు తావిస్తుంది.

అమ్మ ఆశ్రమ భవన నిర్మాణానికి సాయం

మార్టూరు, జూలై 11 : అమ్మ ఆశ్రమ నూతన భవన నిర్మాణానికి గురువారం రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందచేశారు. చిలకలూరిపేట మండలం లింగంగుంట మాజీ సర్పంచ్ తుళ్లూరి సుధాకర్, బొప్పూడి జుయలర్స్ అధినేత సిద్దు లక్ష్మణచారి, తుర్లపాటి నగేష్ ఆర్థిక సాయాన్ని ఆశ్రమ అధ్యక్షుడు గుంటుపల్లి చందుకు అందచేశారు.

అసాంఘిక శక్తులపై పోలీసుల ఉక్కుపాదం

చీరాలటౌన్, జూలై 11 : అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతున్నట్లు మెరైన్ సీఐ సురేష్‌కుమార్ తెలిపారు. గురువారం చీరాల రైల్వే స్టేషన్, బస్టాండ్ ప్రాంతాలలో మెరైన్, వన్‌టౌన్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ సాగర్ కవచ్ కార్యక్రమంలో భాగంగా అన్ని ప్రాంతాల్లో, సముద్రతీరాల్లో ఎటువంటి అక్రమ రవాణా, గంజాయి, మత్తు పదార్థాలపై ప్రత్యేక దృష్టిసారించినట్లు వివరించారు. ఈనేపథ్యంలో ముమ్మర తనిఖీలు చేశారు. అనుమానితుల వివరాలు సేకరించారు. నేరాలకు పాల్పడితే శిక్షలు తప్పవన్నారు. తనిఖీలలో వన్‌టౌన్ ఎస్సై వేమన, ఏఎస్సై సుబ్బారావు, స్టేషన్, మెరైన్ సిబ్బంది పాల్గొన్నారు.


రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ప్రాజెక్టుల పనులు వేగవంతం

- చివరి భూములకు సాగర్ నీరు
- ప్రాజెక్టుల సీఈ రవికుమార్
- శుభాకాంక్షలు తెలిపిన ఉద్యోగులు

ఒంగోలు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయడం, చివరి భూములకు కూడా సాగర్ నీరు అందేలా చూడటంపై ప్రధానంగా దృష్టిపెట్టనున్నట్లు జలవనరులశాఖ సీఈ కడియాల రవికుమార్ చెప్పారు. చీఫ్ ఇంజనీర్‌గా రెండు రోజుల క్రితం నియమితులైన రవికుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. తర్వాత ఆయా విభాగాలకు చెందిన ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. ప్రస్తుతం జరుగుతున్న పనులు, తక్షణం తీసుకోవాల్సిన చర్యలు, నిధులు అవసరం తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఈ రవికుమార్ ఆంధ్రజ్యోతిలో మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం సాగునీటి రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నదన్నారు. జిల్లాలోని వెలిగొండ పనులపై ప్రధాన దృష్టిసారించనున్నట్లు చెప్పారు. అలాగే గుండ్లకమ్మ గేట్ల పనులు తక్షణం పూర్తికి చర్యలు చేపట్టి, ఈ ఏడాది ఆయకట్టుకు నీరు అందేలా చూస్తామన్నారు. అలాగే సాగర్ ఆయకట్టు రైతులు అవస్థలు తీర్చేలా చివరి భూములకు సాగర్ నీరందేలా చూస్తామన్నారు. గతంలో ఇక్కడ ఎస్ఈగా పనిచేసిన అనుభవం, అలాగే ఆ రంగంలో ప్రభుత్వ ప్రాధాన్యతకు అనుగుణంగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన రవికుమార్‌ను పలువురు ఇంజనీరింగ్ అధికారులు, ఉద్యోగుల సంఘం ప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బ్లాస్టింగ్‌లో నిబంధనలు పాటించకపోతే చర్యలు

గ్రానైట్ క్వారీలను తనిఖీ చేసిన డీఎంఎస్

బల్లికురవ, జూలై 11 : గ్రానైట్ క్వారీల నిర్వహణలో బ్లాసింగ్ నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైదరాబాద్ జోన్ జోన్-3 డైరెక్టర్ ఆఫ్ మైన్స్ అండ్ సేఫ్టీ (డీఎంఎస్) సుప్రియో చక్ర భృతి హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని వీర్లకొండ వద్ద అమూల్య, ఇంపీరీయల్, మారం వెంకారెడ్డి గ్రానైట్ క్వారీలను డీఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్వారీల రికార్డులను తనిఖీ చేసి భద్రత పరంగా చేపడుతున్న చర్యలను తెలుసుకొని సూచనలు చేశారు. గనులలో పనుల వద్ద అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఆయన కోరారు. అలానే క్వారీల బౌండ్రీ మ్యాప్‌లను పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం వీటీసీ భవనంలో అన్ని క్వారీలకు చెందిన ఫస్టు క్లాసు మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంఎస్ సుప్రియో చక్ర భృతి మాట్లాడుతూ గనులలోకి ట్రాక్టర్లను అనుమతించ వద్దు అన్నారు. అలానే బ్లాసింగ్ మ్యాగ్జైన్ నిల్వల కేంద్రాలు లేని క్వారీలు ఇష్టారాజ్యంగా చేపడితే క్వారీ లీజులు రద్దు చేస్తామన్నారు. అలానే బ్లాసింగ్‌లు పెట్టే సమయంలో నలువైపులా ఉన్న క్వారీల వారికి తెలియజేయాలన్నారు. ఒక్క కార్మికుడి ప్రాణం పోయినా బాధ్యులు మీరేనన్నారు. పనుల జరిగే సమయంలో మేనేజర్లు అందుబాటులో ఉండాలన్నారు. అలానే దుమ్ము లేవకుండా ప్రతి రోజు నీటిని చల్లించాలన్నారు. అలానే పనుల వద్ద ఫస్టు ఎయిడ్ కిట్‌లను ఉంచాలన్నారు. కార్యక్రమంలో కలర్ గ్రానైట్ క్వారీ యజమానుల సంఘం అధ్యక్షుడు ధూళిపాళ్ల శ్రీకాంత్, గౌరవాధ్యక్షుడు అంజనేయులు పాల్గొన్నారు.

అప్పులకుప్పగా ఎంపీడీవో కార్యాలయం

- ఎన్నికల ముందు వైసీపీ నేతలకు మట్టి రోడ్డు పనులు
- సక్రమంగా చేయని వైనం
- రూ.1.22కోట్ల బకాయి
- టీడీపీ రాగానే పెండింగ్ బిల్లులతో స్వాగతం
- నేడు సర్వసభ్య సమావేశం



బల్లికురవ, జూలై 11 : వైసీపీ పాలనలో మండల ప్రజా పరిషత్ కార్యాలయం అప్పులకుప్పగా మారింది. బల్లికురవ మండల ప్రజా పరిషత్ పాలకవర్గ సభ్యులు నిధులు లేకుండానే ముందస్తుగా నిబంధనలను పక్కన పెట్టి మరి కోట్ల రూపాయలతో నామమాత్రంగా మట్టి రోడ్ల పనులకు ఆమోదముద్ర వేశారు. దీంతో ఇప్పుడు ఎంపీడీవో కార్యాలయం పనులు చేసిన వైసీపీ వర్గియులకే సుమారు రూ.1.22 కోట్లు బకాయి ఉంది. టీడీపీ అధికారంలోకి వచ్చిన వారికి ఎలాంటి పనులకు నిధులు రాకుండా ఉండేందుకే ఇలా వైసీపీ పార్టీ పాలకవర్గం పెద్ద ఎత్తున గ్రామాలలో తమ అనుకూల వర్గానికి పనులను కట్టబెట్టిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నేడు జరిగే మండల సర్వసభ్య సమావేశంలో నిధుల లేమి కనిపిస్తుంది. దీంతో తూతూ మంత్రంగా సమావేశం సాగే అవకాశం ఉందని పలువురు అంటున్నారు.

ఎంపీడీవో కార్యాలయం సీనరేజ్ నిధులతో గ్రామాలలో సమస్యలను పరిష్కరించాల్సి ఉంది. నిధులు ఉంటేనే పనులకు తీర్మానాలు ప్రతిపాదనలు పంపాల్సి ఉంది. కానీ ఇవేమీ తమకు వర్తించవంటూ వైసీపీ పార్టీకి చెందిన ఎంపీపీ ఆమె వర్గీయులు ఎన్నికలకు ముందు జనవరిలో పెద్ద ఎత్తున తమ వర్గీయులకు ఇష్టారాజ్యంగా మట్టి రోడ్లకు పనులు చేసేందుకు నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. కొందరు వైసీపీ నేతలు తమ ఇష్టం వచ్చినట్లు అధికారులను బెదిరించి మట్టి రోడ్లను వేశారు. కార్యాలయంలో చిల్లగవ్వ కూడా లేదు. ఇప్పుడు వైసీపీకి చెందిన పలు గ్రామాల నేతలకే రూ. 1.22 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉంది. మూడు మాసాలకోసారి జరిగే సర్వసభ్య సమావేశంలో సమస్యలపై చర్చించి అవసరమైన పనులకు మండల పరిషత్ నిధులను కేటాయిస్తు తీర్మానాలను ఆమోదించాల్సి ఉంటుంది. ఇప్పుడు అప్పుల ఊబిలో ఉన్న సమయంలో శుక్రవారం జరిగే సమావేశం ఎలా జరుగుతుందా అనే అనుమానాలున్నాయి. నిధులు లేకుండా పనులకు అనుమతి ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అసలు సమస్యలపై చర్చ జరుగుతుందా లేదా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ప్రధానంగా రక్షిత మంచినీటి పథకాలను అందుబాటులోకి తెచ్చే విషయమై చర్చించి పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

నైరాశ్యంలో టీడీపీ వర్గీయులు

టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇకపై కార్యాలయ నిధులతో గ్రామాలలో అభివృద్ధి పనులు చేపడతామని భావించిన టీడీపీ వర్గీయులు నిరాశకు గురయ్యారు. ఇందుకు ప్రధానం కారణం వైసీపీ తప్పుడు నిర్ణయాలతో కార్యాలయం అప్పులకుప్పగా మారింది. ఇప్పుడు ప్రభుత్వం ద్వారా వచ్చే సీనరేజీ నిధులు పాత పనులు చేపట్టి ఎంబుక్ రికార్డు అయిన వారికే చెల్లింపులు చేయాల్సి ఉంది. మళ్లీ నిధులు వస్తే గానీ పనులకు ఆస్కారం ఉండదు. ఇదిలావుండగా గతంలో వైసీపీ చేపట్టిన పనులలో పలు లోపాలు ఉన్నాయని వాటిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి పనులు చేసిన వారికే సక్రమంగా నిధులు ఇవ్వాలని టీడీపీ నేతలు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు.


సరస్వతిదేవి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

తెలుగు సినీపాట ముద్దు బిడ్డ సినారె

అద్దంకిటౌన్, జూలై 11 : తెలుగు సినీ పాట ముద్దు బిడ్డ సినారె అని పలువురు వక్తలు కొనియాడు. గురువారం రాత్రి స్థానిక దత్త సాయి క్లినిక్ ఆవరణంలో సాహితీ ప్రవంతి సమావేశం అధ్యక్షుడు చందలూరి నారాయణరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ సినీ కవి సీ నారాయణరెడ్డి(సినారె)కు జ్ఞానపీఠ అవార్డు రావడం తెలుగువారందరికీ గర్వకారణమన్నారు. అనేక సినిమా పాటలతో పాటు ఎన్నో గ్రంథాలు, గొప్ప శైలిలో వందల సినీ పాటలతో ఎందరో నటులకు ఆయా పాటలతో గుర్తింపు తెచ్చిన మంచి కవి అన్నారు. అనంతరం పోస్టల్ అసిస్టెంట్‌గా పని చేస్తూ పదవీ విరమణ చేసిన సాహితీ విశ్లేషకులు ఆర్‌వీ రాఘవరావు సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గాడేపల్లి దివాకర్‌దత్తు, అన్నమనేని వెంకట్రావు, పీసీహెచ్ కోటయ్య, డాక్టర్ దేవపాలన, సత్యనారాయణ, శేషతల్పసాయి, మిట్టా కామేశ్వరశర్మ, రామదాసు పాల్గొన్నారు.

మంచినీటి సరఫరాలో అక్రమాలు నిగ్గుతేలేనా...?

కుంకులమర్రు (పర్చూరు), జూలై 11 : కారంచేడు మండలం కుంకలమర్రు గ్రామంలో మంచినీటి సరఫరాలో నిలువు దోపిడీ జరిగిందని ట్రస్ట్ పేరుతో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్ విషయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారి విషయంలో నిగ్గు తేల్చాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే టీడీపీ నాయకులు, గ్రామస్థుల ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలో తొలుత టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ పనిచేయకపోవడంతో దానిని బాగుచేయకుండా వైసీపీ నేత జువ్వా శివరాం ప్రసాద్ జువ్వా చారిటబుల్ ట్రస్ట్ పేరుతో మరో వాటర్ ప్లాంట్‌ను నెలకొల్పినట్లు పేర్కొన్నారు. దీనికి నీటి సరఫరా చేసేందుకు పంచాయతీకి నెలకు రూ.25వేల చొప్పున ఒప్పందం కుదుర్చుకున్నారన్నారు. నాలుగు నెలల మాత్రమే చెల్లించి అక్రమంగా ఏడాదికి రూ.25వేలు మాత్రమే చెల్లించే విధంగా పంచాయతీ వారు జువ్వా ట్రస్టుకి మరో తీర్మానం చేశారన్నారు. ఇది నిబంధనలకు విరుద్ధమని ఇలాంటి చర్యలకు పాల్పడిన అధికారులు, కారకులపై చర్యలు తీసుకోవాని గ్రామస్థులు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతోపాటు ట్రస్టుకు సంబంధించిన ప్లాంట్‌కు వినియోగించుకున్న రూ.67,65,983 విద్యుత్ బకాయిలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు కొల్లా సుబ్బారాయుడు డిమాండ్ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బాపట్ల జిల్లా పంచాయతీ అధికారి సూచనల మేరకు చీరాల డివిజనల్ పంచాయతీ అధికారి అధ్వర్యంలో విచారణ చేస్తున్నట్లు సమాచారం.

భారీగా అక్రమాలు జరిగితే ఏం చేస్తున్నారు..!

కనిగిరి, జూలై 11: కనిగిరి నియోజకవర్గంలో పెద్దఎత్తున అక్రమాలు, ఆక్రమణలు జరిగితే ఏం చేస్తున్నారంటూ జేసీ గోపాలకృష్ణ రెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వరుస కథనాలతో ఇటీవల రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ప్రభుత్వ భూములు, స్థలాలను గుర్తించి వాటిల్లో ఉన్న ఆక్రమణలను తొలగించారు. గురువారం పట్టణంలోని ఒంగోలురోడ్డు, పామూరు రోడ్డు, కంభం రోడ్డులోని వివిధ ప్రభుత్వ భూముల్లో ఉన్న నిర్మాణాల తొలగింపును ఆయన పరిశీలించారు.ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ అసైన్డ్ భూముల్లో వెంచర్లు వేయటం చట్టవిరుద్ధమన్నారు. పక్కా భూముల్లో వేసిన వెంచర్లకు కన్వర్షన్‌తో పాటు, ప్లాన్ అప్రూవల్ తప్పనిసరిగా ఉండాలన్నారు. వీటిపై దృష్టి సారించి అప్రూవల్, కన్వర్షన్ లేని సెటిల్‌మెంట్ భూముల్లో వెంచర్లు వేసిన వారికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. వీటిపై నివేదిక అందజేయాలన్నారు. అసైన్డ్ భూముల్లో వెంచర్లను తొలగించి కేసులు నమోదు చేయాలన్నారు. ఆర్డీవో, తహసీల్దార్, డీటీ, వీఆర్వోలు బృందంగా ఏర్పడి అనుమతులేని వెంచర్లను తొలగించాలన్నారు.

VEHICLE FOR SALE

VEHICLE NO	VEHICLE DESCRIPTION	YEAR
AP39TE-4652	TATA LPT 1412 FBT	2018
AP27TX-5299	AL 3718 IL FBT	2015
AP27TX-9812	AL DOST	2016
AP39W-0728	MAHINDRA BOLERO MAXI TRUCK PLUS	2019
AP39HA-4175	SWIFT DZIRE LDI DIESEL 5 SEATER	2017
AP26BR-2622	JCB INDIA LTD	2016

AUCTION DATE : 12-07-2024
SHRIRAM AUTO MALL INDIA LIMITED
Doddavarappadu(V&PO), Maddipadu(M), ONGOLE, Prakasam(DT), 99498 29182, 95737 11099

AJ ఆంధ్రజ్యోతి ప్రతిరోజూ క్లాసిఫైడ్స్ — ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం

ట్రైనింగ్ సెంటర్

n రాధిక M.P.H.W ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్, సుందరయ్య భవన్ రోడ్, శ్రీనివాస హాస్పిటల్ ఎదురు, ఒంగోలు, కోర్సులు : M.P.H.W(F), ANM / DMLT Q: ఇంటర్ ఏ గ్రూప్ వారైన, ప్రభుత్వ స్కాలర్‌షిప్ కలదు. సంప్ర॥ 08592 282349, 8978869519, 7674998230
AJO-190174

PROPERTY FOR SALE

n BHK flat in BSK Guptas Lake Side Apartment, 1st floor (No.102, SOUTH facing) in Lawyerpet, Montessori School Road for Sale. Genuine buyers please Contact : 9866595746
AJH-14295

WANTED HINDI TEACHER

n Hindi Subject Teacher Wanted from 6th to 10th Classes Hindi Subject Teaching. Free Boarding and Lodging. Contact immediately, Sri Raghavendra High School, Kurichedu, Cell: 9490327336
AJO-190347

WANTED

n ఒంగోలు సమతానగర్‌లోని శ్రీగాయత్రి గ్రామర్ స్కూల్ నందు పనిచేయుటకు Clerak Cum Computer Operator, Lady Computer Teacher కావలెను. సంప్రదించండి సెల్ : 9014404155
AJO-274

కావలెను

n మీ ఇంటి వద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి, న్యూ రికార్డులు వ్రాయుటకు స్త్రీ, పురుష అభ్యరులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12,000. సంప్ర॥ 9550745296.
AJV-192984

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, ఉద్యోగ, వ్యాపార, బహిరంగ ప్రకటనలు, అంత్యక్రియలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి మరియు అన్నిరకాల ప్రకటనలు కొరకు సంప్ర॥

ఒంగోలు : 99854 11071, 97036 18694, 95053 05888
చీమకుర్తి : 96525 55752
చీరాల : 99859 21376
మార్కాపురం : 99859 21358
కందుకూరు : 97036 18697
కనిగిరి : 99854 11483
గిద్దలూరు : 99859 21358

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావలసినవారు మరియు పేపరు పంపిణీ విషయంలో ఎటువంటి సమస్యలు ఉన్నా సంప్ర॥
Asst-Cir-Manager. 9985411484





పర్చూరులో అడుగంటిన మంచినీటి చెరువు.. చెరుకూరులోని తామర, నాచుతో ఇలా .. రంగుమారి కంపుకొడుతున్న కొల్లావారిపాలెం చెరువు

దాహం..దాహం..!

» ఉన్నది అరకొరే ... ఆపై కలుషితం
» గుక్కెడు మంచినీటి కోసం ఎదురు చూపులు
» అవస్థలు పడుతున్న ప్రజలు

పర్చూరు, జూలై 11 : గుక్కెడు మంచినీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారు. పర్చూరులో దాహం కేకలు వినిపిస్తున్నాయి. మండలంలో ఎక్కడ చూసినా అడుగంటిన మంచినీటి చెరువులే దర్శన మిస్తున్నాయి. ఉన్న అరకొర నీరు కాస్త రంగుమారి కంపుకొడుతున్నాయి. దీంతో గత్యంతరం లేక కలుషిత నీటి తోనే ప్రజల కాలం వెల్లబుచ్చుతున్నారు. కనీసం రంగుమారి, కంపుకొడుతున్న నీటిని శుద్ధి చేసి సరఫరా చేద్దామన్నా ఫిల్టర్‌బెడ్‌లు పనిచేయడం లేదు. దీంతో పంచాయతీ ట్యాప్‌ల ద్వారా సరఫరా అవుతున్న నీటితోనే ప్రజలు కాలం వెల్ల బుచ్చుతున్నారు. మరో పక్క మూలిగే నక్కపై తాటికాయ పడినట్లు అనేక గ్రామాల్లో మంచినీటి చెరువుల పరిస్థితి దయనీయంగా మారింది. తామర, నాచు, చిల్లచెట్లతో చెరువులు కన్పిస్తున్నాయి. వైసీపీ పాలనలో మంచినీటి చెరువులను పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో మంచినీటికి కటకటలాడే పరిస్థితిలు నెలకున్నాయి. నాగుపాలెం, పర్చూరు, ఉప్పుటూరు, చెరుకూరు, దేవరపల్లి, కొల్లావారిపాలెం, పెద్దివారిపాలెం తదితర గ్రామాల్లో పరిస్థితి దయనీయంగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రజలకు స్వచ్ఛమైన మంచి నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలి.

అలంకారప్రాయంగా ఆర్వో ప్లాంట్‌లు తరచూ మరమ్మతులు

మంచి నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు సక్రమంగా పనిచేయడం లేదు. చెరువుల్లో రంగుమారి, కలుషితంగా మారడంతో ఆర్వో ప్లాంట్లు మరమ్మతులకు గురవుతూ అలంకారప్రాయంగా ఎన్పిస్తున్నాయి.రోటరీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ సైతం తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి.

ప్రైవేటు వ్యాపారుల నీటి దోపిడీ

ప్రస్తుతం మండలంలో మంచినీటి చెరువులు అడుగంటడం, ఆర్వోప్లాంట్‌లు మూలపడడంతో ప్రైవేటు వ్యాపారులకు నీటి పంట పండింది. 20లీటర్ల నీటి క్యాను రూ.25, రూ.30అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఆ నీరు స్వచ్ఛమైనవా, కలుషితమైనవా అని తనిఖీ చేసే అధికారులు లేరు. కాసులకు కక్కుర్తిపడి ప్లాంట్‌లను పరిశీలించడం లేదన్న విమర్శలున్నాయి. దీంతో ప్రైవేటు వ్యాపారులు యథేచ్ఛగా నీటి దోపిడీకి పాల్పడుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



తూములను పరిశీలిస్తున్న రైతులు

అనధికార తూముల పరిశీలన

చినగంజాం, జూలై 11 : కొమ్మమూరు కాలువ నుంచి వెళ్లే పంట కాలువలో అనధికారికంగా వేసిన తూములను టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, నాయకులు విక్రం నారాయణలతో కలిసి గొనసపూడి, కడవకుదురు రైతులు గురువారం పరిశీలించారు. కొమ్మమూరు కాలువ సంతరావూరు లాకుల వద్ద నుంచి కడవకుదురు వాద పొలాల వరకు ఉన్న పంటకాలువ (సైడ్‌చానల్) ద్వారా మూడు వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. నీటి పారుదల శాఖ వారు ఈ పంట కాలువలో కొన్ని తూములను ఏర్పాటు చేసి ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నారు. పంట కాలువలో వేసిన తూముల ద్వారా వచ్చే సాగు నీటి ద్వారా రైతులు మూడు వేల ఎకరాలను సాగు చేస్తున్నారు.. పంట కాలువలో ఉన్న తూముల మధ్య కొంత మంది రైతులు అనధికారంగా కొన్ని తూములు ఏర్పాటు చేసుకొని సాగునీరు వినియోగించుకుంటున్నారు. దీని వలన దిగువ ఉన్న 1500 ఎకరాలకు సాగునీరు సక్రమంగా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను ఇరిగేషన్ శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వీరయ్య తెలిపారు. అధికారులు శుక్రవారం వచ్చి పంట కాలువను పరిశీలించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కడవకుదురు, గొనసపూడి రైతులు కేశన బాలయ్య, చల్లా వెంకటరావు, మదాసు ప్రసాద్, ఇందుర్తి వెంకటేశ్వర్లు, ఏకాంబరం పూర్ణచంద్రరావు, కేశన వెంకటరావు, కే.శేషు, తమ్మన శ్రీనివాసరావు, బత్తిన పున్నయ్య, ముద్దన జయచంద్రరావు, పరిటాల హనుమంతరావు, పట్టాభి వెంకటేశ్వర్లు, యడవల్లి పోతురాజు, రామిశెట్టి వెంకటేశ్వర్లు, కందిమళ్ళ ప్రసాద్, వంకాలపాటి అంజిబాబు పాల్గొన్నారు.

మొక్క విలువ తెలుసుకోవాలి



మొక్కలు చూపుతున్న విద్యార్థులు

అద్దంకిటౌన్, జూలై 11 : ప్రతి విద్యార్థి మొక్క విలువ తెలుసుకొని, వాటిని జాగ్రత్తగా పెంచి ఎంతో మందికి నీడనిచ్చేలా చేయాలని హెచ్‌ఎం సీహెచ్‌వీ శ్రీనివాస మూర్తి అన్నారు. గురువారం మండలంలోని బొమ్మనంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు కోవి శ్రీనివాసరావు పుట్టినరోజు సందర్భంగా పాఠశాలలోని విద్యార్థినీ విద్యార్థులందరికీ, ఉపాధ్యాయులకు రూ.10వేలతో 120 మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు శ్రీనివాసరావుకు హెచ్‌ఎంతో పాటు తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు మిత్రుడు నాగసూరి సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యజమాని అనుమతి లేకుండా కౌలు కార్డులివ్వాలి

కారంచేడు(పర్చూరు),జూలై 11: భూ అధీకరణ చట్టం ప్రకారం భూ యజమాని అనుమతి లేకుండా ప్రతి కౌలు రైతుకు కౌలు గుర్తింపు కార్డు ఇవ్వాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కారంచేడు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసంద్భంగా కౌలు రైతు సంఘ నాయకులు పి.ఏడుకొండలు మాట్లాడుతూ మండలంలో 80 శాతంకు పైగా భూమిని కౌలు రైతులే సాగు చేసుకుంటున్నారని ప్రభుత్వం ఇచ్చే రాయితీలు సాగుదారులకే చెందాలన్నారు. ఆరుగాలం సాగు చేసుకొని ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయి ప్రభుత్వ సాయం అందక కౌలు రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ, రెవెన్యూ అధ్వర్యంలో గ్రామ సభలు ఏర్పాటు చేసి సాగుచేసుకుంటున్న ప్రతి కౌలు రైతుకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో నాగేశ్వరరావు, రాజు, చేతివృత్తి సంఘ నాయకులు పి.కొండయ్య పాల్గొన్నారు.

ముక్తేశ్వరంలో చేతి పంపుల ఏర్పాటు

» పురాతన బావులను పరిశీలించిన అధికారుల బృందం
» పంచాయతీ నిధులతో గ్రామాల్లో పారిశుధ్య పనులు



ఎండిపోయిన బావులను పరిశీలిస్తున్న ఏఈ రామాంజనేయులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బల్లికురవ, జూలై 11 : ప్రజలకు ఎలాంటి నీటి ఇబ్బందులు రాకుండా తక్షణమే పంచాయతీ నిధులతో చేతి పంపులను ఏర్పాటు చేయిస్తామని మండల అర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామాంజనేయులు తెలిపారు. గురువారం ఆంధ్రజ్యోతిలో ముక్తేశ్వరంలో దాహం కేకలు అన్న కథనంపై అధికారులు స్పందించా రు. అర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామాజంనేయులు, పంచాయతీ కార్యదర్శి బాజీ పంచాయతీ సర్పంచ్‌తో కలిసి గ్రామంలో నీరు లేక ఒట్టిపోయిన బావులను పరిశీలించారు. ఈసందర్భంగా గ్రామస్థు లు కొందరు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, గృహాలలోకి మురుగు నీరు వస్తోందని, కాలువల్లో వ్యర్థాలను తీయడం లేదని, తాగునీరు లేదని పత్రికలో వార్తలు వస్తేగానీ మీకు తెలియలేదా అని కొందరు నిలదీశారు. ఈసందర్భంగా ఏఈ రామాంజనేయులు మాట్లాడుతూ వెంటనే ఎండిపోయిన బావుల దగ్గర చేతి పంపులను ఏర్పాటు చేయించాలన్నారు. అలానే పురాతన మహల్ బావి నీటిని వీధుల వెంట వచ్చేలా పైపు లైన్ మరమ్మతులు చేయిస్తామన్నారు. పంచాయతీ నిధులతో గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయించాలని సర్పంచ్‌కు సూచించారు. నీటి ఎద్దడి వలన ప్రజలు పడుతున్న ఇబ్బందులను చూశామని బావులలో కూడా పూడిక పనులు చేయిస్తామని తెలిపారు.



స్టూడెంట్ కిట్లను అందజేస్తున్న సీఎంవో

పిల్లలను బడిలో చేర్పించాలి

పర్చూరు, జూలై 11 : బడి ఈడు పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ (సీఎంవో) శ్రీనివాసరెడ్డి అన్నారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా గురువారం పర్చూరులోని ఇందిరా కాలనీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సీఎంవో, ఎఎల్ఎస్ కోర్డినేటర్ సత్యసాగర్ పాల్గొన్నారు. బడిబయట ఉన్న పిల్లలను 11 మందిని గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. అనంతరం వారికి స్టూడెంట్ కిట్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో పి.వెంకట్రామయ్య, హెచ్‌ఎం నాగమణి, ఎన్యుమరేటర్లు ఉమా మహేశ్వరరావు, సాయికుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థులు బడిలో చేరిక

యద్దనపూడి, (మార్టూరు) : నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా గురువారం యద్దనపూడి జడ్పీ హైస్కూల్‌లో ఇద్దరు విద్యార్థులు 8వ తరగతిలోకి ఎంఈవో చిలుకూరి గోపి ఆధ్వర్యంలో చేరారు. అనంతరం వారికి వెంటనే ప్రధానోపాధ్యాయులు దేవేంద్రరావు స్టూడెంట్ కిట్‌లను ఎంఈవో చేతులమీదగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు యూసఫ్, ప్రేమ్ కుమార్, మస్తానవలి పాల్గొన్నారు.

గంగవరంలో లక్ష్మీగణపతి హోమం

గంగవరం(ఇంకొల్లు), జూలై 11 : మండలంలోని గంగవరం గ్రామంలో లక్ష్మీగణపతి హోమాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. శివాలయ పునఃనిర్మాణంలో భాగంగా శివునికి అత్యంత ఇష్టమైన లక్ష్మీగణపతి హోమాన్ని కోటప్పకొండ త్రికోటేశ్వరాలయ అర్చకులు నాగబోగేంద్రశర్మ, రాజీవ్ శాస్త్రితో శివాలయ ఆవరణలో 21 మంది దంపతులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ హోమంలో గ్రామపెద్దలు, గ్రామస్థులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. హోమం అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.




అధ్యాపకుడిని అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

సెయింట్ ఆన్స్ అధ్యాపకుడికి అవార్డ్

చీరాల, జూలై 11 : సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఫార్మసీలో అధ్యాపకునిగా పనిచేస్తున్న గర్నిపూడి దిలీప్ కుమార్ జాతీయ స్థాయి అవార్డు పొందారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో ఏర్పాటు కార్యక్రమంలో సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్‌వీ రమణారావు, కళాశాల ప్రిన్సిపల్ వీవీ నాగేశ్వరరావు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ షోలాపూర్‌కు చెందిన ఆవిష్కార్ ఫౌండేషన్ వారు ప్రకటించిన ఎచీవర్స్ అవార్డు - 2024కు నేషనల్ లెవల్ బెస్ట్ యంగ్ టీచర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును దిలీప్‌కుమార్ పొందారన్నారు. ఫార్మసీ ఎడ్యుకేషన్, సైంటిఫిక్ రీసెర్చ్‌కు గాను ఆ అవార్డు అందకుమన్నారని వివరించారు. కార్యక్రమంలో పలు విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మురుగు నిల్వ ఉండకుండా చర్యలు

అద్దంకి, జూలై 11 : మురుగు నిల్వ ఉండకుండా అన్ని చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. అద్దంకి పట్టణంలోని 7 వ వార్డు పరిధిలోని గుర్రాల కాలనీ, మొండితోక పాలెం తదితర ప్రాంతాలలో గురువారం సిబ్బందితో కలిసి కమిషనర్ సత్యనారాయణ పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి ఉన్నారు.



7వ వార్డులో పరిశీలిస్తున్న కమిషనర్ సత్యనారాయణ

జనాభా పెరుగుదలపై అవగాహన అవసరం



అద్దంకిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

అద్దంకిటౌన్, జూలై 11 : జనాభా పెరుగుదల వలన ఉత్పన్నమయ్యే సమస్యలపై అవగాహన అవసమని ప్రిన్సిపాల్ డాక్టర్ వి. మోహనరావు అన్నారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా కేఆర్‌కే డిగ్రీ కళాశాల వద్ద రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డెంగ్యూ నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు హనుమంతరాజు, అశోక్‌కుమార్, రామకృష్ణ తదితరులు వ్యాధి లక్షణాలు, వాటి నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డీ గంగయ్య, గుంజి శివకోటి, రాజశేఖర్ తదితరులు జనాభా పెరుగుదల, వాటి వలన పకృతి వనరులపై ప్రభావం, జాతుల వలసలు, అతిక్రమణలు వంటి వాటి గురించి వివరించారు. ప్రధాన రహదారి వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి మానవహారం నిర్వహించారు.

ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా అద్దంకి ప్రభుత్వ వైద్యశాల నుంచి మోదేపల్లి పీహెచ్‌సీ, పట్టణంలోని గాజులపాలెం, కాకాని పాలెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని వైద్యధికారులు, ఆరోగ్య కార్యకర్తలతో అద్దంకి పట్టణంలోని ప్రధాన వీధులలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి ఆరోగ్య కార్యకర్తలు మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యధికారులు ఎన్.శ్రీహర్ష, జి. జయసింహ, హేమమాధురి, మనోజ్, హరికృష్ణ, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

చినగంజాం : ప్రతి ఒక్కరూ కుటుంబ నియంత్రణ పద్ధతులను పాటిస్తే అధిక జనాభాను అరికట్టవచ్చునని చినగంజాం, సంతరావూరు వైద్యాధికారులు ఎస్.విజయభాస్కరరావు, బి.నాగేంద్ర అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా సంతరావూరు, చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని సిబ్బంది, విద్యార్థులు గురువారం గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. బాల్య వివాహాలు చేయరాదని, వివాహానికి మగవారికి 24 సంవత్సరాలు, ఆడవారికి వయస్సు 21 సంవత్సరాలు ఉండాలని వైద్యాధికారులు సూచించారు. కార్యక్రమంలో చినగంజాం పీహెచ్‌సీ వైద్యాధికారి పీ.సాయిశ్రీచరణ్, సీహెచ్.ఎస్. జేబీ, హెల్త్ సూపర్‌వైజర్ చిరంజీవి, ఎంపీహెచ్‌ఈవో వెంకటరమణ, హెచ్‌ఈ మాధవి, హెల్త్ అసిస్టెంట్‌లు ఎస్.మురళి, మహేష్, జి.వి జయప్రసన్న, పీవీ.సుబ్బారావు, రాజకుమారి, ల్యాబ్ టెక్నీషియన్ శ్యామ్‌సుందర్‌బాబు, ఎంఎన్‌వో సుబ్బారావు, ఏఎన్‌ఎంలు, ఆశాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

యద్దనపూడి, (మార్టూరు) : ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం యద్దనపూడి ప్రభుత్వ ఆస్పత్రి వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టరు పీ శ్రీహర్ష ర్యాలీని ప్రారంభించి, ప్రతి ఒక్కరూ కుటుంబనియంత్రణ పాటించాలన్నారు. ర్యాలీలో సీహెచ్‌వో టీవీఎస్ ప్రసాద్, సూపర్‌వైజర్లు నాగేశ్వరరావు, సునంద, రారాజు, చంద్రశేఖర్, విమల, ఏఎన్‌ఎం, ఆశాలు పాల్గొన్నారు.

గుంటూరు : నాజ్ థియేటర్
గుంటూరు : హరిహరమహల్
గుంటూరు : గౌరీ శంకర్
గుంటూరు : శివ థియేటర్
గుంటూరు : సినీ స్క్వేర్
గుంటూరు : సినీ ప్రైమ్
గుంటూరు : వి.ప్లాటినో
గుంటూరు : ఫోనిక్స్ మాల్ (మైత్రీ)
గుంటూరు : ది సినిమాస్
గుంటూరు : జెఎల్‌ఇ సినిమాస్
ఒంగోలు : గోరంట్ల సినిమాస్
ఒంగోలు : రవి ప్రియమాల్
ఒంగోలు : సత్యం థియేటర్
తెనాలి : సంగమేశ్వర
తెనాలి : పెమ్మసాని
నరసరావుపేట : లక్ష్మి నరసింహ
నరసరావుపేట : ఈశ్వరమహల్
చిలకలూరిపేట : సాయి కార్తీక
చీరాల : సురేష్‌మహల్
బాపట్ల : శ్రీనివాసమహల్
పిడుగురాళ్ళ : గంగామహల్
పొన్నూరు : శ్రీలక్ష్మీ
మంగళగిరి : ఊర్వశి
మంగళగిరి : వెంకటేశ్వర
రేపల్లె : రాజ్యలక్ష్మి
మాచర్ల : వెంకటేశ్వర
సత్తెనపల్లి : సాయికృష్ణ
వినుకొండ : కీర్తి డీలక్స్
అద్దంకి : వి.ఎన్.ఎస్
టంగుటూరు : అప్సర
చీమకుర్తి : కె3కె సినిమాస్



ఎమ్మెల్యే కొండయ్యకు ఘన స్వాగతం



వైజాగ్‌లో ఊరేగింపుగా వెళ్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూలై 11 : చీరాల నియోజకవర్గం ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యకు గురువారం వైజాగ్‌లో ఘనస్వాగతం లభించింది. ఎమ్మెల్యేగా గెలుపొందిన తరువాత తొలిసారిగా వైజాగ్‌కు వెళ్లిన కొండయ్యకు ఎయిర్‌పోర్టు నుంచి అనుచరులు, శ్రేయోభిలాషులు, తమ వ్యాపార సంస్థల ప్రతినిధులు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. ఆర్‌కే టౌన్‌షిప్ అధినేతగా కొండయ్య ఆ ప్రాంత వాసులకు సుపరిచితులు. కార్యక్రమంలో కొండయ్య పెద్దకూమారుడు గౌరీఅమర్‌నాథ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ ఎంపీహెచ్‌ఈవోగా నాగేశ్వరరావు



వైద్యాధికారుల నుంచి అవార్డు అందుకుంటున్న నాగేశ్వరరావు

అద్దంకిటౌన్, జూలై 11 : ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉత్తమ అధికారులను ఎంపిక చేసి అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా అద్దంకిలోని మోదేపల్లి పీహెచ్‌సీ పరిధిలో ఆరోగ్య విస్తరణాధికారి (ఎంపీహెచ్‌ఈవో)గా పని చేస్తున్న అద్దంకి నాగేశ్వరరావుకు ఉత్తమ ఆరోగ్య విస్తరణాధికారిగా అవార్డును జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ అందజేశారు. ఎంపీహెచ్‌వో నాగేశ్వరరావును వైద్యధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులు

వేటపాలెం(చీరాల), జూలై 11 : పందిళ్లపల్లి హైస్కూల్లో 2023-24 విద్యా సంవత్సరంలో పదవతరగతి చదివిన ఐదుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన నట్లు స్కూల్ హెచ్‌ఎం ఎం.శేఖరరావు గురువారం తెలిపారు. ములకల శ్యామల, కోనంకి భార్గవ్‌లు నూజివీడు ట్రిపుల్ ఐటీలోను, వంగర రోహిణి, ఆశోది హర్ష, సజ్జ శివసాయిశ్రావణ్ ఒంగోలు ట్రిపుల్ ఐటీలోను సీట్లు సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులను అధ్యాపకులు, సహ విద్యార్థులు అభినందించారు.

మార్టూరు : మండలంలోని వలపర్ల, మార్టూరు జడ్పీ హైస్కూల్స్‌లో 10వతరగతి చదివిన 10 మంది విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో సీట్లు లభించాయి. వలపర్ల జడ్పీ హైస్కూల్‌లో 8 మంది విద్యార్థులకు సీట్లు లభించినట్లు గురువారం హెచ్‌ఎం ఎం.నిర్మల తెలిపారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ, ఒంగోలు ట్రిపుల్ ఐటీలో, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో లభించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. మార్టూరు జడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులకు నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీట్లు లభించినట్లు హెచ్‌ఎం బీ రూత్‌మేర్సీజాయ్ తెలిపారు. వారిద్దరినీ ఉపాధ్యాయులు అభినందించారు.

మేదరమెట్ల : కొరిశపాడు మండలంలోని రావినూతల, మేదరమెట్ల హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. గురువారం వెలువడిన ఫలితాలల్లో ముగ్గురు విద్యార్థులు ఒంగోలు, ట్రిపుల్ ఐటీ నూజివీడులో సీట్లు సాధించారు. రావినూతల జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన పొదిలి లలిత శ్రీ ఒంగోలు ట్రిపుల్ ఐటీలో, మేదరమెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కుంచాల మనీష ఒంగోలు ట్రిపుల్ ఐటీలో, ఉన్నం ఉమామహేశ్వరి నూజివీడులో సీట్లు సాధించినట్లు ఎంఈవో పున్నయ్య తెలిపారు. ఏటా కొరిశపాడు మండలం నుంచి ట్రిపుల్ ఐటీకి ఎంపిక అవుతున్నట్లు ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఎంఈవో పున్నయ్య, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

నేడు ప్రతిభ విద్యార్థులకు ఉపకారవేతనాలు

పంగులూరు, జూలై 11 : విద్యోన్నతి ఫౌండేషన్ నిర్వహించిన పోటీ పరీక్షలో ప్రతిభ చాటిన విద్యార్థులకు శుక్రవారం ఉపకార వేతనాలను అందజేయనున్నట్లు ఫౌండేషన్ డైరెక్టర్ ధూళిపాళ్ల వీరనారాయణ గురువారం ప్రకటనలో తెలిపారు. ధూళిపాళ్ల వెంకటేశ్వర్లు, బోడెంపూడి రామమూర్తి స్మారకార్థం ఏర్పాటు చేసిన ఈ ఫౌండేషన్ ద్వారా ఈ ఏడాది ఫిబ్రవరి 11న పంగులూరు, అద్దంకి, ఇంకొల్లు మండలాల పరిధిలో 10వ తరగతి విద్యార్థులకు మూడు కేంద్రాలలో టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించామన్నారు. ఈ కేంద్రాలలో పోటీ పరీక్షలో పాల్గొన్న విద్యార్థులలో మూడు మండలాలలో మొదటి ఐదు స్థానాలు పొందిన 15 మందితో పాటు గత ఏడాది ఎంపికైన 15 మందికి 2024-26లో ఇంటర్ చదువుకు వీలుగా 30 మందికి మూడు లక్షలు ఉపకారవేతనంగా అందచేస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ ధూళిపాళ్ల షర్మిల ప్రియాంక సౌజన్యంతో అద్దంకిలోని కాకానిపాలెం జడ్పీ పాఠశాలలో శుక్రవారం ఉపకార వేతనాలను అందజేస్తున్నట్లు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

చీరాల, జూలై 11 : వాసవీ క్లబ్, వాసవీ వనిత ఆధ్వర్యంలో గురువారం క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రవిచంద్ర దంపతులు పెళ్లిరోజు సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు వల్లంపట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించామన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైనవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రార్థించే పెదవులకన్నా.. సేవచేసే చేతులు మిన్న



శుభాకాంక్షలు తెలుపుతున్న చిన్నారులు

చీరాల, జూలై 11 : ప్రార్థించే పెదవులకన్నా.. సేవచేసే చేతులు మిన్న అని హైదరాబాద్ పీపుల్ విత్ హియరింగ్ ఇంపైర్ నెట్‌వర్క్(పీహెచ్‌ఐఎన్) స్కూలు ప్రతినిధులు పేర్కొన్నారు. చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య మనుమడు, మహేంద్రనాథ్ కుమారుడు రీహన్స్ పుట్టిన రోజు సందర్భంగా సదురు స్కూల్లో గురువారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా స్కూలు నిర్వాహకులు, విద్యార్థులకు రీహన్సకు, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.


పమిడిపాడు రేషన్‌షాప్‌లో తనిఖీ

మేదరమెట్ల , జూలై 11 : మండలంలోని పమిడిపాడులో 21వ నెంబరు రేషన్ దుకాణంపై విజిలెన్స్ డీటీ సుధారాణి షాపును తనిఖీ చేశారు. ఉండాల్సిన నిల్వ కన్న 21 కింటాళ్ల బియ్యం అదనంగా ఉండడంతో 6ఏ కేసు నమోదు చేశారు. అదనంగా ఉన్న బియ్యాన్ని వీఆర్‌వో మస్తాన్‌రావుకు అప్పగించారు.



తనిఖీ చేస్తున్న విజిలెన్స్ డీటీ సుధారాణి

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
జిల్లా వార్తలు
శుక్రవారం 12 జూలై 2024




ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాల జాబితా విడుదల

నెల్లూరు (విద్య) : ఏపీలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ప్రవేశాలకు ఎంపికైన అభ్యర్థుల ప్రొవిజనల్ జాబితాలను గురువారం అధికారులు విడుదల చేశారు. ఎంపికైన విద్యార్థులకు నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళంలోని ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. నూజివీడు, ఇడుపులపాయలలో ఈ నెల 22, 23వ తేదీల్లో, ఒంగోలులో 24, 25వ తేదీల్లో, శ్రీకాకుళంలో 26, 27వ తేదీల్లో సర్టిఫికెట్లు పరిశీలన ఉంటుంది. జిల్లా నుంచి నూజివీడుకు 61 మంది, ఇడుపులపాయకు 89 మంది, ఒంగోలుకు 41 మంది, శ్రీకాకుళంకు 27 మంది కలిపి మొత్తం 218 మంది ఎంపికయ్యారు.

గంజాయ్ విత్ ఎంజాయ్!

- 20, 50 గ్రాముల పొట్లాలలో అమ్మకాలు
- సేల్స్‌మెన్ ద్వారా విస్తృతంగా విక్రయాలు
- బార్లు, మద్యం దుకాణాలు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, విద్యాసంస్థలే టార్గెట్
- గంజాయి మత్తులో పెరుగుతున్న నేరాలు
- నియంత్రణలో చేతులెత్తేస్తున్న నిఘా వ్యవస్థ

- గంజాయి మత్తులో చిక్కుకుంటున్న యువత
- విశాఖ ప్రాంతం నుంచి జిల్లాకు దిగుమతి
- కిలో రూ.5వేలకు కొనుగోలు.. రూ.15వేలకుపైగా ఆర్జన



నెల్లూరు (క్రైం), జూలై 11 : యువత, విద్యార్థుల జీవితాల్లో గంజాయి విషవృక్షంలా మారుతోంది. స్మగ్లర్లు కూడా వారినే టార్గెట్ చేసుకుని వ్యాపార లావాదేవీలు సాగిస్తున్నారు. ఇటీవల కాలంలో జరుగుతున్న హత్యలు, ఘర్షణలు, హత్యాయత్నాలు ఇలా ఎన్నో ఘటనలు గంజాయి మత్తులోనే జరుగుతున్నాయని పోలీసుల విచారణలో తేలింది. గతంలో చిన్నబజారు పోలీసులు డ్రగ్ ర్యాకెట్ వెలుగులోకి తెచ్చి, వారే విద్యార్థులకు డ్రగ్స్‌ను విక్రయిస్తున్నట్లు తేల్చారు. జిల్లాలోని కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, మెడికల్ విద్యార్థులే ఎక్కువగా మత్తుకు బానిసలు అవుతున్నారు. తమ విద్యాసంస్థకు చెడ్డపేరు వస్తుందనే నేపంతో కళాశాల యాజమాన్యాలు కూడా గుట్టుచప్పుడుగా వ్యవహరిస్తున్నాయి. కేవలం తల్లిదండ్రులకు విషయం తెలియజేసి, మిన్నకుండిపోతున్నారు.

● బానిసలుగా మారుతూ..

ఇంటర్ చదువుతున్న సమయంలో స్నేహితులు, క్లాస్‌మెట్స్ క్రీడల్లో పరిచయమయ్యే వ్యక్తుల ద్వారా విద్యార్థులు మత్తుకు అలవాటు పడుతున్నారు.



విద్యార్థుల కోసమే అన్నట్టుగా విక్రయదారులు 50, 100 గ్రాముల చొప్పున ప్యాకెట్లు చేసి రూ.200 నుంచి 300 వరకు ఒక్కో ప్యాకెట్‌ను విక్రయిస్తున్నారు. సిగరెట్లలో గంజాయి పొడిని కలుపుకొని పీలుస్తూ దానికి బానిసగా మారుతున్నారు. ఇక అక్కడ నుంచి మత్తు పదార్థాలైన ఎల్ఎస్‌డీ, ఎండీఎంఏ, బ్రౌన్‌షుగర్, హెరాయిన్ వంటి వాటి రుచి చూసేందుకు ఇతర రాష్ట్రాల వైపు అడుగులు వేస్తున్నారు.

● నిఘా ఏమైనట్టు!?

చాపకిందనీరులా గంజాయి వ్యాపారం గుప్పుమంటున్నా పోలీసుల్లో మాత్రం చలనం కరువయ్యింది. గంజాయిపై ఉక్కుపాదం మోపాల్సిన సెబ్ లంచాల మత్తులో కూరుకుపోయారని ఆరోపణలు ఉన్నాయి. ఇక ఆర్టీసీ విజిలెన్స్, రైల్వే పోలీసులు మామూళ్ల మత్తులో ఉన్నారన్న విమర్శలూ లేకపోలేదు. జిల్లా వ్యాప్తంగా గంజాయి మత్తును నియంత్రించడంలో సివిల్ పోలీసులు మాత్రం అప్పుడప్పుడు జూలు విదిలిస్తున్నా ఆశించిన ఫలితాలు ఉండటం లేదు.

మైదానంలో సిగరెట్లు తాగుతున్న కొంతమంది యువకుల వద్దకు ఓ అజ్ఞాత వ్యక్తి చేరి, వారితో మాటలు కలిపాడు.

అజ్ఞాత వ్యక్తి : ఆ సిగరెట్టు పేరేమి!?

యువత : ఇది..... ఉన్న వాటిలో ఇదే కాస్ట్‌లీ.

అజ్ఞాత వ్యక్తి : అవునా!? కిక్కు వస్తుందా!

యువత : పర్వాలేదు. తాగుతున్నాం.

అజ్ఞాత వ్యక్తి : మీకు మంచి కిక్కు కావాలంటే. ఇదిగో ఈ పొట్లంలో ఉండే పదార్థాన్ని సిగరెట్‌లో కలుపుకొని తాగండి. ఆ మజానే వేరుగా ఉంటుంది.

యువత : ఏంటన్నా ఇది. ఆరోగ్యం పాడవదుగా.

అజ్ఞాత వ్యక్తి : అయ్యో తమ్ముళ్లు. నేను ఇక్కడే ఉంటాను కదా. ఓసారి ట్రై చేయండి. వచ్చే కిక్కును చూసి మీరే అడుగుతారు.

ఇంకేముంది. ఇలా రెండుసార్లు ఉచితంగా ఇచ్చిన ఆ అజ్ఞాత వ్యక్తి మూడోసారి రూ.100, ఆ తర్వాత 200-300 చొప్పున విక్రయించాడు. మత్తుకు అలవాటుపడ్డ యువకులు కూడా ఆ డబ్బు ఇచ్చేందుకూ వెనుకాడలేదు.



మూణ్నెళ్ల క్రితం వరకూ బాగా చదువుతున్న కుమారుడిలో మార్పును తల్లిదండ్రులు గమనించారు. ప్రతి చిన్న విషయానికి చిరాకు పడటం, ఏ చిన్నపని చేసినా అలసిపోవడం, ఇంట్లో వస్తువులను నేలకేసి కొట్టడం, నిద్రలేకుండా తిరగడం వంటివి గమనించి కుమిలిపోయారు. వెంటనే వైద్యుడ్ని సంప్రదించగా, 'మత్తు'కు అలవాటు పడినట్టు తేలింది.

● సేల్స్‌మెన్‌తో విస్తరణ

గంజాయి వ్యాపారులు కొత్త పంథాను ప్రారంభించారు. విశాఖ, నర్సీపట్నం, ఏఓబీ సరిహద్దు ప్రాంతాల నుంచి గంజాయిని సేకరిస్తున్నారు. ఆ తర్వాత పోలీసుల కంట పడకుండా రైళ్లు, బస్సులు మారుతూ ఎంతో చాకచక్యంగా గంజాయిని జిల్లాకు తరలిస్తున్నారు. జిల్లాకు చెందిన కొందరు వ్యాపారులు కిలో రూ.5 వేలకు గంజాయిని కొనుగోలు చేసుకుంటున్నారు. ఆ తర్వాత కిందిస్థాయి వ్యాపారులకు కిలో రూ.8 వేల నుంచి 10 వేల వరకు విక్రయిస్తున్నారు. గతంలో వీరు 20, 50 గ్రాముల చొప్పున ప్యాకెట్లు చేసి విక్రయించే వారు. అయితే వారి వ్యాపారశైలి పూర్తిగా మారిపోయింది. ఇలా అమ్మకాల ద్వారా కిలోకు రూ.15 వేలకుపైగా అధిక ఆదాయం పొందుతున్నారు. యువత, విద్యార్థులను టార్గెట్‌గా చేసుకుని వ్యాపారాన్ని విస్తరిస్తున్నారు. కొందరు సేల్స్‌మెన్‌ను నియమించుకుని కమీషన్‌తోపాటు నెలవారి జీతాలు ఇస్తున్నారు. వీరు చేయవలసిందల్లా కళాశాలలు, పాఠశాలలు, రైల్వేస్టేషన్లు, ఆర్టీసీ బస్టాండ్లు, సినిమా థియేటర్లు, కేఫ్‌లు, బార్లు, మద్యం దుకాణాలు, క్రీడామైదానాలను టార్గెట్ చేసుకుంటారు. ఆ ప్రాంతాల్లో సిగిరెట్లు, మద్యం సేవించే వారిని గుర్తిస్తారు. వారి వద్దకు వెళ్లి 'ఇదేం మత్తు గంజాయి ఓసారి పీల్చండి ఈ మత్తు చూడండి.' అంటూ ఉచితంగా ఇచ్చి అలవాటు చేస్తారు. మెల్లమెల్లగా మత్తుకు బానిసలు చేసి గంజాయిని అధిక ధరకు విక్రయిస్తారు.



చిన్న చిన్న ప్యాకెట్లలో ఉన్న గంజాయి. వీటినే నెల్లూరులో ఇటీవల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

● ఈ లక్షణాలు ఉంటే..

గంజాయి ఇతర మత్తు పదార్థాలకు బానిసలైన విద్యార్థుల లక్షణాలను వైద్యులు తెలిపారు.

- మత్తుకు అలవాటు పడిన తర్వాత గతంలోలా వ్యవహార శైలి ఉండదు.
- ఇళ్లకు వచ్చిన వెంటనే కళ్లు ఎర్రగా అలిసిపోయినట్లు ఉండటం, ఎక్కువగా చిరాకు పడటం.
- కోపం ఎక్కువ రావడం, తమపై వారు నియంత్రణ కోల్పోవడం, చేతికి ఏది దొరికితే వాటితో వస్తువులు పగల గొట్టడం.
- సరిగా నిద్రపోకపోవడం, ఎప్పుడు పడితే అప్పుడు ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోవడం వంటి లక్షణాలు ఉంటే తల్లిదండ్రులు జాగ్రత్తపడాలని సూచిస్తున్నారు.



ఎంతో మందికి కౌన్సిలింగ్ ఇచ్చా

గంజాయికి బానిసలైన ఎంతోమంది యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చా. మత్తుకు బానిసైన వారు వారిపై వారికి నియంత్రణ ఉండదు. మత్తుకు బానిస అయినవారిని ఒక్కసారిగా నియంత్రించేందుకు ప్రయత్నించకూడదు. గంజాయి, మద్యంకు ఎలా అలవాటు పడ్డారో కౌన్సెలింగ్ ఇవ్వాలి.

- డాక్టర్ సురేష్‌బాబు, మానసిక వైద్యనిపుణులు





నర్రవాడలో భక్తజనం

- వైభవంగా వెంగమాంబ 16 రోజుల ఉత్సవం

హోమగుండంలో కొబ్బరి వేస్తున్న భక్తులు, వెంగమాంబ దంపతులు (ఇన్‌సెట్‌లో)

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), జూలై 11 : నర్రవాడలో వెలసి ఉన్న శ్రీ వెంగమాంబ పేరంటాలమ్మ అమ్మవారి పదహారు రోజుల ఉత్సవాన్ని గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో కల్యాణోత్సవం అనంతరం పదహార రోజుల తరువాత వచ్చే మొదటి గురువారం రోజున ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఉదయం ఆరు గంటల నుంచే క్యూలైన్లు నిండిపోయాయి. ఎడ్లబండ్లను ప్రత్యేకంగా అలంకరించుకుని ఉత్సవానికి తరలివచ్చారు. అమ్మవారికి పొంగళ్ల నైవేద్యం సమర్పించి, హోమగుండం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ కొబ్బరి వేసి మొక్కులు తీర్చుకొన్నారు. ఆలయ ప్రధాన వ్యవస్థాపక ధర్మకర్త వెంకటసురేష్‌బాబు, మాజీ ఛైర్మన్ పచ్చవ కరుణాకర్‌బాబు, ఆలయ ఈవో ఉషశ్రీలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉదయగిరి, కలిగిరి సీఐలు వేల్పుల గిరిబాబు, ఫిరోజ్, ఎస్ఐలు ఉమాశంకర్, ఇంద్రసేనారెడ్డిలు తమ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.



నెల్లూరులోని రైతుబజారులో రాయితీ సరుకుల కౌంటర్‌ను ప్రారంభిస్తున్న డీఎస్వో రమణ

రాయితీ ధరకు కందిపప్పు, బియ్యం

రైతుబజార్లలో విక్రయాలు

నెల్లూరు (హరనాథపురం) : రిటైల్ మార్కెట్‌లో కందిపప్పు, బియ్యం ధరలు ఆకాశాన్ని అంటుతున్న తరుణంలో వినియోగదారులకు కొంతమేర ఉపశమనాన్ని కలిగించేందుకు పౌరసరఫరాల శాఖ చర్యలు తీసుకుంది. జిల్లాలోని రైస్ మిల్లర్లు, దాల్ మిల్లర్లతో అధికారులు చర్చలు జరిపారు. రైతు బజార్లలో రాయితీ ధరపై కంది పప్పు, బియ్యం అందుబాటులోకి తెచ్చారు. ప్రత్యేక కౌంటర్లలో కందిపప్పు కిలో రూ.160కి (బహిరంగ మార్కెట్‌లో రూ.181), నాణ్యమైన స్టీమ్ బియ్యం (బీపీటీ రకం) రూ.49, రా బియ్యం రూ.48లకు వంతున విక్రయించనున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కిలో స్టీమ్ బియ్యం రూ.55.85, రా బియ్యం రూ.52.40 ఉంది. ఈ మేరకు నగరంలోని నవాబుపేట, పప్పులవీధి రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్‌లను జిల్లా పౌరసరఫరాల అధికారి రమణ, కందుకూరులో సబ్ కలెక్టర్ విద్యాధరి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్వో రమణ మాట్లాడుతూ శుక్రవారం నెల్లూరులోని పత్తేఖాన్‌పేట, పొదలకూరు రైతుబజార్లలో కౌంటర్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆర్డీవో మలోల, జిల్లా రైసు మిల్లర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రంగయ్య నాయుడు పాల్గొన్నారు.

నీలకంఠేశ్వరుడి భూముల్లో దొంగలు పడ్డారు!

అధికారులు, అక్రమార్కులు కలిసి నీలకంఠుడికే శఠగోపం పెట్టారు. ఆలయ భూముల్లో ఇష్టానుసారం తవ్వకాలు జరిపి విలువైన ప్రకృతి సంపదను కొల్లగొట్టారు. గడిచిన నాలుగేళ్లలో రూ.25కోట్ల విలువైన గ్రావెల్, గులకరాళ్లను అమ్మి సొమ్ము చేసుకున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ఏడాది క్రితం అప్పటి కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి ఫిర్యాదు చేసినా దేవదాయ శాఖ అధికారులు పట్టించుకోలేదు. పైగా తూతూమంత్రపు తనిఖీలతో అందరినీ మభ్యపెట్టారు.

- కొండబీడు భూముల్లో అక్రమ మైనింగ్
- 2021 నుంచి విచ్చలవిడిగా తవ్వకాలు
- లీజు అగ్రిమెంట్ లేకుండా గ్రావెల్ స్టోన్ దోపిడీ
- దేవదాయ శాఖకు ఫిర్యాదు చేసిన అప్పటి ఎమ్మెల్యే
- ఇప్పటిదాకా రూ.25 కోట్ల ప్రకృతి సంపద ఆవిరైనట్టు అంచనా?
- అధికారుల ఉదాసీనతపై విమర్శల వెల్లువ





గ్రావెల్ నుంచి స్టోన్స్ వేరు చేస్తున్న యంత్రం

ఉలవపాడు, జూలై 11 : ఉలవపాడులోని శ్రీ నీలకంఠేశ్వర స్వామి ఆలయానికి చెందిన మాన్యం కొండబీడు భూముల్లో అక్రమ మైనింగ్ జరుగుతోంది. నాలుగేళ్లుగా ఈ తంతు జరుగుతున్నా దేవస్థానం అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరించడం పలు సందేహాలకు తావిస్తోంది. ఉలవపాడు, కరేడు, మన్నేటికోట, ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలంలోని శానంపూడి గ్రామాలలో నీలకంఠేశ్వర ఆలయానికి చెందిన సుమారు 85 ఎకరాల భూమి దేవదాయ శాఖ ఆధీనంలో ఉంది. శానంపూడిలోని సర్వే నెం.519లో 30.05 ఎకరాల కొండ బీడు, మరో 40 ఎకరాల సాగు భూమి ఉంది. కొండ బీడు భూముల్లో గులకరాళ్లు, ఎర్రమట్టి మిశితమై ఉంటుంది. సాగుకు అనుకూలత లేకపోవడంతో ఈ భూములవైపు ఎవరూ కన్నెత్తి చూడలేదు. కాగా, ఆలయ భూములు అనుకొని ఉన్న సర్వే నెం.519/2లో 1.121 హెక్టార్ల భూమిని పొరుగు జిల్లాకు చెందిన ఓ వ్యక్తికి గ్రావెల్ స్టోన్ క్వారీ నడుపుకునేందుకు సింగరాయకొండకు చెందిన రెవెన్యూ అధికారులు 2021లో లీజుకు ఇచ్చారు. అయితే, పక్కనే ఉన్న దేవుడి మాన్యంపై కన్నేసిన సదరు వ్యక్తి దేవదాయ శాఖ అధికారుల అండతో గ్రావెల్ తవ్వకాలు మొదలు పెట్టారు. ఈ భూముల్లో లభించే గ్రావెల్‌ను జల్లెడ యంత్రాల ద్వారా రాళ్లను గ్రేడింగ్ చేసి విక్రయిస్తున్నారు. వ్యవసాయ భూముల్లో బోర్లు కేసింగ్ పూడికకు, చేపలు, రొయ్యలు చెరువుల కట్టల లీకేజీని అరికట్టేందుకు, రహదారుల నిర్మాణానికి ఈ తరహా రాళ్లకు మంచి గిరాకీ ఉంది.

● గ్రామస్థుల్లో మొదలైన అలజడి

తమ గ్రామానికి ఆనుకొని ఉన్న కొండపోరంబోకు భూమిలో అంత ఆదాయం వచ్చే సంపద ఉందా అని గ్రామస్థులే ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. క్వారీలో జరుగుతున్న హంగామా, అక్రమ సంపాదన చూసిన గ్రామస్థులు రెవెన్యూ, దేవదాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై భారీగా దుమారం రేగడంతో ఉలవపాడు దేవదాయ శాఖ అధికారులు ఆ భూములు ప్రైవేటు వ్యక్తులకు చెందినవంటూ బుకాయిస్తూ వచ్చారు. చివరికి అప్పటి కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి చొరవతో ప్రకాశం జిల్లా మైనింగ్ అధికారులు 2022లో దాడులు చేసి ఓ ఎక్స్‌కవేటర్, తవ్విన గ్రావెల్ స్టోన్‌పై సుమారు రూ.2 లక్షలు పెనాల్టీ కట్టించారు. నీలకంఠేశ్వర స్వామి దేవుడి మాన్యంలోని సుమారు 10 ఎకరాల్లో అక్రమ మైనింగ్ చేసి ఎకరాకి సుమారు రూ.కోటి విలువైన సంపదను దోచుకున్నాడని, అక్రమార్కులకు రెవెన్యూ, ఎండోమెంట్ అధికారులు సహకరించినట్లు తన ఫిర్యాదులో అప్పటి ఎమ్మెల్యే పేర్కొనడం గమనార్హం. అయితే రోజులు గడుస్తున్నా అధికారుల్లో మాత్రం చలనం ఉండటంలేదు. అక్రమ సంపద ఆవిరవుతున్నట్టు కళ్లకు కట్టినట్టు కనిపిస్తున్నా దేవదాయ శాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి ఆరోపించిట్లు సుమారు రూ.25 కోట్ల దోపిడీ జరిగిందని అందులో అధికారులు, మధ్యవర్తులకు తప్ప ఆలయ అభివృద్ధికి ఒక్క పైసా కూడా దక్కలేదు. గత నెలలో దేవదాయ శాఖ అధికారులు క్వారీ ప్రాంతాన్ని పరిశీలించినా అక్రమార్కుల పై చర్యలు తీసుకున్న పాపానపోలేదు. నీలకంఠేశ్వరుడి ఆలయ ఈవో ప్రసాద్‌ను వివరణ కోరగా వచ్చిన ఫిర్యాదులపై పరిశీలించి, రూ.40వేలు పెనాల్టీ వేసినట్లు చెప్పుకొచ్చారు. అయితే, క్రిమినల్ కేసు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించగా మాట దాటవేశారు.

ఆరోగ్యశ్రీ వైద్యసేవల్లో జీజీహెచ్‌కు 3వ స్థానం



ఆరోగ్యశ్రీ చికిత్సలు ఇలా..

సంవత్సరం	వైద్యసేవలు
2021	5585
2022	4646
2023	10,247
2024 (జూన్ వరకు)	5624

నెల్లూరు (వైద్యం), జూలై 11 : ఆరోగ్యశ్రీ వైద్య చికిత్సలలో నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్) వైద్యులు ప్రతిభ చూపుతున్నారు. ఇచ్చిన లక్ష్యానికి మించి వైద్యసేవలు అందిస్తున్నారు. గత నెలలో 940 ఆరోగ్యశ్రీ కింద వైద్య చికిత్సలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. అయితే, జీజీహెచ్ వైద్యులు లక్ష్యానికి మించి 1,149 వైద్యసేవలు (127 శాతం) అందించారు. జనరల్ మెడిసిన్ కింద 511, జనరల్ సర్జరీ 154, గర్భకోశ విభాగంలో 135, ఆర్థోపెడిక్ విభాగంలో 72, మిగిలిన విభాగాల్లో 277 వైద్య చికిత్సలు జరిగాయి. ఒక నెలలోనే అత్యధిక వైద్యచికిత్సలు అందించినందుకు రాష్ట్రంలోనే జీజీహెచ్ మూడో స్థానంలో నిలిచింది. మొదటి రెండు స్థానాలను విశాఖలోని ప్రభుత్వ ఆసుపత్రులకే దక్కాయి. మొత్తంగా నెల్లూరు జీజీహెచ్‌లో ఈ ఏడాది జూన్ వరకు అంటే 6 నెలల్లోనే 5,624 చికిత్సలు అందించారు. అత్యుత్తమ వైద్యసేవలు అందిస్తున్న జీజీహెచ్ వైద్యులకు ఆరోగ్యశ్రీ చికిత్సలపై డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ప్రసంశలు అందించింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆరోగ్యశ్రీ వైద్యసేవలపై జీజీహెచ్ అధికారులకు ప్రోత్సాహక ఆదేశాలు జారీ చేసింది. కాగా, ఆరోగ్యశ్రీ వైద్యసేవలకు సంబంధించి ప్రభుత్వం అందించే నగదులో 30 శాతం వైద్యులకు, సిబ్బందికి వస్తుంది. ఇందులో వైద్యులకు ప్రత్యేకంగా 17 శాతం అందిస్తారు. ఇక మోర్క్ అనే ప్రభుత్వ సంస్థకు 45 శాతం ఇస్తుండగా, ఆసుపత్రి అభివృద్ధికి 25 శాతం ఆరోగ్యశ్రీ నిధులు చేకూరనున్నాయి. గతంలో ఆరోగ్యశ్రీ చికిత్సలలో రాష్ట్రంలో ఉన్న 23 ప్రభుత్వ వైద్య కళాశాలల్లోనే 10 స్థానంలో నెల్లూరు జీజీహెచ్ నిలిచేదని సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్ తెలిపారు. లక్ష్యాలను అధికమించి 3వ స్థానంలో నిలవడం సంతోషంగా ఉందన్నారు. త్వరలోనే మొదటి స్థానంలో నిలిచేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

రైతుబజార్లలో అందుబాటు ధరలకు నిత్యావసరాలు

● పంపిణీని ప్రారంభించిన ఎమ్మెల్యే, సబ్ కలెక్టరు

కందుకూరు, జూలై 11: ప్రజలకు అందుబాటు ధరలో నిత్యావసర సరుకులు అందించేలా రైతుబజారులో నిత్యావసరాల విక్రయకేంద్రాన్ని గురువారం సాయంత్రం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. కందుకూరు సబ్ కలెక్టరు జి విద్యాధరితో కలిసి ఆయన పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లో నిత్యావసర వస్తువుల ధరలు రోజు రోజుకు పెరుగుతున్నందున సామాన్యులకు అందుబాటు ధరల్లో అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బహిరంగ మార్కెట్లో కందిపప్పు కిలో రూ. 181 రూపాయలు ధర పలుకుతుండగా ఇక్కడ కేవలం 160 రూపాయలకే వినియోగదారులకు అందించేలా చర్యలు తీసుకున్నామని, అలాగే బియ్యం కిలో రూ. 55కి పైనే ఉన్నందున ఈ కేంద్రంలో 49 రూపాయలకే అందించనున్నట్లు వివరించారు. స్టీమ్డ్ బియ్యం కిలో రూ. 49కి, పచ్చిబియ్యం రూ. 48కి వినియోగదారులు పొందవచ్చునన్నారు. అత్యంత నాణ్యమైన సరుకులు ఈ కేంద్రాలలో అందుబాటులో ఉంటాయని, భవిష్యత్తులో ఇతరత్రా అవసరమైన నిత్యావసర వస్తువులను కూడా ఇక్కడ అందుబాటులో ఉంచటం జరుగుతుందని వివరించారు. ఈ సందర్భంగా రైతుబజారులో ఆయన షాపులన్నింటినీ పరిశీలించారు. పరిశుభ్రంగా నిర్వహించకపోవటం పట్ల ఎస్టేట్ అధికారి పద్మనాభంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పరిస్థితిని మెరుగుపరచాలని లేకుంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అంతకుముందు ఎమ్మెల్యే నాగేశ్వరరావునును రైతుబజారులోని రైతులు, వ్యాపారులు ఘనంగా స్వాగతించారు. కార్యక్రమంలో తహసిల్దార్ చంద్రారెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కె చెంచురామయ్య, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



రైతుబజారులో నిత్యావసరాల పంపిణీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సబ్ కలెక్టరు విద్యాధరి

నారా లోకేష్‌ను కలసిన కమ్మ ప్రభాకర్


నారా లోకేష్‌తో ప్రభాకర్‌నాయుడు

అనంతసాగరం, జూలై 11: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్యాశాఖమంత్రి నారా లోకేష్‌ను అనంత సాగరంవాసి పార్లమెంటు తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కమ్మ ప్రభాకర్‌నాయుడు గురువారం ఉండవల్లిలో కలిశారు. ఈ సందర్భంగా అనంతసాగరం మంలంలోని ప్రధాన సమస్యలను ఆయనకు వివరించి పరిష్కరించాలని కోరారు.

వ్యవసాయ కార్యాలయం పరిశీలన

అల్లూరు, జూలై 11: స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో అధికారులను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ జేడీ సత్యవాణి తెలిపారు. అధికారులు అందుబాటులో ఉండడం లేదంటూ స్థానిక రైతుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు గురువారం ఆమె వ్యవసాయ కార్యాలయాన్ని పరిశీలించి మాట్లాడారు. రైతులకు అవసరమైన జిప్సం, జింక్ అందుబాటులో ఉంచేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో ఏడీఏ నాగరాజు, సిబ్బంది రామకృష్ణ, రైతులు మేడా నిరంజన్‌రెడ్డి, కృష్ణచైతన్య పాల్గొన్నారు.

సచివాలయానికి చిత్రపటాల బహూకరణ

కలిగిరి, జూలై 11: నాగసముద్రం గ్రామ సచివాలయానికి బుధవారం టీడీపీ నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చిత్రపటాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ చీమల తాతయ్య, బాపతి చినమాలకొండయ్య, అంబటి శంకరయ్య, నరసాల మాల్యాద్రి పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌కు డార్మెంటరీ నిర్మాణం

అనంతసాగరం, జూలై 11: రేవూరు బీసీ బాలికల వసతి గృహంలో గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ బోయళ్ల జనార్ధన్‌రెడ్డి తన సతీమణి లక్ష్మీతేజ జ్ఞాపకార్థం డార్మెంటరీని నిర్మించారు. గురువారం ఆయన కుమార్తె బోయళ్ల సాయి ప్రవర్తిక భవనాన్ని ప్రారంభించారు. వసతి గృహం భవనం శిథిలావస్థకు చేరుకోగా విద్యార్థుల సౌకర్యార్థం డార్మెంటరీని అందుబాటులోకి తెచ్చిన దాతను జిల్లా బీసీ సంక్షేమ అధికారి వెంకటయ్య ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఏబీసీడబ్ల్యూ శ్రీదేవి, వార్డెన్ మల్లేశ్వరీ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ప్రవేశాలకు తుది కౌన్సెలింగ్ ప్రారంభం

కావలి రూరల్, జూలై 11: పాలిటెక్నిక్ ప్రవేశాలకు సంబంధించిన కౌన్సిలింగ్ షెడ్యూలును సాంకేతిక విద్యాశాఖ అధికారులు విడుదల చేసినట్లు రుద్రకోట పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సుశీల్ కుమార్ ప్రియ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి కౌన్సిలింగ్‌కు హాజరుకాని విద్యార్థులు 11వ తేదీ నుండి 13వ తేదీ వరకు జరిగే ఆన్‌లైన్ ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి ధ్రువపత్రాల పరిశీలన చేయించుకోవాలన్నారు. రెండవవిడత ధ్రువపత్రాల పరిశీలన నెల్లూరు వెంకటేశ్వర పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతాయన్నారు. ఆప్షన్ల నమోదుకు జూలై 14వ తేదీ వరకు సమయం కేటాయించినట్లు తెలిపారు. 16వ తేదీ నిర్దేశించగా 18వ తేదీ నుండి 20వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో విద్యార్థులు సెల్ఫ్ జాయినింగ్ అయ్యి కళాశాలలో రిపోర్టు చేయాలన్నారు

చెరువు మట్టి అక్రమంగా తరలింపు

బిట్రగుంట, జూలై 11: బోగోలు మండలం ముంగమూరు పంచాయతీలోని చెరువులోని మట్టిని కొందరు వ్యక్తులు రాత్రి పగలు తేడా లేకుండా గురువారం యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నారు. చెరువులో నీరు తగ్గడంతో ఎక్కడ పడితే అక్కడ లోతైన గోతులు తీస్తున్నారు. అక్రమార్కులకు కావల్సిన మట్టిని ఎక్స్‌కవేటర్‌తో ట్రాకటర్లలో నింపుకుని గ్రామాల్లో నుంచే తరలిస్తున్నారు. పేదవాడు తట్టెడు మట్టి తీసుకుపోతుంటే పట్టుకుని కేసులు రాసే పోలీసులు ఈ విషయంతో ఉలుకుపలుకు లేకుండా చోద్యం చూస్తున్నారు. బోగోలు చెరువులో కూడా అనుమతులు లేకుండా విచ్చలవిడిగా మట్టి, గ్రావెల్ తరలింపులు కొనసాగుతున్నాయి. ఈ విషయమై తహసీల్దారు వెంకటరత్నంను వివరణ కోరగా ఎవరికీ తాము అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. చెరువులో మట్టి తరలింపు విషయం రెవెన్యూ అధికారులకు సంబంధించిందని ఎంపీడీవో అన్నారు.

పాదయాత్రకు మద్దతు

బిట్రగుంట, (దగదర్తి) జూలై 11: దగదర్తి మండలం కాట్రాయిపాడుకు చెందిన టీడీపీ మండల ఉపపాధ్యక్షుడు తాళ్లూరు సుధాకర్‌నాయుడు, ఆయన అనుచరుల బృందం దగదర్తి మండలం నుంచి పొదలకూరుకు గురువారం చేరుకుంది. ఈ పాదయాత్రకు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు సంఘీభావం తెలిపారు.

రేపు కావలిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

కావలి, జూలై 11: మున్సిపాల్టీ పరిధిలోని అన్ని విద్యుత్ సబ్‌స్టేషన్లలో శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ పట్టణ ఏఈ వై.వసంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాకాలం రానున్న దృష్ట్యా విద్యుత్‌లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలు తొలగింపు, విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లు మరమ్మతు పనుల కోసం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదు

● అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

కందుకూరు, జూలై 11: అభివృద్ధిలో భాగంగా చేపట్టే ప్రతిపనిలో నాణ్యత పాటించాల్సిందేనని ఎక్కడా నాణ్యతా లోపాన్ని సహించేదిలేదని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కందుకూరు మున్సిపాలిటీలో 55 లక్షల రూపాయలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు గురువారం ఆయన భూమిపూజ నిర్వహించారు. గాయత్రీనగర్‌లో రూ. 25.17 లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ కాలువ, 2వ వార్డు ఉర్దూస్కూల్ వద్ద రూ. 15.29 లక్షలతో సీసీ రోడ్డు, 32వ వార్డు శ్రీచైతన్య విద్యాలయం వెనుక 14.53 లక్షల రూపాయలతో చేపట్టనున్న సిమెంటురోడ్డు నిర్మాణ పనులకు ఆయన అధికారులు, స్థానిక నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పనులు నాణ్యతగా చేపట్టాలని అధికారుల పర్యవేక్షణా లోపం ఉన్నట్లు ఫిర్యాదులొచ్చినా సహించేది లేదని పేర్కొన్నారు. మున్సిపల్ శాఖామంత్రి నారాయణతో మాట్లాడి మరిన్ని నిధులు తీసుకురావటం జరుగుతుందని, మున్సిపాలిటీలో ఇక నిరంతరం అభివృద్ధి పనులు జరుగుతూనే ఉంటాయని పేర్కొన్నారు. భూమిపూజ సందర్భంగా ఆయా ప్రాంతాలలో స్థానికుల అభ్యర్థన మేరకు డ్రైనేజీ కాలువలను పరిశీలించిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ కేవీ కృష్ణారెడ్డి, టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, పొడపాటి నాగేశ్వరరావు, బత్తిన మాల్యాద్రి, దారం మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

పన్నుల అక్రమ వసూళ్లను అరికట్టండి

అల్లూరు, జూలై 11: నార్తుమోపూరులో ఇంటి పన్ను అక్రమ వసూళ్లను అరికట్టి, వసూళ్లకు పాల్పడగా వచ్చిన నగదు రికవరీ చేయడంతో పాటు వసూళ్లకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు రేబాల శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్థులు గురువారం కమిషనరు ఫణికుమార్‌ను కోరారు. ఈ విషయంపై వినతిపత్రం అందజేసి మాట్లాడారు. నార్తుమోపూరు సచివాలయ కార్యదర్శి వరప్రసాద్ ఇష్టానుసారంగా వసూళ్లకు పాల్పడ్డారని వినతిలో పేర్కొన్నారు. పన్ను నగదును వసూలు రశీదును ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేసుకొని రశీదును కూడా ఆన్‌లైన్ ఫార్మాట్‌లో మంజూరు చేయక మ్యానువల్ రశీదులు ఇచ్చారన్నారు. అంతేకాకుండా అనేకమంది వద్ద నగదు తీసుకొని రశీదులు కూడా ఇవ్వలేదన్నారు. దీనిపై ప్రశ్నిస్తే ప్రజలకు పొంతనలేని సమాధానం ఇస్తున్నారని చెప్పారు. ఇదంతా స్థానికంగా ఉండే ఓ వ్యక్తి ద్వారా అధికారి తతంగం జరిపించారన్నారు. నగదు పంపిణీ విషయంలో వారిరువురి మధ్య అభ్యంతరాలు వ్యక్తమవడంతో ఆ వ్యక్తిని సదరు అధికారి తొలగించారన్నారు. దీనిపై సత్వరమే చర్యలు తీసుకొని ఇలా అక్రమంగా సదరు అధికారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవలని కమిషనరును కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ సదరు అధికారిపై పోలీసు కేసు నమోదు చేయించడంతోపాటు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్టూరు విజయకుమార్ రెడ్డి, కోనంరెడ్డి సత్యం, కేతిరెడ్డి శివారెడ్డి, పొన్నగంటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


కమిషనరుకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచి రేబాల తదితరులు

ట్రంకు రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు

కావలి, జూలై 11: పట్టణం దక్షిణ శివారు నుంచి ముసునూరు శివారు వరకు గుంటలు మిట్టలుగా ఉన్న రోడ్డునకు అధికారులు గురువారం మరమ్మతు పనులు చేపట్టారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి చొరవ తీసుకుని ఆ గుంటలు, మిట్టలకు కంకర మిక్సింగ్ వేయించి చదును చేయిస్తుండటంతో వాహన చోదకులు, ముసునూరు ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేశారు. వర్షాకాలం వచ్చిందంటే ఆ రోడ్డులో ప్రయాణం ఒక నరకంగా ఉండేదని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి ఇంటి సమీపంలో రోడ్డు మరీ అధ్వానంగా ఉండి చిన్న వర్షం పడినా అక్కడ చెరువును తలపించేదని చెప్పారు. వాస్తవంగా ట్రంకు రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వంలో నిధులు మంజూరైనా ఆ కాంట్రాక్టర్ ఆదాయం వచ్చే రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలువలను కొంత మేరకు చేపట్టి వదిలివేశారు.

పూడికతీత, రోడ్డు వెడల్పు పనుల ప్రారంభం

కావలి, జూలై 11: పూడికతో నిండిన మురుగు కాలువలను శుభ్రం చేయడం, కంపచెట్లతో కుదించుకు పోయిన రోడ్లను వెడల్పు చేసే కార్యక్రమాన్ని చేపట్టినట్లు గురువారం కావలి మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని 19వ వార్డులోని బైరాగుల కాలనీ, బీరువాల ఫ్యాక్టరీ ప్రాంతాల్లో జరుగుతున్న పనులను టౌన్ ప్లానింగ్ అధికారి బాబూరావుతో కలిసి పరిశీలించి మాట్లాడారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆదేశాల మేరకు కావలిలో అధ్వానంగా ఉన్న డ్రైన్లు, రోడ్లను గుర్తించి వాటికి మరమ్మతు పనులు చేపట్టామన్నారు. వర్షాకాలం వస్తుండటంతో పూడికతో నిండిన డ్రెయిన్లలో వర్షపునీరు పోయేందుకు ఇబ్బందులు లేకుండా పూడికను ఎక్స్‌కవేటర్‌లతో తొలగిస్తున్నట్లు చెప్పారు. అలాగే పట్టణంలో అనేక చోట్ల రోడ్లు కంపచెట్లు, చెత్తా చెదారంతో మూసుకుని పోవటంతో వాటిని తొలగించి రోడ్లను వెడల్పు చేస్తున్నట్లు తెలిపారు.

పీఎం విశ్వకర్మ యోజనలో తొలి రుణం మంజూరు

సంగం, జూలై 11: స్థానిక ఎస్‌బీఐ బ్యాంకులో పీఎం విశ్వకర్మ యోజన పథకంలో కార్పెంటర్ పెనుబర్తి సురేష్ ఆచారికి జిల్లాలో తొలి రుణం రూ.లక్ష మంజూరయ్యింది. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మధుసూదన్‌రావుతో కలిసి విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ఖాజన వెంకటశేషయ్య ఆచారి మాట్లాడారు. చేతివృత్తిదారుల జీవనోపాధి మెరుగు పరిచేందుకు పీఎం ఈ పథకాన్ని ప్రవేశపెట్టడం హర్షణీయం అన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఏలూరు బాబుఆచారి, రఘునాథ్‌ఆచారి, రఘురామయ్యాచారి, వరప్రసాద్ ఆచారి, శివప్రసాద్ ఆచిరి తదితరులు పాల్గొన్నారు.

విట్స్‌లో పీఎం ఉపాధి కల్పన జిల్లా స్థాయి సదస్సు

కావలిటౌన్, జూలై 11: గ్రామీణ పరిశ్రమల స్థాపన ద్వారా స్వయం ఉపాధి కల్పన పొందవచ్చని ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమీషన్ డైరెక్టర్, డాక్టర్ గ్రూప్ అసిస్టెంట్ డైరెక్టర్ కోటిరెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణ విట్స్ కళాశాలలో ప్రధానమంత్రి ఉపాధి కల్పన జిల్లాస్థాయి సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ దత్తాత్రేయ శర్మ అధ్యక్షతన జరిగిన సదస్సులో పాల్గొన్న కోటిరెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖాధికారి సుధాకర్, జిల్లాస్థాయి బ్యాంకుల అధికారి ప్రవీణ్‌లు పాల్గొన్నారు. గ్రామీణ పరిశ్రమలు ఎలా స్థాపించాలి వాటితో యువత స్వయం ఉపాధి పొందే అవకాశాలు, బ్యాంకుల నుంచి రుణాలు ఎలా పొందాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ గిరీష్ గాంధీ, డాక్టర్ మధుకర్, డాక్టర్ రజ్బి తదితరులు పాల్గొన్నారు.

బడాబాబులు నా భూమిని ఆక్రమించారు !

● న్యాయం చేయాలని బాధితుడి మొర

కావలి, జూలై 11: పట్టణంలోని బడాబాబులు పెట్రోల్ బంకు నిర్మాణం కోసం తన భూమిని కొంత ఆక్రమించుకుని వారి స్థలంలో కలుపుకున్నారని బాధితుడు ఎం.వెంకటేశ్వరరెడ్డి వాపోయారు, కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముసునూరులోని 154, 158, 162 సర్వే నంబర్లలో 1993లో తనకు 2ఎకరాలను రెవెన్యూ అధికారులు పట్టా ఇచ్చారన్నారు. తాను సాగుచేసుకుంటున్న ఆ భూమి పక్కనే అక్కడ నిర్మాణాలు చేపడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి అనుచరులు కొందరు స్థలాన్ని ఆక్రమించుకున్నారని చెప్పారు. దానికి మాజీ ఎమ్మెల్యేతోపాటు రెవెన్యూ అధికారులు కూడా సహకరించారని చెప్పారు. దీంతో వారు తనకు పట్టా ఇచ్చిన భూమిని ప్రభుత్వం నుంచి నామినల్ రేట్‌కు తీసుకునేందుకు ఫైలు సిద్ధం చేసినట్లు తెలిసిందన్నారు. తాను కోర్టును ఆశ్రయించినా ఆక్రమణదారులు పట్టించుకోవటం లేదని చెప్పారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి, ఉన్నతాధికారులు స్పందించి తమ భూమిని తనకు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న బాధితుడు వెంకటేశ్వరరెడ్డి

లార్వా నిర్మూలనకు చర్యలు

ఆత్మకూరు, జూలై 11 : డెంగ్యూ నివారణ మాసోత్సవం సందర్భంగా గురువారం వాశిలిలో లార్వా నిర్మూలన కార్యక్రమం చేపట్టారు. గ్రామ నడిబొడ్డున ఉన్న కోనేరులో గాంబూషియా చేపలను వదిలారు. కార్యక్రమంలో ఆత్మకూరు సబ్ యూనిట్ ఆఫీసర్ షేక్ ఖాదర్‌బాష, వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కౌలు రైతు కార్డులతో బహుళ ప్రయోజనాలు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూలై 11: అర్హులైన ప్రతిఒక్కరికి కౌలు రైతు కార్డులు అందజేయనున్నట్లు తహసీల్దారు యశోద, మండల వ్యవసాయాధికారి వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వోలు, వీపీఏలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో రైతులకు కౌలు రైతు కార్డులపై అవగాహన కల్పించాలన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మండలంలో 346 మంది రైతులకు కౌలు కార్డులు అందించడమే లక్ష్యమన్నారు. కౌలుకార్డు వల్ల రైతులకు అనేక ప్రయోజనాలను తెలిపారు.


దుత్తలూరు(ఉదయగిరి రూరల్): మాట్లాడుతున్న తహసీల్దారు

ఉదయగిరి : ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని కౌలు రైతులకు కౌలు కార్డులు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి అంజనేయులునాయక్ అన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో వీఆర్వోలు, వీపీఏలకు అవగాహన సమావేశం నిర్వహించారు.

సీతారామపురం: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ కృష్ణారెడ్డి, మండల వ్యవసాయ అధికారి చెన్నారెడ్డిల అధ్యక్షతన మండలంలోని వీఆర్వోలు, వీపీఏలకు కౌలురైతులకు కౌలుపత్రాల పంపిణీపై గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ 12వ తేదీ నుంచి 5 రోజుల పాటు 9రైతు సేవా కేంద్రాల్లో గ్రామసభలు నిర్వహించి, మన మండలానికి ప్రభుత్వం కేటాయించిన 367 టార్గెట్‌ను రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. మండల వ్యవసాయ అధికారి చెన్నారెడ్డి మాట్లా డారు. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ కౌలు రైతులకు సర్టిఫికెట్ ఇవ్వడంతో రైతులు బ్యాంక్ లోన్, ఈ పంట నమో దు, అన్నదాత సుఖీభవ పథకాలు పొంద వచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీనివాసులు, ఏఈఓ పాల్గొన్నారు.

చేజర్ల: స్థానిక రైతుసేవా కేంద్రంలో గురువారం కౌలు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దారు గోపీకృష్ణ, వ్యవసాయశాఖ అధికారి వి.శశిధర్ పాల్గొని మాట్లాడారు. కౌలు రైతులకు సీఆర్‌సీ కార్డులు మంజూరు చేస్తారని, అవి ఎలా పొందాలి, ఎలంటి పత్రాలు కావాలి, వాటి ఉపయోగాలు వివరించారు. రైతు సేవా కేంద్రాలలో సీసీఆర్‌సీ కార్డులపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఏవో వి.శశిధర్ తెలిపారు. కార్యక్రమంలో డీటీ అశోక్, ఎఈవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కలువాయి: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో గురువారం కౌలు రైతులకు కార్డులు పొందుటకు కావాల్సి అర్హతలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కౌలుదారునికి వ్యవసాయ పంటలకు కనీసం ఏకరం, ఉద్యావన పంటలకు ఏకరం లోపు సాగు చేయాలని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఇందు కోసం తగిన ధృవీకరణ పత్రాలతో గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్వో)ను సంప్రదించాలని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దారు సంజీవకుమారి, వ్యవసాయాధికారి ప్రతాప్, టీడీపీ నాయకులు చల్లా రఘురామిరెడ్డి, చల్లా శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

నర్రవాడకు తరలిన భక్తులు


ఊరేగింపుగా నర్రవాడ వెళుతున్న భక్తులు

ఉదయగిరి రూరల్, జూలై 11: సున్నవారిచింతల గ్రామానికి చెందిన భక్తులు వెంగమాంబ చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి ఊరేగింపుగా గురువారం నర్రవాడకు తరలివెళ్లారు. నర్రవాడ వెంగమాంబ సన్నిధిలో 16 రోజుల ఉత్సవం జరుగుతున్నట్లు వారు చెప్పారు.

భక్తులకు వసతులు కల్పించాలి


అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీవో మధులత

ఆత్మకూరు, జూలై 11: రొట్టెల పండుగ సందర్భంగా మండల కేంద్రంలోని దర్గాకు వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆర్డీవో మధులత తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో గురువారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం తాగునీటి వసతి, పారిశుధ్యం మెరుగుదలపై దృష్టి సారించాలని సూచించారు.

దర్గా కోనేరులో చేపల విడుదల

ఏఎస్ పేట, జూలై 11: నెల్లూరులో జరిగే రొట్టెల పండుగ సందర్భంగా ఏఎస్ పేట దర్గాకు లక్షల సంఖ్యలో భక్తులు విచ్చేయనున్నారు. దీంతో గురువారం వైద్యఆరోగ్య అధికారులు గంబూసియా చేపలను కోనేరులో వదిలారు. ఈ చేపలు దోమల లార్వాను తినేస్తాయి. దీంతో దోమలు వ్యాప్తి చెందకుండా ఉంటాయని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఖదర్‌బాషా తెలిపారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రొయ్యల సాగుపై అవగాహన

కావలి టౌన్, జూలై 11: పట్టణ ముసునూరులోని కల్యాణ మండపంలో గురువారం రొయ్యల సాగులో వ్యాధులు నియంత్రణ నివారణ చర్యలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిధిగా థాయ్‌లాండ్‌కు చెందిన కెసిస్టర్ యూనిర్శిటీ ప్రొఫెసర్ ప్రపంశాక్ పాల్గొని రొయ్య సాగులో వ్యాధుల గురించి వాటి నియంత్ర నివారణ గురించి రైతులకు డిజిటల్ స్క్రీన్‌పై ప్రదర్శనాత్మకంగా వివరించారు. అవంతి ఫీడ్స్ నిర్వాహకులు అవగాహన సదస్సులు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అవంతి ఫీడ్స్ సీనియర్ జీఎం.పరేష్‌కుమార్ శెట్టి, జీఎం .శ్రీనివాస్ మహంతి, నారాయణ రెడ్డి, నాగేశ్వరరావు, జయచంద్రా నాయుడు, రమేష్, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

బిట్రగుంట, జూలై 11: కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ బిట్రగుంట బ్యాంచ్ అధ్యక్షుడు గోవిందరాజు డిమాండ్ చేశారు. సానిక రైల్వే పీడబ్ల్యూ కార్యాలయం వద్ద సంఘ్ బ్రాంచ్ కార్మికులతో కలిసి గురువారం నిరసన చేపట్టారు. సౌత్ సెంట్రల్ రైల్వే ఎస్‌ఎఫ్‌ఐఆర్ జనరల్ సెక్రెటరీ రాఘవయ్య ఆదేశాల మేరకు 12వ తేదీ జోనల్ స్థాయిలో నిరసన కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి రాజశేఖర్, సభ్యులు పవన్‌కుమార్, సుధాకర్, సంఘ్ సభ్యులు, కార్మికులు ఉన్నారు.

జనాభా నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత

ఏఎస్ పేట, జూలై 11: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఏఎస్‌పేట పీహెచ్‌సీ వైద్యులు సురేష్, మంజుల ఆదేశాలతో గురువారం వైద్యఆరోగ్య సిబ్బంది వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అధికారులు, ఎఎన్‌ఎంలు, వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


ఏఎస్ పేటలో ర్యాలీ చేస్తున్న వైద్యాధికారులు

ఉదయగిరి రూరల్, జూలై 11: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా పట్టణంలో గురువారం వైద్యఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారులు శివకల్పన, వినీతలు మాట్లాడుతూ జనాభా నియంత్రణ ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. చిన్నకుటుంబం చింతలేని కుటుంబమని, కాన్పు మధ్య ఎడం తల్లీబిడ్డలకు ఆరోగ్యకరమన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శివకుమారి, ఆరోగ్య విద్యాధికారి కలసపాటి వెంకటసుబ్బయ్య, ఆరోగ్య సహాయకులు హసనయ్య, శ్రీనివాసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసం పెంపకంపై రైతులకు అవగాహన

సంగం, జూలై 11: మర్రిపాడు రైతు సేవా కేంద్రంలో గురువారం పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో పశుగ్రాసం పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీ జయచంద్ర మాట్లాడుతూ పశుగ్రాసం పెంపకం రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకం అందచేస్తుందన్నారు. రాయితీలో సీడ్స్ పంపిణీ చేస్తుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పాడి దిగుబడి ద్వార మంచి లాభాలు గడించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పశువైద్యాధికారి సుజని, వైద్యసిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఏఎస్ పేట : గుంపార్లపాడు, జమ్మవరం గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో గురువారం పంట సాగుపై అవగహన మండల వ్యవసాయ అధికారి రజిని అవగాహన కల్పించారు. ఈ నెల 20వరకు మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎఈవో చిరంజీవి, వీఆర్‌వో రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

లింగసముద్రం : పశు పోషకులు అధిక పాల దిగుబడి ఇచ్చే గ్రాసాలు సాగు చేసుకోవాలని మండలంలోని వీఆర్ కోట పశు వైద్యాధికారి డా.వై శ్రీకాంత్ చెప్పారు. పశు గ్రాస వారోత్సవాల సందర్భంగా గురువారం వీఆర్ కోటలోని పశు వైద్య కేంద్రంలో పశు పోషకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాడి రైతు తనకున్న భూమిలో కనీసం 10 సెంట్లలో అధిక పాల దిగుబడి ఇచ్చే గ్రాసాలు సాగు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశుగణన సహాయకులు సీహెచ్ మహేంద్ర, సిబ్బంది జె ప్రవీణ్, పి శ్రీను, రైతులు పాల్గొన్నారు.

కన్వర్షన్ భూమి పరిశీలన

ఉదయగిరి రూరల్, జూలై 11: మండలంలోని కుర్రపల్లి వద్ద ల్యాండ్ కన్వర్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న భూమిని గురువారం ఆత్మకూరు ఆర్డీవో మధులత పరిశీలించారు. అనంతరం ఉదయగిరి ఆనకట్ట వద్ద టూరిజం శాఖకు సంబంధించిన స్థలాన్ని ఆక్రమించారని కొందరు ఫిర్యాదు చేయడంతో సిబ్బందితో కలిసి ఆ స్థలాన్ని పరిశీలించారు. సర్వే నిర్వహించి ఆక్రమణ జరిగి ఉంటే తొలగించి హద్దులు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దారు పీవీ కృష్ణారెడ్డి, వీఆర్వోలు వెంకట్, అనూష, సర్వేయర్లు రవి, మీరావలి, సిబ్బంది పాల్గొన్నారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో మధులత

తీరు మారకపోతే చర్యలు తప్పవు

ఉదయగిరి, జూలై 11: ఉదయగిరి ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయా పనితీరు మారకపోతే చర్యలు తప్పవని ఐసీడీఎస్ పీడీ హేనాసుజనా హెచ్చరించారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు సమావేశాన్ని నిర్వహించారు. కేంద్రాలను ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తెరిచి ఉండాలన్నారు. ప్రభుత్వం అందజేసే పౌష్టికాహారం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందేలా చూడాలన్నారు. రికార్డులను సక్రమంగా నమోదు చేయాలన్నారు. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఉన్నారని, ఆయా గ్రామాల ప్రజలు తమ ఫిర్యాదులు వస్తున్నట్లు చెప్పారు. ఇలాంటి కార్యకర్తలను ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సీడీపీవో పద్మజ, సూపర్‌వైజర్లు తేజస్విని, షాను పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో రూ.2.15లక్షల అక్రమాలు

ఏఎస్ పేట, జూలై 11: మండలంలో 2023-2024 సంవత్సరంలో జరిగిన ఉపాధిహామీ పనుల్లో రూ.2.15లక్షల అక్రమాలు జరిగినట్లు గుర్తించి వాటి రికవరీకి ఆదేశించినట్లు ఉపాధిహామీ అడిషనల్ పీడీ విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని 19 పంచాయతీల్లో 975 పనులకు రూ.10కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. దీనిపై గత కొన్నిరోజులుగా సామాజిక తనిఖీ అధికారులు ఈ అక్రమాలు తేల్చారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, సామాజిక తనిఖీ సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమలకు టీడీపీ నేతల పాదయాత్ర

సంగం, జూలై 11: దగదర్తి మండలం కాట్రాయపాడుకు చెందిన మాజీ సర్పంచ్, ప్రస్తుత మండల పార్టీ ఉపాధ్యక్షుడు తాళ్లూరు సుధాకర్ నాయుడు స్వగ్రామం నుంచి చేపట్టిన తిరుమల పాదయాత్ర గురువారం ఉదయం సంగం కూడలికి చేకుకుంది. మొక్కు తీర్చుకునేందుకు తిరుమలకు తమ గ్రామం నుంచి పాదయాత్రగా వెళ్తున్నట్లు చెప్పారు.


సంగం: పాదయాత్రగా తిరుమలకు వెళ్తున్న టీడీపీ నేతలు

పాదయాత్రకు కలిగిరి వాసుల మద్దతు

కలిగిరి : కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయం సాధించడంతో ఆయన వీరాభిమాని నూకరాజు మదన్‌కుమార్ చేపట్టిన మాలకొండ పాదయాత్ర గురువారం మండలంలోని కమ్మవారిపాలెంకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయనకు గ్రామ తెలుగుదేశం నాయకుడు గన్నమనేని శ్రీనివాసులు సన్మానం చేసి స్వాగతం పలికారు. అనంతరం ఆయనతో కలిగిరి పట్టణం వరకు పాదయాత్ర నిర్వహించారు. కలిగిరి పట్టణంలో మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, టీడీపీ రాష్ట్ర రైతుకార్యనిర్వాహక కార్యదర్శి బీవీ రామారావు, నాయకులు మాదాల శ్రీనివాస్, లెక్కలరాంబాబు, గొల్లపూడి ప్రసాద్ పాల్గొన్నారు.

నేడే బ్రహ్మాండమైన విడుదల


రెయిన్ సినిమాస్ - నెల్లూరు
సిరి స్క్రీన్ 4 - నెల్లూరు
లత - కావలి
V EPIC - సూళ్లూరుపేట
సుందరమహల్ - గూడూరు
SUCHIN CINEMAS